ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 12, ఆగస్టు 2025



ఆకాశంలో అద్భుతం



పీసీపల్లిలో హరివిల్లు ఆవిష్కృతమైంది. స్థానికులను అబ్బురపరిచింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమైంది. సోమవారం వేకువజాము నుంచి ఒక్కో చినుకు రాలుతూ వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఉదయం 7.56గంటల సమయంలో నింగిలో ఇంద్రధనుస్సు దర్శనమిచ్చి పులకింపచేసింది.

- ఆంధ్రజ్యోతి, పీసీపల్లి

ఆకాశ గంగ



నల్లమల అడవుల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రాచర్ల మండలం జేపీ చెరువుకు సమీపంలోని రంగనాయకస్వామి ఆలయం వద్ద నెమలి గుండం జలకళను సంతరించుకుంది. కొండల మధ్య నుంచి నీరు కిందికి దుముకుతూ కనువిందు చేస్తోంది. ప్రజలు అక్కడికి వెళ్లి ఆసక్తిగా చూస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, రాచర్ల

హెచ్‌డీఎస్ నిధులు విడుదల

- జిల్లాకు తొలి విడత రూ.56.55 లక్షలు
- ప్రభుత్వ వైద్యశాలలకు కేటాయింపు



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) నుంచి మొదటి విడత రూ.56.55లక్షలు విడుదలయ్యాయి. అందులో ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఎంసీహెచ్‌లకు ఒక్కోదానికి రూ.1.60లక్షలు కేటాయించారు. జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కోదానికి రూ.60వేల చొప్పున ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, అత్యవసర మందుల కొనుగోలుకు ఏటా కేంద్రం హెచ్‌డీఎస్ నుంచి నిధులు ఇస్తోంది. ఈ ఏడాది ఒక్కో పీహెచ్‌సీకి 1.75లక్షలు, ఇతర వైద్యశాలలకు రూ.5లక్షలు రావాల్సి ఉంది. అందులో తొలివిడత నిధులను విడుదల చేసింది. ప్రస్తుతం జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఎంసీహెచ్‌లలో అవసరమైన మేర డబ్బులు లేక వైద్యాధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో కేంద్రం ఇచ్చిన నిధులతో కొంతమేర ఊరట కలగనుంది.



ఒంగోలు బ్రాంచి కాలువలో దర్శి వద్ద అతి తక్కువగా ప్రవహిస్తున్న నీరు

ఆయకట్టంతా..

అయోమయం

సాగర్ నీటి సరఫరాలో గందరగోళం

- సాధారణం కన్నా నెల ముందే విడుదల
- కృష్ణమ్మకు భారీ వరదలతో కాలువలకు నీటిని ఇచ్చిన ప్రభుత్వం
- సాగుకు ఉపక్రమించిన రైతులు
- డ్యామ్ గేట్ల మూసివేత సమయంలో ఇచ్చే నీటిని అధికారిక కోటాగా గుర్తింపు
- ఇప్పుడే ఇస్తే సంక్రాంతి తర్వాత ఇక్కట్లు
- జాగ్రత్తపడుతున్న అధికారులు
- కాలువలకు నీటి సరఫరా పరిమాణం తగ్గుతుండటంపై రైతుల్లో ఆందోళన
- వెంటనే పెంచాలని డిమాండ్
- స్పష్టత ఇవ్వలేకపోతున్న అధికారులు


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది సాగర్ నీటి సరఫరాపై గందరగోళ పరిస్థితి నెలకొంది. కృష్ణమ్మ పరవళ్లతో డ్యామ్‌లు నిండటంతో నీటి సరఫరాకు ఢోకా ఉండదన్న ఆనందంతో పంటల సాగుకు ఉపక్రమించిన రైతుల్లో ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది. కాలువల్లో నీటి సరఫరా హెచ్చు, తగ్గులు ఇందుకు కారణమయ్యాయి. నీటి సరఫరాను పర్యవేక్షించే జలవనరులశాఖ అధికారుల్లోనూ అయోమయ పరిస్థితి కనిపిస్తోంది. డ్యామ్‌కు వరదనీరు భారీగా వస్తూ గేట్లు ఎత్తి సముద్రానికి వదిలే సమయంలో కాలువలకు ఇచ్చే నీటిని వరద నీరుగానే కేఆర్ఎంబీ, తెలంగాణ ప్రభుత్వాలు గుర్తిస్తాయి. అలా కాకుండా డ్యామ్ గేట్ల మూసివేత అనంతరం ప్రత్యేకంగా కాలువల ద్వారా ఇచ్చే నీటిని ఆ సీజన్ అధికారిక కోటా కిందనే పరిగణిస్తారు. దీంతో ముందుగానే నీరిస్తే వాటా మేరకు పూర్తయి సంక్రాంతి తర్వాత అవసరానికి సరిపడా రాక అవస్థలు పడాల్సి వస్తుందని అధికారులు జాగ్రత్త పడుతున్నారు. ఉత్సాహంగా సాగుకు ఉపక్రమించిన రైతులు మాత్రం కాలువలకు సరఫరా తగ్గడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువల పరిధిలో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోని 11 లక్షల ఎకరాల ఆయకట్టులో సాగు, రెండు ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి అవసరాలకు 132 టీఎంసీల నీరు కేటాయింపు ఉంది. అందులో 4.34 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా 57 టీఎంసీలు (44శాతం) వినియోగించుకోవాలి. ఈ కేటాయింపులు దశాబ్దాల క్రితం చేశారు. దీంతో వాటా ప్రకారం ఉమ్మడి జిల్లాకు 57టీఎంసీల నీరు సరిపోవడం లేదు. దాదాపు 70టీఎంసీలపైన అవసరమవుతోంది. అది కూడా పుష్కలంగా వర్షాలు కురిసి, నీటి వాడకం తక్కువగా ఉండే ఆరుతడి పంటల్లో మొక్కజొన్న, పొగాకు వేస్తేనే. లేకపోతే 70 టీఎంసీల కన్నా ఎక్కువే అవసరమవుతుంది. వర్షాలు లేక బెట్టవాతావరణం నెలకొన్నప్పుడు, ఎగువన ఉన్న పల్నాడు

మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయుల బిల్లులకు మోక్షం

- రేపటి వరకు సప్లిమెంటరీలకు అవకాశం



ఒంగోలు విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న టీచర్లకు ఉపశమనం కలగనుంది. జిల్లాలో 5,642 మంది బదిలీ టీచర్లకు గత రెండు నెలలుగా జీతాలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ రంగ పాఠశాలలకు విద్యాశాఖ కొత్త కేడర్ స్ట్రెంగ్త్‌ను ప్రకటించింది. ఆ మేరకు టీచర్లకు పొజిషన్ ఐడీలు కూడా రూపకల్పన చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన కొత్త కేడర్ స్ట్రెంగ్త్ ప్రకారం డీడీవోలు జీతాల బిల్లులు సిద్ధం చేశారు. డీడీవోలు లాగిన్‌లో గతంలో ఉన్న క్యాడర్ స్ట్రెంగ్త్‌ను డిలీట్ చేసి కొత్త దాని ప్రకారం టీచర్ల పొజిషన్ ఐడీలతో లాగిన్‌లోకి చేర్చుకోవాలి. గత రెండు నెలలుగా జీతాలు ఆగిపోవడంతో ముందుగా అరియర్ జీతాలు డ్రా చేస్తేనే తర్వాత ఈనెల జీతాలకు తాజాగా బిల్లులు సమర్పించేందుకు వీలులేదు. దీంతో డీడీవోలు ముందుగా రెండు నెలల జీతాలు డ్రా చేసేందుకు సప్లిమెంటరీ బిల్లులను సిద్ధం చేశారు. జిల్లాలోని ఖజానా కార్యాలయాల్లో సోమవారం డీడీవోలు సప్లిమెంటరీ జీతాల బిల్లులను సమర్పించారు. నిబంధనల ప్రకారం నెలలో 10వతేదీ లోపు

మిగతా 6వ పేజీలో



‘ఉచిత పబ్లిసిటీ’లకు ఫుల్‌స్టాప్!

- ఇకపై అనుమతిలేని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండవ్
- లైసెన్స్ కలిగిన ఏజెన్సీల ద్వారా మాత్రమే ఏర్పాటు
- ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- హైకోర్టు ఆదేశాలతో మారనున్న పాలసీ
- ఆంక్షలు కఠినతరంతో పెరగనున్న ఆదాయం

7



ప్రమాదానికి గురైన బస్సు

7

ఘాట్ రోడ్డులో ప్రమాదం

- రెండు ఆర్టీసీ బస్సులు ఢీ
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- 5 గంటలపాటు నిలిచిన రాకపోకలు



7

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పెంపొందించేందుకు ర్యాలీలు

ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్‌అన్సారియా చెప్పారు. ఒంగోలులో సోమవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు.

నేడు ఒంగోలుకు రామ్‌గోపాల్ వర్మ

- పోలీస్ విచారణకు హాజరు



ఒంగోలు క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విచారణ నిమిత్తం మంగళవారం ఒంగోలు రానున్నారు. వ్యూహం చిత్రం ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌పై సోషల్ మీడియాలో ఆయన అనుచిత పోస్టులు పెట్టడంపై మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు

మిగతా 6వ పేజీలో

‘ముప్పా’కు సుప్రీంలో చుక్కెదురు

- ముందస్తు బెయిల్ తిరస్కరణ
- కింది కోర్టులోనే దాఖలు చేసుకోవాలని సూచన

వివరాలు మెయిన్‌లో..

ఇద్దరు మండల సర్వేయర్లు

సస్పెన్షన్

- 13 మంది సీనియర్ అసిస్టెంట్లకు రివర్షన్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు మండల సర్వేయర్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు సీసీఎల్ఏ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు రూరల్ సర్వేయర్ విష్ణువర్ధన్‌ను జరుగుమల్లి, అక్కడ పనిచేస్తున్న సర్వేయర్ బాబూరావును ఒంగోలు రూరల్ మండల సర్వేయర్‌గా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఇరువురు సర్వేయర్లు విధుల్లో చేరలేదు. ఈ విషయం సీసీఎల్ఏ దృష్టికి చేరింది. దీంతో ఆ ఇద్దరిపై ఆయన చర్యలు తీసుకున్నారు.

డిపార్ట్‌మెంట్ పరీక్షలు పాసు కాకపోవడంతో..

జిల్లాలోని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 13 మంది సీనియర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో)గా పనిచేస్తున్న 13 మందికి 2022లో సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి లభించింది. అయితే ప్రమోషన్ పొందిన వారు సర్వే శిక్షణతోపాటు డిపార్ట్‌మెంటల్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో 13మందిని వీఆర్వోలుగా రివర్షన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకం (స్త్రీ శక్తి) ఈనెల 15న ప్రారంభం కానుంది. ఈమేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీచేసింది. ఇప్పటికే జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లు కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. స్త్రీశక్తి కోసం ప్రకాశం రీజియన్ నుంచి 316 బస్సులను సిద్ధం చేశారు. వాటిలో పల్లె వెలుగులు 246, అల్ట్రా పల్లె వెలుగు 4, ఎక్స్‌ప్రెస్‌లు 74 ఉన్నాయి. వీటితోపాటు ఐదు ప్రధాన డిపోలు, 20 సాధారణ డిపోలలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రయాణికుల కోసం ఫ్యాన్లు, మరుగుదొడ్లు, వేచి ఉండేందుకు సీట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో నిన్నమొన్నటి వరకు కనీస ఆదరణకు నోచుకోని పలు ఆర్టీసీ బస్టాండ్‌లు ఇప్పుడు కళకళలాడుతున్నాయి.



స్త్రీ శక్తితో బస్టాండ్‌లకు కొత్తశోభ..!

- పాడుబడిన వాటికి మరమ్మతులు.. రంగులు
- ఫ్యాన్‌లు, తాగునీరు, సోఫాసెట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు
- మహిళల రక్షణ కోసం కండక్టర్లకు బాడీ కెమెరాలు



కనిగిరిలో ముస్తాబైన ఆర్టీసీ బస్టాండ్

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నిన్న మొన్నటివరకు కనీస ఆదరణకు నోచుకోని పలు ఆర్టీసీ బస్టాండ్‌లు ఇప్పుడు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పుణ్యమా అని అవి బాగుపడుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న స్త్రీశక్తి పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనుండగా, ప్రయాణ విషయంలో మహిళలకు అన్ని సౌకర్యాలు ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆర్ఎం సత్యనారాయణ ఆదేశాలతో ఆయా డిపోల మేనేజర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రయాణ సమయంలో మహిళలకు ఎక్కడా ఇబ్బందులు

మిగతా 6వ పేజీలో

ఒంగోలు నగర కమిషనర్‌కు స్పెషల్ గ్రేడ్‌గా ఉద్యోగోన్నతి


వెంకటేశ్వరరావు

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావుకు స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణాభివృద్ధి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది మునిసిపల్ గ్రేడ్ 1 కమిషనర్లను స్పెషల్ గ్రేడ్ కమిషనర్లుగా నియమించింది. ఈమేరకు ఒంగోలు నగర కమిషనరు వెంకటేశ్వరరావు స్పెషల్ గ్రేడ్ కమిషనరుగా కొనసాగనున్నారు. తొలుత కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన 2018లో గ్రూప్ -1 పోటీ పరీక్ష ద్వారా నేరుగా మునిసిపల్ శాఖలో విధుల్లో చేరారు. మొదట్లో నెల్లూరు, కావలి మునిసిపాలిటీలలో అసిస్టెంట్ కమిషనరుగా పనిచేశారు. ఆ తర్వాత, హిందూపురం, నర్సాపురంలో మునిసిపల్ కమిషనరుగా పనిచేసిన వెంకటేశ్వరరావు గత ఏడాది ఆగస్టు 28న ఒంగోలు కార్పొరేషన్‌కు గ్రేడ్ 1 కమిషనరుగా బాధ్యతలు స్వీకరించారు. కాగా ప్రస్తుతం ఆయనకు స్పెషల్ గ్రేడ్ కమిషనరుగా పదోన్నతి లభించడంతో ఒంగోలు కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా స్పెషల్ గ్రేడ్ కమిషనరుగా కొనసాగనున్నారు.

బైక్ బోల్తా.. పర్యాటకులకు తీవ్ర గాయాలు

క్షతగాత్రుల్లో ఒకరు, మార్టూరు, మరొకరు చిలకలూరిపేట వాసులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇరువురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం వేటపాలెం వద్ద జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం మార్టూరు మండలం బొబ్బేపల్లికి చెందిన బాషా, చిలకలూరిపేట బొప్పూడికి చెందిన షమీర్ కార్ పెయింటింగ్ దుకాణంలో పని చేస్తుంటారు. సోమవారం ద్విచక్ర వాహనంపై సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి వచ్చారు. అనంతరం సాయంత్రం సమయంలో తిరిగి వెళుతూ వేటపాలెం వద్ద వాహనం అదుపుతప్పి పడ్డారు. దీంతో షమీర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. బాషా కుడి చేతికి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జూదరుల అరెస్ట్

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం దాడిచేసి పేకాట రాయుళ్లను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోనికి తీసుకొని, వారి వద్ద ఉన్న రూ.5,200ల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్ఐ సీహెచ్ అనూష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు


లక్షరూపాయల నగదు అందజేస్తున్న సీఐ మల్లికార్జునరావు

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పంగులూరు మండలంలోని రేణంగివరం పోలీసుస్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఆదివారం గుండెపోటుతో మృతిచెందిన వెంకటస్వామి అంత్యక్రియలు సోమవారం సోపిరాలలో అశ్రునయనాలతో ముగిశాయి. జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు సోపిరాల గ్రామంలో సోమవారం అధికార లాంచనాలతో హెచ్‌సీ వెంకటస్వామి అంత్యక్రియలు నిర్వహించారు. సోపిరాలలోని ఆయన స్వగృహంలో వెంకటస్వామి పార్థీవదేహానికి చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, రేణంగివరం ఎస్ఐ. వినోద్ బాబు, స్థానిక ఎస్ఐ రమేష్‌లు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటస్వామి అంత్యక్రియల నిమిత్తం మట్టిఖర్చుల కోసం పోలీస్‌శాఖ నుంచి మంజూరైన లక్ష రూపాయల నగదును అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు. మృతి చెందిన వెంకటస్వామి భార్యహేమలతకు అందజేశారు.

15లోపు దత్తత ప్రక్రియను పూర్తి చేయాలి

పీ 4 కార్యక్రమంపై సమీక్షించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 15వ తేదీ నాటికి బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఈవో ఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేసి అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణాలలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పిల్లల ఆధార్ సీడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫారంపాండ్స్ నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ఆ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పలుశాఖల అధికారులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

సీఎం ఆదేశాలతో రూ.1.50లక్షల చెక్కు అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో దర్శి పట్టణానికి చెందిన ఒక కుటుంబానికి లక్షా 50 వేల రూపాయల చెక్కును కలెక్టర్ తమీమ్ అన్సారియా అందజేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం దర్శికి చెందిన గల్లెపోగు యలమంద, ప్రశాంతి దంపతులకు ఈ చెక్కును కలెక్టర్ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో అన్నదాతసుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సమయంలో దర్శికి చెందిన యలమంద, ప్రశాంతి దంపతులు పోలియో కలిగిన ఐదేళ్ల తన కుమారుడితో కలిసి సీఎంను కలిసి తమకుటుంబాన్ని అందుకోవాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తదనుగుణంగా సోమవారం కలెక్టర్ అన్సారియా ఈ చెక్కును ఆ దంపతులకు అందజేశారు. త్వరలో సదరం సర్టిఫికెట్ కూడా ఇస్తామని ఆ దంపతులకు కలెక్టర్ అన్సారియా హామీ ఇచ్చారు.

ఆయకట్టంతా అయోమయం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో రెండో పంట సాగు చేస్తే సంక్రాంతి తర్వాత ఉమ్మడి ప్రకాశంలో నీటి ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ఏడాది కూడా ఇలాంటి అనుభవం ఎదురైంది. ఆ సీజన్‌లో కూడా ముందుగానే నీరు ఇవ్వడంతో రైతులు సాగు చేపట్టగా ఫిబ్రవరి, మార్చిలలో డ్యామ్‌లో నీరు లేక అవస్థలు పడాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది సాగుకు సెప్టెంబరు 1నుంచి నీటిని ఇవ్వాలని అంతకు పక్షంరోజుల ముందు తాగునీటికి ఇవ్వాలని జిల్లా అధికారులు సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ ప్రకారమే ప్రణాళిక రూపొందించుకోవాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా యంత్రాంగానికి సూచనలు వచ్చాయి. అందుకు వీలుగా వేసవిలో తాగుకు ఇక్కట్లు పడకుండా జూన్‌లో ఒకసారి నీటిని కూడా ఇచ్చారు.

అనూహ్యంగా ముందస్తుగానే కాలువలకు నీరు

ఈ ఏడాది కృష్ణానదికి మరింత ముందుగా వరదలు వచ్చాయి. జూలై తొలిపక్షంలోనే డ్యామ్‌లకు భారీగా వరద నీరు రావడం ప్రారంభమైంది. దీంతో జూలై ఆఖరులోపే సాగర్ డ్యామ్ గేట్లను కూడా ఎత్తేశారు. కాలువలకు కూడా నీటిని వదిలారు. తదనుగుణంగా జిల్లాకు జూలై ఆఖరుకు నీరు వచ్చింది. అదేసమయంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు వస్తుండటంతో పూర్తి స్థాయిలో కాలువలకు నీటిని సరఫరా చేశారు.

ఒక్కసారిగా కాలువల్లో తగ్గిన సరఫరా

కృష్ణమ్మ పరవళ్లు, డ్యామ్‌లకు భారీగా వరద నీరు రావడాన్ని గుర్తించిన ఆయకట్టు రైతులు అందుబాటులో ఉన్న బోర్లు, చెరువులు, బావుల కింద వరి నార్లు పోశారు. కాలువల నీరు రావడంతోనే నాట్లకు కూడా ఉపక్రమించారు. ఈ తరుణంలో వారం తిరక్కుండానే సాగర్ కాలువలకు ఒక్కసారిగా నీటి సరఫరా తగ్గిపోయింది. జూలై ఆఖరులో జిల్లా సరిహద్దు 85/3 వద్ద దాదాపు 3వేల క్యూసెక్కుల నీరు సరఫరా కాగా, ప్రస్తుతం 800 క్యూసెక్కులకు పడిపోయింది.

ఎందుకు తగ్గించారంటే..

డ్యామ్‌కు వరద నీరు భారీగా వస్తూ గేట్లు ఎత్తి సముద్రానికి వదిలే సమయంలో కాలువలకు ఇచ్చే నీటిని కూడా వరద నీరుగానే కేఆర్ఎంబీ, తెలంగాణ ప్రభుత్వాలు గుర్తిస్తాయి. అలా కాకుండా డ్యామ్ గేట్లు మూసివేత సమయంలో డ్యామ్ నిండా నీరు ఉన్నా కాలువలకు ప్రత్యేకంగా ఇచ్చే నీటిని ఆ సీజన్ అధికారిక కోటా కిందనే పరిగణిస్తారని తేలింది. వారం క్రితం డ్యామ్‌గేట్లు మూసివేయగా అప్పటి నుంచి ఇచ్చే నీటిని అధికారిక కోటా కింద లెక్కిస్తే ముందుగానే వాడకం కోటా పూర్తవుతుంది. అదే జరిగితే సంక్రాంతి తర్వాత ఇక్కట్లు పడాల్సి వస్తుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీంతో ముందస్తు జాగ్రత్తగా కాలువల్లో సరఫరా తగ్గించి వేసినట్లు సమాచారం.

స్పష్టత ఇవ్వలేకపోతున్న అధికారులు

ముందుగానే నీటి సరఫరాతో ఉత్సాహంగా సాగుకు ఉపక్రమించిన సాగర్ ఆయకట్టు రైతులు తాజా పరిస్థితితో ఆందోళన చెందుతున్నారు. సాగు విషయంలో స్థానిక అధికారుల నుంచి స్పష్టత కూడా లేకపోవడంతో మరింత కలవరపడుతున్నారు. పక్షం క్రితం డ్యామ్ గేట్లు ఎత్తి సముద్రానికి నీరు వదిలినప్పుడు కాలువలకు పుష్కలంగా నీరు రావడం, వారం క్రితం గేట్లు మూశాక తగ్గించడం, ఇప్పుడు మళ్లీ డ్యామ్ గేట్లు ఎత్తడంతో మరోసారి కాలువలకు నీటి సరఫరా మెరుగుపడే అవకాశం ఉండటంతో వారిలోనూ అయోమయ పరిస్థితి కనిపిస్తోంది. గత అనుభవాల దృష్ట్యా మరో పక్షం తర్వాత నాట్లు వేసుకోవడమే మంచిదన్న అభిప్రాయాన్ని ఆశాఖలో అనుభవం ఉన్న ఓ కీలక అధికారి వ్యక్తం చేశారు.

స్త్రీ శక్తితో బస్టాండ్‌లకు కొత్త శోభ

(5వ పేజీ తరువాయి)

తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని డిపోలలో ప్లాట్‌ఫాంలు బాగుచేయిస్తున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. మరుగుదొడ్ల శుభ్రత, ఆర్టీసీ ప్రాంగణంలో పారిశుధ్యం మెరుగు, మంచినీటి వసతులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

మహిళ భద్రతకు బాడీ కెమెరాలు

మహిళలు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వారి భద్రత, ఇతర ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి మహిళా కండక్టర్ కచ్చితంగా బాడీ కెమెరాలు పెట్టుకోవాలని ఆదేశించింది. ఆ కెమెరాలను ఆయా డిపోలలో ఏర్పాటు చేసే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా మహిళలకు రక్షణ, భద్రతతోపాటు, సురక్షితమైన ప్రయాణ సౌకర్యం అందించవచ్చని ప్రభుత్వం భావిస్తుంది.

విధివిధానాలు ఇవీ..

జిల్లాలో సుమారు 60 శాతం మంది మహిళలకు స్త్రీశక్తి పథకం వర్తించనుంది. అయితే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్‌లలో అందుబాటులోకి తీసుకు వస్తోంది. ఈ ఐదుర కాల బస్సుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల్లో ఏదైనా చూపించి ప్రయాణించవచ్చు. అలాగే పాఠశాలలో, కాలేజీలో చదువుకునే విద్యార్థినులకు ఇకపై బస్‌పాస్ అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. సూపర్ లగ్జరీ, ఏసీ, గరుడ, అమరావతి వంటి ప్రీమియం బస్సులకు ఈ పథకం వర్తించదు. దీంతోపాటుగా ఇతర రాష్ట్రాల సర్వీసులలో కూడా ఉచిత ప్రయాణం వర్తించదని ఆర్టీసీ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న బైక్

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఎక్స్‌కవేటర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన కడవకుదురు గ్రామ సమీపంలోని 216వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలను ఎక్స్‌కవేటర్‌తో అమరుస్తుండగా, డ్రైవర్ సన్నెపోగు కోటేశ్వరరావు స్తంభాల కోసం ఎక్స్‌కవేటర్‌ను ఒక్కసారిగా పక్కకు మలిపాడు. అదే సమయంలో ఒంగోలుకు చెందిన జాల శంకరరావు, ఆయన భార్య శ్యామల చీరాల నుంచి ఒంగోలుకు ద్విచక్రవాహనంపై వెళుతూ ఎక్స్‌కవేటర్ టైర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో శంకరరావు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో ఆయన ముక్కు, నోటికి గాయాలయ్యాయి. ఆయన భార్యకు ఎటువంటి గాయాలు కాలేదు. గాయపడిన శంకరరావును జాతీయ రహదారి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎస్.రమేష్ పరిశీలించారు.

ఉపాధ్యాయుల బిల్లులకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

సప్లిమెంటరీ బిల్లులు పెట్టాలి. అయితే ఈనెల 8 నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో ఖజానా శాఖ నిబంధనల ప్రకారం బిల్లుల సమర్పణకు ముందు రోజులు సెలవులు వస్తే ఆ తర్వాత ఆ రోజుకు అవకాశం ఇస్తారు. దీని ప్రకారం బిల్లుల సమర్పణ గడువుకు మూడు రోజులు సెలవులు రావడంతో ప్రస్తుతం ఆ మూడు రోజులు బిల్లుల సమర్పించేందుకు అవకాశం ఇచ్చారు. దీని ప్రకారం డీడీవోలు ఈనెల 13వరకు సప్లిమెంటరీ బిల్లులను పెట్టేందుకు ట్రెజరీశాఖ అధికారులు అంగీకరిస్తారు. లాగిన్ కూడా అందుబాటులో ఉంటుంది. సప్లిమెంటరీ బిల్లులు వచ్చినవి వచ్చినట్లు ఎస్‌టీవోలు మంజూరు చేస్తున్నారు. ఈనెల 15 నాటికి అరియర్ జీతాలు జమ అయ్యే అవకాశం ఉంది. తర్వాత ఆగస్టు నెల జీతాలకు రెగ్యులర్ బిల్లులు సమర్పించాల్సి ఉంటుంది.

నేడు ఒంగోలుకు రామ్‌గోపాల్ వర్మ

(5వ పేజీ తరువాయి)

నమోదైన విషయం విదితమే. విచారణలో భాగంగా గత ఫిబ్రవరి నెలలో ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ ఎదుట హాజరైన వర్మ సరైన సమాధానం చెప్పలేదు. అయితే ఆయన హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోరారు. పోలీసు చర్యలు ఏమీ లేకుండా విచారణాధికారికి సహకరించాలని హైకోర్టు వర్మను ఆదేశించింది. దీంతో గతనెల 22న వర్మకు ఒంగోలు రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఈనెల 12న హాజరవుతానని సమాధానం ఇచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఒంగోలులోని తాలూకా పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీకాంత్‌బాబు ఎదుట వర్మ హాజరు కానున్నారు.

భార్యను హత్య చేసిన కేసులో భర్తకు రిమాండ్

సంతమాగులూరు ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. మండలంలోని ఏల్చూరు గ్రామంలో సల్లూరి సుబ్బమ్మను తన భర్త గిరిప్రసాద్ అలియాస్ మేరీబాబు శుక్రవారం అనుమానంతో కత్తితో నరికి చంపాడు. ఆ విషయమై సంతమాగులూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం సల్లూరి గిరి ప్రసాద్‌ను పోలీసులు గ్రామం సమీపంలోని సుబాబుల్ తోటల్లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

లారీ ఓనర్‌లకు పాత ధరలే ఇవ్వాలని వినతి

మార్కాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని ఇసుక డంపింగ్ యార్డ్ కాంట్రాక్టర్.. టన్నుకు రూ.950 మేరకు పాత ధర చెల్లించాలని మార్కాపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు టన్నుకు రూ.950 చొప్పున కాంట్రాక్టర్ చెల్లించారన్నారు. కానీ ఈ నెల 1వ తేదీ నుంచి రూ.800 మేర మాత్రమే ఇస్తామని కాంట్రాక్టర్ చెపుతున్నారన్నారు. ఈ నిర్ణయం వల్ల తీవ్రంగా నష్టపోతామని వారువాపోయారు. పాత ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బొందిలి కాశీరాంసింగ్, బాలాజీ సింగ్, ఉప్పులదిన్నె శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, షఫియుల్లాఖాన్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న లారీ ఓనర్లు


డీఎస్పీ డాక్టర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఇసుక సప్లయర్స్

మాకు గిట్టుబాటు ధర ఇస్తున్నారు

మార్కాపురం ఇసుక డపింగ్ యార్డ్ కాంట్రాక్టర్ గిట్టుబాటు ధరను ఇస్తున్నారని ఇసుక సప్లయర్స్ మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొందరు లారీ ఓనర్లు రాజకీయ దురుద్దేశంతోనే కాంట్రాక్టర్‌పై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇసుక సరఫరా చేస్తున్న లారీ ఓనర్లను భయభ్రాంతులకు గురి చేసేందుకు కూడా సిద్ధమయ్యారన్నారు. వారి బారి నుంచి ఇసుక సరఫరా చేస్తున్న లారీ ఓనర్లను రక్షించాలని కోరారు. అంతేకాక మార్కాపురంలో 2020 నుంచి లారీ ఓనర్స్ అసోసియేషన్ లేదన్నారు. కొందరు స్వార్థం కోసం అసోసియేషన్ నాయకులమని చెప్పుకుని ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. డీఎస్పీకి వినతి పత్రం అందజేసిన వారిలో నూనె శివారెడ్డి, వై.ఆంజనేయులు, పి.కోటి, ఎస్.వెంకటరామిరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవీఇవీ

డీఎస్సీ అభ్యర్థుల మార్కుల జాబితాలు విడుదల

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ 2025 అభ్యర్థుల నార్మలైజేషన్ జాబితాను శనివారం రాత్రి విడుదల చేసింది. మెగా డీఎస్సీకి 629 పోస్టులు ప్రకటించగా, 21,559 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసి రాత పరీక్షలకు హాజరయ్యారు. అభ్యర్థులకు డీఎస్సీ ఎంపికలో టెట్‌లో సాధించిన మార్కులకు 20 శాతం, రాత పరీక్షకు 80 శాతం మార్కులు వెయిటేజీ ఇచ్చారు. ప్రస్తుతం అభ్యర్థుల టెట్, డీఎస్సీ మార్కులను కలిపి స్కోర్ కార్డులను ప్రభుత్వం ప్రకటించింది. కొందరు టెట్ అర్హత లేకున్నా పరీక్షకు హాజరయ్యారు. వారిని తొలగించారు.

ప్రశాంతంగా ఎఫ్ఏ పరీక్షలు

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి ప్రారంభమైన ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ-1) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలను ప్రథమంగా ప్రయోగాత్మకంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్లలో నిర్వహిస్తున్నారు. గతంలో తెల్లకాగితంలో రాసే జవాబులను ప్రస్తుతం అసెస్‌మెంట్ బుక్‌లో రాస్తారు. ప్రతి సబ్జెక్టుకు వేర్వేరుగా బుక్‌లెట్లు ఇచ్చారు. పరీక్షలు ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం సబ్జెక్టులకు నిర్వహించారు. 1నుంచి 10వ తరతి వరకు చదువుతున్న విద్యార్థులు 1.76 లక్షల మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేయాలి. సబ్జెక్టుల వారీగా తరగతి వారీగా పరీక్షను నెంబర్లు కేటాయించారు. ఏ పరీక్ష బుక్‌లెట్‌లో ఆ పరీక్ష కోడ్ నెంబరును నమోదు చేయాలి. ప్రశ్నలకు జవాబులను ఓఎంఆర్ షీట్లలో నమోదు చేయాలి. ఉపవిద్యాధికారులు, ఎంఈవోలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

ఏకేయూ బీఈడీ ఫలితాలు విడుదల

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన బీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం రిజిస్ట్రార్ బి. హరిబాబు విడుదల చేశారు. మొత్తం 93.47శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో 10,955 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10,339 మంది పాసయ్యారు. యూనివర్సిటీ స్థాయిలో, కళాశాల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.సోమశేఖర్, పీజీ కో ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్, శివరాం పాల్గొన్నారు.

ఆ విత్తనాల అమ్మకాలను ఆపాలి

● దుకాణ యజమానికి ఏవో లావణ్య ఆదేశం

మార్టూరు, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): విత్తనదుకాణంలో షాహిన్ గుమ్మడి విత్తనాల అమ్మకాలను నిలిపివేయాలని ఏవో లావణ్య ఆదేశించారు. సదరు కంపెనీ విత్తనాలు సరిగా మొలకెత్తలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆమె స్పందిస్తూ, మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన మార్టూరులోని దుకాణాన్ని ఆమె పరిశీలించారు. అదేవిధంగా రూ.32,500 విలువైన షాహిన్ గుమ్మడి విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. ఇంకా ఫిర్యాదు చేసిన రైతు పొలంజె పంగులూరు మండలంలోని కొండమంజులూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉందని, అక్కడి వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని ఆమె రైతుకు సూచించారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు


పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హుస్సేన్

మేదరమెట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో భూమిలో సేంద్రియ కర్బనం, జీవవైవిధ్యం పెరుగుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షేక్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రాసంగులపాడులో నవధాన్యాల సాగు చేసిన మోదుగుల స్వామిరెడ్డి పొలాన్ని పరిశీలించారు. 1.20 ఎ కరాలల్లో 97.75 కిలోల దిగుబడి వచ్చిందని, ఎ కరాకు 16 టన్నుల సేంద్రిక కర్బనం వచ్చిందన్నారు. దీని ద్వారా నేలలో తేమను నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతుందని, నేల గుల్లబారి వానపాముల సంఖ్య పెరుగుతుందని అన్నారు. పశువుల మేతగా ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఈ పద్ధతులను ఆచరించాలన్నారు.

విజయవంతంగా ఇంటర్‌డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈక్రమంలో చివరి రోజు విజేతలకు ఎమ్మెల్యే కొండయ్య యువనాయకులు గౌరీఅమరనాథ్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడలపై ఆసక్తితో అంతర్ జిల్లాల నుంచి వేలసంఖ్యలో క్రీడాకారులు రావడం అభినందనీయమన్నారు. క్రీడల్లో పాల్గొనడం వలన అత్యంత ఉల్లాసంగా, ఆనందంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

వాడరేవు (చీరాల), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించకుని ప్రతిఇంటిపై 12, 13, 14 తేదీలలో జాతీయ జెండా ఎగరాలని బిజెపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వాడ రేవు గ్రామం నుంచి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ఘనతను వాడవాడలా చాటేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హేమంత్‌కుమార్, మణికుమార్, దేవరాజ్, వెంకటేశ్వరరావు, భరణి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు ఎంపీడీవోపై విచారణ

తర్లుపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళపై ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడడంతో జూలై 23వ తేదీన కేసు నమోదైంది. ఈ మేరకు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సోమవారం విచారణ చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళను, సిబ్బందిని ఒక్కొరిని పిలిచి విచారించారు. మహిళ ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసుపై కూడా విచారణ చేపట్టారు. ఆయనవెంట ఎస్ఐ బ్రహ్మానాయుడు, సిబ్బంది ఉన్నారు.



గాయపడిన శ్రీలక్ష్మీ

ఘాట్ రోడ్డులో ప్రమాదం

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

పలువురికి స్వల్ప గాయాలు

5 గంటల నిలిచిన రాకపోకలు

పెద్ద దోర్నాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు వేగం అదుపు తప్పి ఢీకొన్న సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డులో తుమ్మలబైలు-చిన్నారుట్ల మధ్య మూలమలుపు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నూజివీడు బస్సు డ్రైవర్ ప్రవీణ్, ఆత్మకూరు బస్సు డ్రైవర్‌లు షేక్షావలి, నారాయణ, తెనాలికి చెందిన శ్రీలక్ష్మీ, వెంకటరావు, గోపి, రాధిక, విజయవాడకు చెందిన రామిరెడ్డిలకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆత్మకూరు నుంచి శ్రీశైలం వైపు వెళ్తుండగా, నూజివీడు డిపోకు చెందిన బస్సు శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వస్తోంది. మూలమలుపు వద అదుపు తప్పి రెండు బస్సులు ఢీకొన్నాయి. ఢీకొన్న రెండు బస్సులు రోడ్డుకు అడ్డంగా ఉండిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలు ఇరువైపులా కిలోమీటర్ల మేర నిలిచిపోయింది. పరిస్థితి గమనించిన కొం దరు 108కి సమాచారం అందించారు. అంబులెన్స్‌లో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. బాధితులు దోర్నాల పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

5 గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం



నిలిచిన ట్రాఫిక్

శ్రీశైలం - దోర్నాల ఘాట్ రోడ్డులో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు 5 గంటల పాటు నిలిచిపోయాయి. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఘటనా స్థలం రెండు వైపులా కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోవడంతో యాత్రికులు పలు ఇక్కట్లకు గురయ్యారు. వాతావరణం చల్లగా ఉండడం కొంత ఊరట నిచ్చింది. పోలీసు సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో స్థలానికి వెళ్లి రెండు బస్సులను పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

డీజే ట్రూప్‌లో ఓ శుభకార్యానికి హాజరుకాగా ఘటన



నాగేంద్రబాబు మృతదేహం

అద్దంకి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ధర్మవరంలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన గుర్రాల నాగేంద్రబాబు(25) తన తండ్రి కోటేశ్వరరావు, సోదరుడు, మరికొందరు బృందంతో ఆదివారం రాత్రి డీజే సౌండ్స్, బ్యాండ్ మేళం బృందంతో వచ్చాడు. పెండ్లి పూర్తయిన తరువాత వర్షం పడుతుండటంతో డీజే సౌండ్స్ పరికరాలపై పట్ట కప్పారు. భోజనం చేసిన తరువాత బయలుదేరేందుకు సిద్ధమవుతూ అర్ధరాత్రి 12 గంటల సమయంలో పట్టతొల గిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ప్రవేట్ వాహనం లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేంద్రబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న బంధువులు సోమవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. భార్య, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.



విలపిస్తున్న భార్య, కుటుంబసభ్యులు

ఆ రోడ్లను చూస్తే ఆయన మనస్సు గతుక్కుమంటుంది!

ప్రజాహితమే ఆ మాస్టారి జీవన గమనం

పాడైపోయిన రోడ్లకు పింఛన్ డబ్బుతో సొంతగా మరమ్మతులు

ఏడు పదుల వయస్సులోనూ అవిరళ కృషి

కనిగిరిలో ప్రశంసలు అందుకుంటున్న అభినవ గాంధీ

కనిగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ప్రజాహితం కోసం ఓ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చేస్తున్న కృషిని అందరూ మెచ్చుకుంటున్నారు. ఎంతోమంది విద్యార్థులకు పాఠాలు చెప్పి వారి అభ్యున్నతికి మార్గం వేసిన ఆ మాస్టారు.. నేడు పాడైపోయిన రోడ్లను బాగుచేస్తూ సేవానిరతిలో నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఏడు పదుల వయస్సు దాటినా యువకుడిలా ప్రజా క్షేమం కోసం ఆయన పరితపిస్తున్నారు. అందుకే ప్రజలు ఆయనను అభినవ గాంధీగా పిలుస్తుంటారు.

ప్రతి నెలా వచ్చే పింఛన్‌లో 4 వేల ఖర్చు...

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన పాపసాని కృష్ణారెడ్డి ఎన్నో ఒడిదొడుకులతో విద్యనభ్యసించి 1986లో ఉద్యోగం సాధించారు. 24 ఏళ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి కనిగిరి మండలంలోని తాళ్లూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. ప్రతి నెలా వచ్చే పెన్షన్‌లో రూ.4 వేలతో తన ఖర్చుల కోసం ఉంచుకుని మిగిలిన వాటిని ప్రజాహితం ఖర్చు చేస్తున్నాడు. ఇంకా అవసరమైతే తెలిసిన వారి సహకారం పొంది గుంతలు పడిన రోడ్లను తాత్కాలిక మరమ్మతులు చేయటం, ప్రధాన రోడ్లను మూసివేసేలా ఉండే చిల్లచెట్లను తొలగించి ప్రమాదాల నివారణకు పాటుపడటం ఆయన నిత్యకృత్యం.



మార్జిన్ గుంతను పూడ్చేందుకు కంకరు కలుపుకుంటున్న మాస్టారు



వైఎస్సార్ రోడ్డులో చప్టాను రోడ్డుకు కనెక్టు చేస్తూ కంకరుతో పనిచేస్తున్న మాస్టారు

కూలీ అవతారంలో...

ఆయన దైనందిన జీవితంలో ఏ రోజూ పని చేయకుండా ఉండరంటే అతిశయోక్తి కాదు. రోడ్ల మరమ్మతులకు పనులు చేసేందుకు గతంలో కూలీల చేత చేయించే ఆయన వారికి ఇచ్చే కూలీకి సరైన న్యాయం చేయరనేది ఆయన అభిప్రాయం. అందుకే స్వయంగా తానే కూలీగా మారి సిమెంటు, కంకరు, ఇసుక, నీటిని ఒక్కొక్కటిగా తన సైకిల్‌పై తీసుకు వచ్చి తానే రోడ్లను మరమ్మతుల చేసి గుంతలు పూడుస్తుంటాడు. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే వైఎస్సార్ రోడ్డులో టీచర్స్ అకాడమీకి వెళ్లే సిమెంటు రోడ్డు చప్టా సరిగా లేక అకాడమీకి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గమనించారు. చప్టాకు రోడ్డు కనెక్ట్ అయ్యేవిధంగా తానే ఎప్పటిలాగా సైకిల్‌పై మెటీరియల్ తెచ్చి కూలీగా మారి ఎర్రటి ఎండలో పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా ఎర్రటి ఎండ నన్నేమి చేయదని, తనకు అనారోగ్యం దరి చేరదని, ఇంతవరకూ టాబ్లెట్ వేసుకోలేదని చెప్పారు. ఇలాంటి ప్రజాహితం కోరే మాస్టారును నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి.



పాపసాని కృష్ణారెడ్డి

ఇకపై 'ఉచిత పబ్లిసిటీ'లు ఉండవ్..!

అనుమతిలేని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లకు చెక్

లైసెన్స్ కలిగిన ఏజెన్సీల ద్వారా మాత్రమే ఏర్పాటు

ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

హైకోర్టు ఆదేశాలతో మారనున్న హోర్డింగ్‌ల పాలసీ

ఆంక్షలు కఠినతరంతో ఆదాయవనరులు పెంపు

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇకపై నగరాలు, పట్టణాలలో ఉచిత పబ్లిసిటీలు ఉండవ్.. ఇప్పటి వరకు పుట్టినరోజుకు ఫ్లెక్సీ, పదవుల్లొస్తే ఫ్లెక్సీ. వివాహాలకు ఫ్లెక్సీ. వర్ధంతులకు ఫ్లెక్సీ రాజకీయ పార్టీల సభలకు రోడ్డుకడ్డంగా ఫ్లెక్సీలు.. ఈ తరహా సంస్కృతి ఇటీవల కాలంలో మరింత శ్రుతిమించింది. రోడ్డు కిరువైపులా ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా, అధికారుల ఆదేశాలు పట్టించుకోకుండా ఎక్కడ చూసినా ఫ్లెక్సీలే. ఇకపై ఇలా కుదరదు. ఫ్లెక్సీల కారణంగా పెరుగుతున్న ప్రమాదాలు, ప్రజల ఆవేదన, విమర్శలతో హోర్డింగ్‌ల పాలసీపై హైకోర్టు ప్రత్యేక ఆదేశాలు జారీచేసింది. హోర్డింగ్‌ల పాలసీకి నిబంధనలు అమలు చేయాలని, అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని హెచ్చరించింది. కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీల అనుమతి పొంది, లైసెన్స్ కలిగిన ఏజెన్సీల ద్వారా మాత్రమే పబ్లిసిటీలు చేసుకోవాలని ఆదేశించింది.



ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు

గతంలో నిబంధనలివీ...

- హోర్డింగ్‌ల అనుమతికి మునిసిపల్, పోలీసుల అనుమతి తప్పనిసరి.
- బోర్డులకు విద్యుత్ అధిక వినియోగం, రంగురంగు లైట్లు వినియోగించకూడదు.
- అశ్లీల దృశ్యాలు, హింసాత్మకమైనవి, మహిళలు, పిల్లలకు ఇబ్బంది కలిగించేవి హోర్డింగ్‌లపై నిషేధం
- ప్రార్థన మందిరాలు, పార్కులు, విద్యాసంస్థలు, చారిత్రాత్మక స్థలాలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, శ్మశాన వాటికల వద్ద హోర్డింగ్‌లకు అనుమతి లేదు.
- జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే రోడ్డు క్రాసింగ్‌లు, బ్రిడ్జిలు, ప్రధాన కూడలి వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదు.
- వాణిజ్య, పరిశ్రమ భూముల్లోనే ప్రచార హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇల్లు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు, ప్రజలు నివాసిత ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు నేరం.
- నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు మొదటిసారి రూ.5వేలు, రెండోసారి రూ.10వేలు, ఆ తర్వాత రూ.25 వేలు జరిమానా విధిస్తారు.
- అనధికార హోర్డింగ్‌లకు అనుమతిచ్చే భవన యజమానులకు జరిమానా విధిస్తారు.

ఆంక్షలతో ఆదాయం..

నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఆదాయవనరుగా ఉన్న హోర్డింగ్‌ల అనుమతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసే హోర్డింగ్‌లకు అనుమతిపొందాల్సి ఉంది. ఇకపై ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసే వారిపై పురపాలక శాఖ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. ఒంగోలుతోపాటు జిల్లాలోని పలు మునిసిపల్ పట్టణ ప్రాంతాలలో హోర్డింగ్‌ల ఏర్పాటు సమస్యాత్మకంగా మారిన సంఘటనలు కోకొల్లలు. ప్రజలు ఆకర్షించే విధంగా నగరంలోని ప్రధాన సెంటర్ల కూడలి ప్రాంతాలతోపాటు, రహదారుల మధ్య సెంటర్ డివైడర్‌ను సైతం ప్రకటనలకు అనుమతులిస్తున్న మునిసిపాలిటీల సొంత నిర్ణయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. ఆంక్షలు కఠినతరం చేయడం ద్వారా ప్రమాదాల నివారణ, ప్రజల నుంచి విమర్శలు లేకుండా చేయడంతోపాటు, ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

నాడు టీడీపీ హయాంలో పకడ్బందీగా

2016 డిసెంబరు నెల 1 నుంచి ఒంగోలు నగరంలో ఫ్లెక్సీను నిషేధిస్తున్నట్లు టీడీపీ ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఫ్లెక్సీల ఏర్పాటు ఇష్టారాజ్యమైంది. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వెలుస్తున్నా, గడిచిన ఐదేళ్లలో టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పెద్దగా దృష్టి సారించలేదు. తాజాగా హైకోర్టు దీనిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదని ఆదేశించింది. మునిసిపల్ అధికారులు మంజూరు చేసిన లైసెన్స్ కలిగిన ఏజెన్సీల ద్వారా మాత్రమే ప్రచారాలు నిర్వహించుకోవాలని ఆదేశించడంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

హైకోర్టు ఆదేశాలతో కొత్త నిబంధనలు

- ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై నూతన పాలసీ అమలు చేయనున్నారు
- ఏజెన్సీల నుంచి ఫీజు వసూలు చేయాల్సి ఉంది
- హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు పెట్టే ప్రతి ఏజెన్సీ మునిసిపాలిటీ, కార్పొరేషన్ సంస్థల నుంచి విధిగా లైసెన్సు పొందాలి
- అక్రమంగా, అభ్యంతరకమైన ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే తొలగింపు ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- మునిసిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి.

హత్య కేసులో నిందితుడిపై బస్టాండ్‌లో దాడి

మార్కాపురం కోర్టులో విచారణకు హాజరు

తిరిగి కడప జిల్లా వెళ్లేందుకు బస్ ఎక్కగా ఘటన

కంట్లో కారం చల్లి ఇనుపరాడ్‌తో దాడికి యత్నం

ప్రత్యర్థిని అడ్డుకున్న తోటి ప్రయాణికులు

మార్కాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నిందితుడు కోర్టులో వాయిదాకు హాజరై తిరిగి వెళ్తుండగా ప్రత్యర్థులు కంట్లో కారంచల్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డికి అదే గ్రామంలో ప్రత్యర్థి వర్గంతో 1997లో బాంబులు వేసుకున్న కేసు ఉంది. ఈ కేసులో బాపిరెడ్డి వర్గానికి వ్యతిరేకంగా కిష్టిపాటి వెంగళరెడ్డి సాక్ష్యం చెప్పారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న బాపిరెడ్డి వర్గం 2018లో వెంగళరెడ్డి కుటుంబంపై హత్యాయత్నానికి పాల్పడింది. ఈ క్రమంలో వెంగళరెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడినా అతని కుమారుడు మృతి చెందాడు. కుమారుడు మృతి చెందిన కేసు అప్పటి నుంచి మార్కాపురం ఆరో అదనపు జిల్లా కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ హత్య కేసులో వాయిదా నిమిత్తం సోమవారం మార్కాపురం ఆరో అదనపు జిల్లా కోర్టుకు నిందితుడు బాపిరెడ్డి హాజరయ్యాడు. తిరిగి ప్రస్తుతం అతను నివాసముంటున్న కడప జిల్లా బి.మఠం గ్రామానికి వెళ్లేందుకు మార్కాపురం బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడ కడప బస్సు ఎక్కాక ఈదర గ్రామానికి చెందిన ప్రత్యర్థి కిష్టిపాటి వెంగళరెడ్డి అదే బస్సులో ఎక్కి బాపిరెడ్డి కంట్లో కారం చల్లి ఇనుప రాడ్డుతో దాడి చేయబోయాడు. సహచర ప్రయాణికులు కేకలు వేసి అడ్డుకోవడంతో వెంగళరెడ్డి పారిపోయాడు. వెంటనే బాపిరెడ్డి కోర్టుకు వెళ్లి తనపై జరిగిన దాడిని వివరించారు. న్యాయమూర్తి సూచన మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన సీఐ పి.సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌లు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రయాణికులను విచారించారు. అంతేకాక సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.



దాడికి గురైన బాపిరెడ్డి

పుల్లలచెరువు ఎస్ఐ నుంచి కాపాడండి

మీకోసంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

విచారణకు ఆదేశించిన దామోదర్

త్రిపురాంతకం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు ఎస్ఐ నుంచి తనను కాపాడాలని కోరుతూ బాధితుడు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల కిందట అమ్మిన స్థలం ధర ఇప్పుడు తగ్గిందని, దానిని కొన్న వ్యక్తి నష్టపోయారు.. అతనికి ఇంకా నువ్వు బాకీ ఉన్నావని బెదిరించి తనవద్ద రూ.35లక్షలకు ప్రామిసరీ నోటు రాయించిన ఎస్సై సంపత్‌కుమార్ బారి నుంచి తనను కాపాడాలని ఎర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామానికి చెందిన యక్కలి అప్పారావు కోరారు. ఒంగోలులో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పుల్లలచెరువుకు చెందిన వ్యాపారి గజ్జల్లి భాస్కరరావుకు 2023 మే25న తాను వైపాలెంలో 22 సెంట్ల స్థలం అమ్మానని అప్పుడే రిజిస్ట్రేషన్ జరిగిందని బాధితుడు పేర్కొన్నారు. ఇప్పుడు దాని రేటు తగ్గిందని కొన్నప్పుడు ఇచ్చిన డబ్బుకు వడ్డీ కడితే ఇంకా రూ.35లక్షల వరకు వస్తాయని ఇప్పుడు భాస్కర్ ఎస్సై సంపత్‌కుమార్‌తో కలిసి తనను ఇబ్బంది పెట్టారని చెప్పారు. కానిస్టేబుల్ కొలుకుల వచ్చి తనను పుల్లలచెరువుకు తీసుకెళ్లారని అక్కడ పోలీస్‌స్టేషన్‌లో తనను సాయంత్రం వరకు ఉంచి భౌతిక దాడి చేసి హింసకు గురిచేశారన్నారు. ఆ సమయంలో భాస్కర్‌ను ఎదురుగా ఉంచి తన నుంచి బలవంతంగా వేరువేరు తేదీలతో (జూలై 24, 25, 26) విడివిడిగా రూ.35లక్షలకు మూడు ప్రామిసరీ నోట్లు తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నారని వాపోయారు. ఈ విషయం ఎక్కడైనా చెపితే కేసు కట్టి జైలుకు పంపుతానని బెదిరిస్తున్నారని, ఎస్ఐ బారి నుంచి కాపాడి తన ప్రామిసరీ నోట్లు తనకు ఇప్పించాలని బాధితుడు ఎస్పీని వేడుకొన్నారు. ఈ విషయంపై స్పందించిన ఎస్పీ వెంటనే విచారణ జరిపి 15 రోజుల్లోగా ఈ ఫిర్యాదుపై నివేదిక ఇవ్వాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజును ఆదేశించారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు అప్పారావు



ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్వో ఓబులేష్, ఆర్టీవో, డీఈవో, ఆర్డీవో

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పెంపొందించేందుకు ర్యాలీలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరిలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్‌అన్సారియా చెప్పారు. ఒంగోలులో సోమవారం ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీని నెల్లూరు బస్టాండు మీదుగా రిమ్స్, మి నీ స్టేడియం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 3వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని పెంపొందించమే హర్ ఘర్ తిరంగా ర్యాలీల ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీటీసీ సుశీల, వివిధ శాఖల అధికారులు కిరణ్‌కుమార్, రాజేశ్వరి, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

5.96లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా 1నుంచి 19 ఏళ్లలోపు చిన్నపిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది. పిల్లల ఆరోగ్యంపై నులిపురుగుల తీవ్ర ప్రభావం చూపిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నులిపురుగుల నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా 1నుంచి 19 ఏళ్లలోపుపిల్లలు 5,96,751 మంది ఉన్నారు. వారందరికి పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం సమయంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నారు. ఒంగోలులోని పీవీఆర్ హైస్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని విద్యార్థుల చేత మాత్రలు మింగించనున్నారు. మంగళవారం ఈ మాత్రలు వేసుకొని పిల్లలకు ఈనెల 20న మరోసారి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నులి పురుగుల సమస్య 1నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారి తీయడమేకాకుండా శారీరక, మానసిక ఎదుగుదలకు కూడా ఆటంకంగా ఏర్పడుతుంది. ఇంకొక వైపు కడుపులో పల చేరడం వల్ల నొప్పి, మంట, వికారం కలుగుతాయి. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుంది. జిల్లాలోని పిల్లలందరూ ఈ మాత్రలు వేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు కోరారు.

మహిళకు గాయాలు

అద్దంకి,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన ఘటన మండలంలోని కొటికలపూడి పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ సాగర్ కాలనీ వద్ద చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు పంగులూరు మండలం ముప్పవరానికి చెందిన కందుల మరియకుమారి అద్దంకి మండలం రాళ్లపల్లిలో బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం కుమారుడి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. దీంతో గాయపడ్డ మరియకుమారిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.



స్థలం కేటాయించాలని ఆందోళన చేస్తున్న మాజీ సైనికులు

మాజీ సైనికులకు స్థలం కేటాయించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మాజీ సైనికులకు కాలనీ కోసం స్థలం కేటాయించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. జై జవాన్ మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మార్కాపురంలో కాలనీకి స్థలం కేటాయించాలని గత 20 ఏళ్ళ నుంచి అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మాజీ సైనికుల కాలనీ కోసం స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషసాయి, హరినారాయణ రెడ్డి, రామకృష్ణ, తిరుమలయ్య, వెంకటేశ్వర్లు, ఈటిరెడ్డి, రసూల్ ఉన్నారు.



ఇంజనీరింగ్ తరగతుల ప్రారంభానికి ముందు జ్యోతి వెలిగిస్తున్న కళాశాల సిబ్బంది

రైజ్‌లో ఇంజనీరింగ్ తరగతుల ప్రారంభం

ఒంగోలు విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సెక్రటరీ శిద్దా హనుమంతరావు కళాశాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రారంభంనుంచే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం అయితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోగలరన్నారు. కోశాధికారి శిద్దా భరత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో తమ గ్రూపు సబ్జెక్టుల్లో పట్టు సాధించాలన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్కాల చిన రంగమన్నార్ మాట్లాడుతూ తమ సంస్థలో చేరిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ భాస్కరరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు శిద్దా ప్రవల్లిక, ప్రిన్సిపాల్ కేవీ సుబ్రహ్మణ్యం, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

డిగ్రీ అధ్యాపకుల నిరసన

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీఅధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జీసీజీటీఏ, జీసీటీఏ రాష్ట్రశాఖల పిలుపు మేరకు అధ్యాపకులు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిగ్రీ అధ్యాపకులకు బదిలీలు నిర్వహించాలని, 42 జీవోను రద్దు చేయాలని తదితర డిమాండ్లను ఈనెల 18లోపు పరిష్కరించకపోతే విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీనివాసులు, యామిని అమ్మాజీ, సరళ, సుష్మ, బోధనేతర సిబ్బంది ఉన్నారు.



టీ తాగుతూ సమస్యలపై చర్చించుకుంటున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో రండి.., టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక బకాయిలను విడుదల చేయడంతో పాటు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రజిత మానస, సంఘం నాయకులు పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మ ప్రచార పాదయాత్ర

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధ ధర్మ ప్రచారకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో బౌద్ధ ప్రచార పాదయాత్రను నిర్వహించారు. స్థానిక మంగమూరు రోడ్డు జంక్షన్‌నుంచి గాంధీనగర్‌లో ఉన్న మూడు బొమ్మల సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ గౌతమ బుద్ధుడు, మహాత్మాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసినివాళులు అర్పించారు.

అధ్వానం.. అవస్థలమయం

గోతులతో నిండిన నగరంలోని పలు రహదారులు

ప్రమాదాల బారిన వాహనదారులు

నగరంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. పైపులైను రిపేరు పేరుతో, ఇంటర్నల్ కేబుల్ వేసేందుకు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేసిన గుంతలు ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి విస్మరించగా, కనీసం గుంతలు కూడా పూడ్చని పరిస్థితి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. కోట్లు వెచ్చించి అవసరమైన ప్రాంతాలకు ప్రధాన రోడ్లు నిర్మిస్తున్నారు. అయితే గతంలో నిర్మించిన కొప్పోలు రోడ్, కమ్మపాలెం రోడ్, ఆర్టీసీ డిపో సమీపంలో, కర్నూల్ రోడ్ పవర్‌ఆఫీస్ సమీపంలో, కొత్త కూరగాయల మార్కెట్, ఉడ్ కాంప్లెక్స్ ప్రాంతాలతోపాటు పలు చోట్ల రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టించుకుని అత్యవసరంగా ప్యాచ్ వర్క్‌లు చేసి, ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



ఆర్టీసీ డిపో వద్ద గుంతలుగా ఉన్న రహదారి



గుంతలమయంగా మారిన కమ్మపాలెం రహదారి



ఎఫ్‌సీఐ వద్ద రాళ్లు తేలిన రహదారి



లాయర్‌పేట రైతుబజారు వద్ద పగిలిపోయిన డ్రైన్ మూత



కర్నూల్‌రోడ్డులో రహదారిపై ఏర్పడిన పెద్ద గుంత

వ్యాధిగ్రస్థులకు మెరుగైన వైద్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న మంత్రి స్వామి

- మంత్రి స్వామి
- 36మందికి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

టంగుటూరు (కొండపి), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజేషన్ చేసి వ్యాధిగ్రస్థులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం 36 మందికి దాదాపు రూ.27 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మంత్రి స్వామికి కృతజ్ఞతలు

కొండపి ఉపసర్పంచ్‌గా ఇటీవల ఏక్రగీవంగా ఎన్నికైన కూనంనేని వాసంతి, కొండపి నాయకులు సోమవారం మంత్రి స్వామిని తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆయనకు బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

స్వామి, సత్యను కలిసిన పీఏసీఎస్ అధ్యక్షులు

టంగుటూరు (కొండపి)/మర్రిపూడి : టంగుటూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియమితులైన మక్కెన హరిబాబు తూర్పునాయుడుపాలెంలో మంత్రి స్వామిని, ఒంగోలులో మారిటైం బోర్డు చైర్మన్ సత్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బెల్లం జయంత్‌బాబు, చదలవాడ చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు. మర్రిపూడి, చిమట సహకార సంఘాల అధ్యక్షులు యర్రమోతు శ్రీనివాసులు, మలసాని కోటేశ్వరరావులు సోమవారం తూర్పునాయుడుపాలెంలో మంత్రి స్వామిని, దామచర్ల సత్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలనుంచి వచ్చే అర్జీలు పెండింగ్‌లేకుండా పరిష్కరించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్‌కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సంబంధిత శాఖలకు వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ఆశాఖ అధికారులపైనే ఉందన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, జాన్సన్, కుమార్‌తో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

గ్రామ వ్యవసాయ సహాయకుడి మోసంపై ఫిర్యాదు

ఒంగోలు(రూరల్) : అతి తక్కువ ధరకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇప్పిస్తానని ఉలిచి గ్రామవ్యవసాయ సహాయకుడుగా పనిచేసిన ఇండ్ల బాలకృష్ణ తమ నుంచి భారీగా నగదు వసూలు చేసి మోసగించాడని సోమవారం ఆయా పరిసర గ్రామాల రైతులు ఒంగోలు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్లకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు ఇప్పిస్తానని చేజెర్ల, బొద్దులూరివారిపాలెం, ఉలిచి గ్రామాల రైతుల నుంచి భారీగా నగదు వసూలు చేశాడని ఆఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉలిచి గ్రామవ్యవసాయ సహాయకుడుగా పనిచేసిన ఇండ్ల బాలకృష్ణ మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి బదిలీపై వెళ్లాడని,అధికారులు తక్షణ చర్యలు చేపట్టి తమ వద్ద వసూలు చేసిన నగదును ఇప్పించాలని రైతులు కోరారు.



గ్రీవెన్స్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

నిధులు రికవరీ చేయాలని వినతి

సంతనూతలపాడు : సంతనూతలపాడు సర్పంచ్‌గా 2013-18 కాలంలో పనిచేసిన ఆర్.అంకారావు పంచాయతీ నిధులు రూ.30,48,373లను దుర్వినియోగం చేశారని, వాటిని వెంటనే రికవరీ చేయడంతో పాటు కేసు నమోదు చేయాలని సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో కుంచాల వీరబ్రహ్మయ్య అనే స్థానికుడు కోరారు.

ఆటో బోల్తా.. ఇరువురు మహిళలకు గాయాలు

మర్రిపూడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆటో బోల్తా పడటంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన టంగుటూరు పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుండ్లసముద్రం చెరువు కట్ట వద్ద సోమవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కూచిపూడి నుంచి పొదిలి వైపు ఐదుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రోడ్డుపై గుంతను తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కూచిపూడికి చెందిన అంజమ్మ, బాలకోటమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

కొండపి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం వైద్యారోగ్యశాఖ అధికారులు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. డాక్టర్లు రవీంద్ర, నాగార్జున, పెట్లూరు పీహెచ్‌సీ సీహెచ్‌వో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలు బాగులేకున్నా.. కార్యక్రమాలకు కలెక్టర్ హాజరు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ తమీమ్ అన్సారియాకు కాలు బాగాలేకపోయినా కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఇటీవల దర్శిలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. ఆ సమయంలో వ్యవసాయ భూముల్లో తిరుగుతున్న సమయంలో కలెక్టర్ అన్సారియా కాలు స్లీప్ అయ్యి కింద పడ్డారు. దీంతో ఆ కాలు బెనకడంతో కట్టుకట్టారు. వారం రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమె సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమం అనంతరం బంగ్లాకు వెళ్ళారు. మరో ఐదారు రోజులు వైద్యాధికారులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.



కాలికి కట్టుతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న కలెక్టర్

శ్రీశైలంలో అతిథి గృహానికి శంకుస్థాపన

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 11:ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో అతిథిగృహానికి మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, లక్ష్మీపద్మావతి దంపతులు సోమవారం శంకుస్థాపన చేశారు. శ్రీశైల దేవస్థాన అనుమతితో వారు ఈ అతిథి గృహాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థాన అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామి వార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలు అందజేశారు.



అతిథి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శిద్దా దంపతులు

రేపు సింగరాయకొండలో మెగా జాబ్‌మేళా

సింగరాయకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్ పూర్తిచేసిన 18నుంచి 30 సంవత్సరాల వయసు ఉన్న వారు హాజరుకావచ్చు.



వివిధ వేషధారణలతో నిరసన తెలుపుతున్న కళాకారులు

కళాకారుల సమస్యలను పరిష్కరించాలి

- వివిధ వేషధారణలతో నిరసన ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి కళాకారులు వివిధవేషధారణలతో ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌మీదుగా నెల్లూరు బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ రంగస్థల నటుడు స్వర్గీయ బండారు రామారావు, డీవీ సుబ్బారావుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే ఉన్న గుర్రం జాషువా, ప్రకాశం పంతులు విగ్రహాలకు నివాళులు అర్పించి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ జరిగిన ధర్నాలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కళాకారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, జిల్లాపౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు వీఎస్‌రెడ్డి, వీరాంజనేయ నాట్యమండలి కార్యదర్శి మాకా ఆంజనేయులు, ది ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌కే బాబు, ఆనంత లక్ష్మి, గుడూరి సుధారాణి, యశోధ, శ్రీదేవి, ఎం. మల్లికార్జునరావు, బాలగురవయ్య తదితరులు ఉన్నారు.

కొప్పోలు మేజర్‌లో అభివృద్ధి పనులు

సంతనూతలపాడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట సమీపంలోని ఒంగోలు డీసీ పరిధిలో కొప్పోలు మేజర్ కెనాల్‌పై పుష్కర కాలం తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఈమేరకు నిధులు విడుదల చేయడంతో నీటి సంఘం అధ్యక్షుడు నల్లూరి కృష్ణారావు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. దీనిపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దగ్గరుండి పనులు చేయిస్తున్న కృష్ణారావు

బైక్ ఢీకొని పారిశుధ్య కార్మికురాలి మృతి

చీమకుర్తి,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉన్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలు విజయమ్మ(47) సోమవారం ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయమ్మ విధినిర్వహణలో భాగంగా పట్టణంలోని మసీద్‌సెంటర్ మెయిన్ రోడ్ వద్ద ట్రాక్టర్‌కు చెత్త ఎత్తుతుండగా వెనుక నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న బస్‌ను తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ పక్కనే ఉన్న విజయమ్మను ఢీకొట్టాడు.దీంతో బైక్‌కు ట్రాక్టర్‌కి మధ్య నలిగిపోయిన ఆమెను ఒంగోలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.



విజయమ్మ (ఫైల్)

జిల్లాలో 2.4 మి.మీ.సగటు వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు మండలాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 2.4 మి.మీ.వర్షపాతం నమోదైంది. ఒంగోలు అర్బన్‌లో 23.2 మి.మీ, ఒంగోలు రూరల్‌లో 23.2, త్రిపురాంతకంలో 11.6, కొమరోలులో 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో నాలుగైదు మండలాల్లో 1.6 మి.మీ.నుంచి 8.2 మి.మీ. వరకు వరకు వర్షపాతం నమోదైంది.

పోలేరమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

నాగులుప్పలపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో పోలేరమ్మ గుడి నిర్మాణానికి సోమవారం గ్రామస్థులు భూమిపూజ నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ నిర్మాణ స్థలంలో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు,యాగాలను నిర్వహించారు.అనంతరం భూమిపూజా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కౌసల్యం సర్వేను సద్వినియోగించుకోవాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న కౌసల్యం (వర్క్‌ఫ్రమ్ హోం) సర్వే 2025 ను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఐటీఐ, డిప్లొమా అంతకు మించి పై చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్న వారి విద్యార్హతతో కూడిన వివరాలను సర్వేలో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది చేపట్టే సర్వేలో నిరుద్యోగులు పాల్గొని తమ విద్యార్హత వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు క్రైం,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజిలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన సోమవారం రాత్రి జరిగింది. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం అనంతసాగరం నకు చెందిన ఉన్నం భాస్కర్ (19) కళాశాలలో ఉన్న ఖాళీ గదులలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

రోడ్లను కమ్మేసిన చిల్లచెట్లు

» ప్రమాదకరంగా పెద్దారవీడు - దేవరాజుగట్టు రహదారి

» మలుపులో తరచూ ప్రమాదాలు

పెద్దారవీడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పెద్దారవీడు - దేవరాజుగట్టు మధ్య చిత్తూరు జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. కానీ చేసిన పనులకు నిధుల మంజూరులో జాప్యం కారణంగా సదరు గుత్తేదారు పనులను నిలిపివేశారు. నాటి నుంచి నేటి వరకూ రోడ్డు నిర్వహణ



కొత్తపల్లి వద్ద రోడ్డుపైకి వచ్చిన చిల్ల చెట్లు

పెద్దారవీడు ఎస్సీ కాలనీ మూలమలుపు వద్ద బరన్స్‌ను దాటి పెరిగిన చిల్లచెట్లు

బాధ్యతలను రోడ్డు, భవనాల శాఖ అధికారులు మరిచారు. దీంతో రోడ్డు కొన్ని ప్రాంతాలలో గుంతలమయంగా మారింది. అంతేకాక చిల్ల చెట్లతో రోడ్డు ఇరువైపులా మూసుకుపోయింది. ముఖ్యంగా మూలమలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పూడుకుపోయిన బరన్స్

నిబంధనల ప్రకారం తారురోడ్డుకు ఇరువైపులా బరన్స్ ఉంటుంది. తారు రోడ్డుకు రెండు పక్కలా మట్టిరోడ్డును సాంకేతిక పరిభాషలో బరన్‌గా పిలుస్తారు. బరన్స్ తారురోడ్డుకు ఇరువైపులా 3 మీటర్ల వరకూ ఉంటుంది. సదరు బరన్స్ ఇప్పుడు చిల్లచెట్లతో మూసుకుపోయాయి. బిళ్లుల మంజూరులో నాటిపాలకులు బరన్స్‌లో చిల్లచెట్ల తొలగింపును విస్మరించారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మూలమలుపుల వద్ద, రాత్రి వేళ్లలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు తప్పడం లేదు.

నల్లమలలో భారీ వర్షం

» ఉధృతంగా ప్రవహించిన దొంగలవాగు

» జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు



కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు

పెద్దదోర్నాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ఎగువ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి అటవీ ప్రాంతంలోని దొంగల వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. మండల పరిధిలోని కొత్తూరు వద్ద ఉన్న దొంగలవాగు ప్రవహించడంతో ఆ వాగు జాతీయ రహదారిని దాటుతూ ప్రవహిస్తోంది. అయితే దశాబ్దాల కిందట నిర్మించిన చిన్న పాటి చప్టా కావడంతో వరద నీరు రోడ్డుపై అడ్డంగా ప్రవహించడంతో ఈ సమస్య ఏర్పడింది. ఈ వరద నీరు గంటవానిపల్లె చెరువుకు చేరుతుంది. పెద్ద వర్షాలు కురిసినప్పుడల్లా ఈ సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. మండలంలో మోస్తరు వర్షం కురిసింది.రెండు గంటల పాటు సాగిన వరద ప్రవాహానికి బ్రిడ్జికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల చొప్పున వాహనాలు నిలిపోయాయి. తదనంతరం వరద తగ్గిపోవడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఫసల్ బీమా నమోదుకు నిరీక్షణ

» పనిచేయని సర్వర్‌లు » ఆందోళనలో రైతులు

పొదిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటల బీమా నమోదుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ, సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా సర్వర్లు మొరాయిస్తుండడంతో బీమా నమోదు ప్రక్రియ సాగడం లేదని, దీంతో రోజూ కేంద్రాల వద్దకు వెళ్లి పడిగాపులు కాస్తున్నామని చెప్తున్నారు. మండలంలో కంది సాగుకు క్రాప్‌లోన్ ద్వారా 1574 మంది రైతులు, 4039 మంది రైతులు నేరుగా ఫసల్ బీమాను నమోదు చేసుకున్నారు. మొత్తంగా 2,532 హెక్టార్లలో కందికి ఫసల్ బీమా నమోదు చేసినట్లు ఏవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతు వాటాగా వరికి రూ.860, కందికి రూ.430, సజ్జకు రూ.156, ఎండుమిర్చికి రూ.4,500, మినుము రూ.205, నువ్వులు రూ.180 మాత్రమే చెల్లించాలి. ఈ నేపథ్యంలో తమ వాటా చెల్లించేందుకు మీ సేవా కేంద్రాలకు వెళితే సర్వర్‌లు పనిచేయడం లేదని రైతులు తెలిపారు. ఈనెల 14తో ఫసల్ బీమా నమోదు గడువు పూర్తికానుండడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏవో శ్రీనివాసరెడ్డి వివరణ ఇస్తూ.. అన్ని సర్వే నెంబర్లలో సమస్య రావడం లేదని రీసర్వే జరిగిన చోట సర్వే నెంబర్లకు మాత్రమే సర్వర్ సమస్య వస్తుందని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెండ్రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.



మీసేవా కేంద్రాల వద్ద పడిగాపులు గాస్తున్న రైతులు

భూసార పెంపుపై శిక్షణ

గిద్దలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగళవీడు గ్రామంలో ఆత్మ పథకంలో భాగంగా భూసారం పెంపొందించుకోవడంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాదికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడడం వలన భూమి యొక్క భౌతిక, రసాయన లక్షణాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇది నేల ఆరోగ్యం, పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని తెలిపారు. సూక్ష్మజీవులు నాశనం అవుతున్నాయని, భూమి చౌడుబారి పోతున్నదని, పర్యావరణ సమస్యలు వస్తున్నాయని, పెట్టుబడులు పెరుగుతున్నాయని తెలిపారు. దీని నివారణ కోసం సేంద్రీయ ఎరువులను వాడాలని, పచ్చిరొట్ట పంటను వేసి కలియదున్నాలని, పశువుల ఎరువు వాడుకోవాలని, నేలలో సేంద్రీయ కర్బనం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు గిద్దలూరులో భారీ ట్రాక్టర్ల ర్యాలీ

పాల్గొననున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతగా మంగళవారం ఉదయం 9గంటలకు ఒంగోలు రోడ్డులోని కొత్తపట్నం రెస్టారెంట్ నుంచి కుమ్మరాం కట్ట వరకు భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిరహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా మూల్యాంకన పరీక్షలు



ప్రశ్న పత్రాలను తీసుకు వెళ్తున్న హెచ్ఎంలు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాఠశాలలలో నిర్మాణాత్మక మూల్యాంకన పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 1 వతరగతి నుంచి 10 వతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలలో 8,232 మంది విద్యార్థిని, విద్యార్థులుండగా, ఉదయం 8 గంటలకే ఎంఈవో పీ ఆంజనేయులు పాఠశాలల హెచ్ఎంలకు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు ప్రశ్నపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంఈవో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష హాలును తనిఖీ చేశారు. విద్యార్థులకు బుక్‌లెట్ ఇచ్చి దానిలో రాయాలని సూచించినట్లు చెప్పారు. వీరభద్రాపురం పాఠశాలలో పరీక్ష హాలును ఎంఈవో 2 మల్లునాయక్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎంఈవోలతోపాటు హెచ్ఎంలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలి

పెద్దదోర్నాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో 23న జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు బాణాల రామయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు డీ శ్రీనివాస్, వైటీ ఆంజనేయులు, తిరుమలయ్య పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతోనే సంక్షేమం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో పలువురు నాయీబ్రాహ్మణులు కలిసి ప్రభుత్వం సెలూన్ దుకాణాలకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నాయీబ్రాహ్మణులకు వారి దుకాణాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తామని చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాయీ బ్రాహ్మణ సోదరుల దుకాణాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయడం జరిగిందని తెలిపారు. దీనితో నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు తొండమల్ల బ్రహ్మయ్య, రావిపాటి నాగరాజు, నారాయణ, శివరాంప్రసాద్, కాకర్ల రామేశ్వరరావు, రాచర్ల శ్రీనివాసులు, వెంకటరావు, రాచర్ల కాసులు, శ్రీను, జనార్దన్, చాకరిజాముల రామయ్య, శివశంకర్ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని పూలమాలు, శాలువలతో సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖమంత్రి లోకేష్, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయీబ్రాహ్మణుల పట్ల ఇంతటి ప్రేమను కనపరచిన ప్రభుత్వానికి తాము వెన్నుదన్నుగా ఉంటామని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కంభం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ (హిస్టరి), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (గణితం), బీఎస్సీ (జువాలజీ) కోర్సులు కలవని, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కొమరోలు మీదుగా హైదరాబాద్‌కు బస్సు

గిద్దలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నుంచి బీహెచ్ఈఎల్‌కు నిత్యం వెళ్లే బస్సు సర్వీసును కొమరోలు మీదుగా మళ్లిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరులో రాత్రి 8 గంటలకు బయలుదేరే ఈ బస్సు రాజుపాలెం, ఇడమకల్లు మీదుగా రాత్రి 8.45 గంటలకు కొమరోలు చేరుకుంటుందని, అక్కడి నుంచి తాటిచెర్లమోటు, బేస్తవారపేట, కంభం, ఎర్రగొండపాలెం, సాగర్ మీదుగా మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. ఈ మార్పు వెంటనే అమలులోకి తెస్తున్నామని, కొమరోలు ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీలను వెంటనే పరిష్కరిస్తాం

రాచర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం)కు వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో కాల్వపల్లి గ్రామం నుంచి ఇంటి స్థలం కోసం అర్జీ వచ్చిందని దానిపై విచారించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పొదిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దర్శి పొదిలి ప్రధాన రహదారిలో జూలై 24వ తేదీన ట్రాక్టర్ మోటార్ సైకిల్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేష్ మృతి చెందాడు. 15 రోజులుగా ఒంగోలులో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వెంకటేష్ సోమవారం మృతి చెందినట్లు కుటంబసభ్యులు తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



నర్సరీలను తనిఖీ చేస్తున్న అధికారి ఆదిరెడ్డి

నర్సరీల తనిఖీ

త్రిపురాంతకం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమేపల్లి రోడ్డులోని షేడ్‌నెట్ నర్సరీలను ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. నర్సరీ యాక్ట్ ప్రకారం ప్రతి నర్సరీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకుని ఉండాలని యాజమాన్యాలను హెచ్చరించారు. నర్సరీల్లో సాగు చేసే మిర్చినారుకు సంబంధించిన విత్తనాలను అధీకృత డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని వాటికి తగిన బిల్లులు చూపించాలని చెప్పారు. విత్తనాలకు సంబంధించిన రిజిష్టరు, సేల్ రిజిష్టరు, తనిఖీలకు, ప్రొటెక్షన్ రిజిస్టర్ తప్పక మెయింటెన్స్ చేయాలని ఆదేశించారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపి చెరువు అటవీ సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య సోమవారం తెలిపారు. కమీషనర్ దేవాదాయ ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరుగుతున్నాయని, ఈనెల 11వ తేదీ నుంచి 15 రోజులలోపు అభ్యర్థులు తమ దరఖాస్తులు ఆలయ కార్యనిర్వహణ అధికారికి పంపించుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 9603322656 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ

కొమరోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద దివ్యాంగుడికి ట్రై సైకిల్ ఇచ్చి ఆదుకున్న ఘటన మండలంలోని గోపానిపల్లి గ్రామంలోని జరిగింది. జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీవీ రాఘవరెడ్డి నివాసం వద్ద కొమరోలు సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ తాటిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జిల్లెల్ల తిరుపతయ్య నడవలేని స్థితిలో ఉండగా ట్రై సైకిల్‌ను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరంరెడ్డి శంకర్‌రెడ్డి, చెరువు అధ్యక్షుడు గోడి శ్రీరామిరెడ్డి, వార్డుమెంబరు సుభాని, ఖాష(బన్నీ), పాలుగుళ్ల రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న సంజీవరెడ్డి



ఎరిక్షన్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

ఎరిక్షన్‌బాబుకు పలువురి విజ్ఞప్తి

పెద్దదోర్నాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దోర్నాలలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం ఎంతో అవసరమని దీనిపై తగిన చర్యలు చేపట్టాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబును దోర్నాలకు చెందిన పలువురు కోరారు. మార్కాపురంలోని గూడూరి ఎరిక్షన్ బాబు నివాసంలో కలిసిన మాజీ ఎంపీపీ వేదాంతం ప్రభాకర్, సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు టీ రామిరెడ్డి, వైసీపీ నాయకులు యక్కంటి మల్లారెడ్డి, వీరనారాయణరెడ్డి, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ మాబు, మాజీ సర్పంచి పడిదెపు ఆదినారాయణ, లింగయ్య, కాశిరెడ్డి, శివ శంకరాచారి, వెంకటేశ్వరరెడ్డి బస్టాండు ప్రాముఖ్యతను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు.

సహకార సంఘ అధ్యక్షునికి సన్మానం

పొదిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మాదాలవారిపాలెం సహకార సంఘం అధ్యక్షనిగా ఎన్నికైన యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని మాజీ జడ్పీటీసీ సభ్యుడు కాటూరి పెదబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కందుల నారానాయనరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆయనకు పదవి రావడంపట్ల టీడీపీ అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. నాపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే కందులకు వెంకటేశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అఖీబ్‌అహ్మద్, టీఎన్ఎస్ఎఫ్ మాజీ అధ్యక్షుడు మామిళ్ల పల్లి వెంకటేశ్వర్లు, నాయకులు అంజిరెడ్డి, యాసిన్, రాము పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ చైర్మన్‌గా జవ్వాజి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న జవ్వాజి

మార్కాపురం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం సహకార బ్యాంక్ చైర్మన్‌గా దరిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ మాజీ మండల అధక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన ఎమ్మెల్యే కందులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన స్థలానికి మాదిగల నిరసన

కంభం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కంభం, కందులాపురం గ్రామ పంచాయతీల పరిధిలో నివసిస్తున్న మాదిగలకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ఎస్సీలు పలువురు కంభం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కు కిరణ్‌ను కలిసిన వారు మాట్లాడుతూ మాదిగ కుటుంబాలకు ప్రస్తుతం ఉన్న శ్మశాన స్థలం సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మాదిగల శ్మశాన వాటికకు ఎదురుగా ముందు భాగంలో ఉన్న స్థలాన్ని మాదిగల శ్మశాన వాటికకు ఏర్పాటు చేయడం వలన సమస్య పరిష్కారం అవుతుందని కోరగా తహసీల్దార్ స్పందించి స్థలాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కంభం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని శీలంవీధిలో కొందరు వ్యక్తులు రూ.కోటికి పైగా విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై తహసీల్దార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి శాలెంరాజు, జయరాజ్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కంభం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కంభం సమీపంలోని సూరేపల్లి గ్రామం వద్ద సోమవారం జరిగింది. మార్కాపురం రైల్వే కానిస్టేబుల్ హరిక్రిష్ణ కథనం ప్రకారం., 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి కంభం నుంచి గుంటూరుకు రైలు టికెట్ తీసుకున్నట్లుగా ఉంది. అతను కంభం రైలేస్టేషన్ సమీపంలోని సూరేపల్లి గ్రామం వద్ద రైలు కింద పడినట్లుగా గుర్తించారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం కంభం వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

తెలియకపోతే అడిగి తెలుసుకోండి



నూతన అసెస్మెంట్‌పై విద్యార్థులకు వివరిస్తున్న ఎంఈవో

రాచర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ప్రవేశ పెట్టిన అసెస్మెంట్ గురించి తెలియకపోతే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని ఎంఈవో-1 షేక్ మొయినుద్దీన్ అన్నారు. రాచర్లలోని ఆదర్శ పాఠశాల కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. 9, 10వ తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్ ఎలా తయారు చేయా లో ఆయన విద్యార్థులకు వివరించారు. నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

ఒంగోలు క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఐదుగురికి శిక్ష విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ దామోదర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బేస్తవారిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఐదుగురికి గిద్దలూరు కోర్టులో హాజరుపర్చగా అక్కడి అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి కే భరత్‌చంద్ర నలుగురికి రూ.10వేల జరిమానా, ఒకరికి ఐదు రోజులు, ఒకరికి ఏడు రోజులు, మరొకరికి పది రోజులు, ఇద్దరికి నెల రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం తాగినప్పుడు వాహనాలు నడపవద్దని ఎస్పీ దామోదర్ కోరారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారానికి చర్యలు

తాళ్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఏడు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. రీసర్వేలో జరిగిన తేడాలతో జాయింట్ ఎల్‌పీఎంపై నాలుగు అర్జీలు, పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం మూడు అర్జీలు వచ్చినట్టు తెలిపారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఎంఈవో జి.సుబ్బయ్య, హౌసింగ్ అధికారి హనుమంతరావు, ఏపీఎం దేవరాజ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

దర్శి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రజానాట్యమండలి బృందం సోమవారం సాయంత్రం దర్శిలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి మాట్లాడుతూ ఒంగోలులో ఈనెల 23న జరిగే బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన ఇన్‌చార్జ్ ఎంపీడీవో

తాళ్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ ఎంపీడీవో దారా హనుమంతరావు సోమవారం నుంచి 12 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. అనారోగ్యం కారణంగా 20 రోజుల క్రితం సెలవు కోసం దరఖాస్తు పెట్టుకోగా ఉన్నతాధికారులు మంజూరు చేయలేదు. అయితే, గత నాలుగు రోజులుగా అనారోగ్య సమస్య తీవ్రంగా ఉండటంతో 12 రోజులపాటు సెలవు పెట్టారు. సెలవు చీటిని, సిమ్ కార్డును కార్యాలయ అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారికి అప్పగించి వెళ్లారు. నాగంబొట్లపాలెం పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డికూడా వ్యక్తిగత కారణాలతో సోమవారం నుంచి నెలాఖరు వరకు సెలవుపై వెళ్లారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ హుసేన్, డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ఎంఈవో రాజాల కొండారెడ్డి, ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 70 వేలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,68,597 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.80,460, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,010. అన్నదాన విరాళాల ద్వారా రూ.37,127, ఇతర విరాళాల ద్వారా రూ.21వేలు వచ్చినట్లు తెలిపారు.

రికవరీపై దృష్టి సారించాలి

పామూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై వీవోఏలు అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం జి.విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనిధి రికవరిపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో శ్రీనిధి మేనేజర్ సంపత్ కుమార్, వెంకటరెడ్డి, ఓరుగంటి సుబ్బమ్మ, ఉమ్మడి పద్మ, సీసీ ఆర్.సరళ, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- రహదారుల పక్కనే వ్యర్థ పదార్థాలు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- పట్టించుకోని అధికారులు


పసుపుగల్లులోని ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కన పడ వేసిన వ్యర్థ పదార్థాలు

ముండ్లమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రతి పంచాయతీలో చెత్తాచెదారం తీసి క్లాప్ మిత్రలు డంపింగ్ యార్డుల్లో పడవేయాలి. కొన్ని గ్రామ పంచాయతీల్లో అలా జరగకుండా చెత్తాచెదారాన్ని రహదారుల పక్కనే పడ వేస్తున్నారు. డంపింగ్ యార్డులు మాత్రం నిరుపయోగంగా మారిపోయాయి. సంబంధిత అధికారులు మాత్రం పారిశుధ్య కార్యక్రమాలు చక్కగా నిర్వహిస్తున్నామంటూ మాటలు చెపుతున్నారే తప్ప వాస్తవ రూపం దాల్చటం లేదు. గ్రామాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయటం వల్ల వీధి కుక్కలు రోడ్లపైకి తీసుకు వస్తున్నాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి దుర్గంధం వెదజల్లుతుంది. దోమలు పెరిగిపోయి ఎటువంటి వ్యాధులు సంభవిస్తాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని పసుపుగల్లులో ఎస్సీ కాలనీ దగ్గర, మెయిన్ బజారులో రహదారుల పక్కనే దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డు నిరుపయోగంగా ఉంది. క్లాప్ మిత్రలు గ్రామానికి సమీపంలోనే పడవేస్తున్నారు. దీంతో సమీపంలో ఉన్న నివాస ప్రాంత ప్రజలు ఉండలేక అల్లాడి పోతున్నారు.


శంకరాపురంలో రోడ్డు పక్కనే పడ వేసిన వ్యర్థ పదార్థాలు

ముండ్లమూరు, వేంపాడు, శంకరాపురం, తమ్మలూరు, పులిపాడు, కెల్లంపల్లి, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో చెత్తాచెదారం రహదారుల మీదనే ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ యార్డుల్లోనే చెత్తాచెదారాన్ని పడ వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైతుల అభివృద్ధికి కృషిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సొసైటీ చైర్మన్ రంగబాబు


నారాయణరెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రైతాంగం అభివృద్ధికి సొసైటీల చైర్మన్‌లు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతనంగా ఎంపికైన కనిగిరి, లింగారెడ్డిపల్లి సొసైటీల చైర్మన్‌లను ఎమ్మెల్యే అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పంటల సాగుకు బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు ఇప్పించి వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. కనిగిరి పీఏసీఎస్‌గా అద్దంకి రంగబాబు, లింగారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కమతం చినవెంకటేశ్వర్లు నియామకం అయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, ఐవీ నారాయణ, తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, కొప్పరపు సత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, హనుమంతునిపాడు మండలం ముప్పళ్ళపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా కుందురు నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్) తో కలిసి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన కుందుకు నారాయణరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో గాయం తిరుపతిరెడ్డి, వేశపోగు రాజేష్, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, రెడ్డెం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలి

పామూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కనిగిరి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం జరిగే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు విరివిరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పువ్వాడి అపార్ట్‌మెంట్‌లో టీడీపీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి రైతులు, కూటమి శ్రేణులు ట్రాక్టర్‌లతో కనిగిరికి తరలిరావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌బాబు, మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి కొలుపులు


పొంగళ్లతో ఆలయానికి వెళుతున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

తాళ్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ తల్లి కొలుపుల ముగింపు కార్యక్రమం సోమవారం నాగంబొట్లపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. దాదాపు 50 ఏళ్ల క్రితం వరకు గ్రామంలో పోలేరమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా కొలుపులు నిర్వహించేవారు. ఆతర్వాత నిలిచిపోయాయి. వారం రోజుల పాటు పోలేరమ్మ తల్లికి శాంతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులంతా ఐకమత్యంగా కొలుపులు జరుపుకున్నారు. వేలాదిగా బంధువులు తరలిరావటంలో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం సామూహిక కుటుంబ భోజనాలు నిర్వహిస్తుండటంతో బంధువులు అధిక సంఖ్యలో గ్రామానికి తరలివస్తున్నారు.

భూసార పరీక్షలతో ఎరువుల వినియోగంపై నియంత్రణ



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి

వెలిగండ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో రసాయనిక ఎరువుల వినియోగంపై నియంత్రణ సాధించవచ్చని డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెలిగండ్లలోని రైతు సేవా కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి టి.శిల్ప మాట్లాడుతూ మట్టిలోని సూక్ష్మ, స్థూల పోషకాల నిష్పత్తి తెలుసుకోవడానికి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే పెట్టుబడి తగ్గడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకట రెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

- ఈఈ శ్రీనివాసులు


విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఈఈలు శ్రీనివాసులు, హైమావతి తదితరులు

దొనకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. దొనకొండ మండలంలోని అన్నిగ్రామాల్లో ఒంగోలు సర్కిల్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి ఆధ్వర్యంలో దాదాపు 80 మంది సిబ్బంది 33 బృందాలుగా ఏర్పడి నివాస గృహాలు, షాపుల్లో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న 40 మందిపై కేసులు నమోదుచేసి రూ.1,69,300 జరిమానా విధించారు. కొందరు వాణిజ్య వినియోగదారులకు లోడ్ క్రమబద్ధీకరణ నిమిత్తం నోటీసులు జారీ చేశారు.

ఈసందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈఈ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు కరెంట్ వాడటం మనుషుల ప్రాణాలకే ప్రమాదకరమన్నారు. అటువంటివి జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు.

గ్రామాల్లో కరెంట్ పెండింగ్ బిల్లులపై ప్రత్యేక దృష్టి సారించి నూరుశాతం వసూళ్లు జరిగేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. దొనకొండ పట్టణంలో కరెంట్ ట్రిప్పింగ్ సమస్య విపరీతంగా ఉన్న ట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. అటువంటి సమస్య లేకుండా సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలన్నారు. విని యోగదారులకు నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఒబ్బాపురంలో లోవోల్టేజీ సమస్యను ప్రస్తావించగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. కార్యక్రమంలో పొదిలి డీఈ హరిబాబు, దొనకొండ ఏఈ షేక్ నాగూర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు


వినాయక విగ్రహాలకు రంగులు దిద్దుతున్న కార్మికులు

పామూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వినాయక చవితికి గణనాథులు సిద్ధమవుతున్నారు. వివిధ రూపాల్లో 5 అడుగుల నుంచి 20 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. పామూరులో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగానే బుకింగ్ చేసుకుంటున్నారు. విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో కర్ర, రంగులు వాడుతున్నట్టు తయారీదారులు తెలిపారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు కావల్సిన మెటీరియల్‌ను రాజస్థాన్ నుంచి తెస్తామన్నారు. రంగులను హైదరాబాద్‌లో కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి ఏడాది వినాయక చవితి విగ్రహాల తయారీకి ఫైనాన్స్‌దారులను నుంచి వడ్డీకి నగదు తీసుకుంటామని తయారీదారుడు విక్రమ్ తెలిపారు. రూ.15 లక్షల వరకు వడ్డీకి తీసుకుంటామని చెప్పారు. విగ్రహాలు అమ్మినతర్వాత నగదు చెల్లిస్తుంటామని ఆయన పేర్కొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

పీసీపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడవద్దని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగక్రిష్ణ అన్నారు. మండలంలోని గుదేవారిపాలెంలో ఆత్మ అధ్వర్యంలో నేల సారవంతత, యాజమాన్య పద్ధతులపై సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయనిక ఎరువులను అధికంగా వాడడం ద్వారా భూమి సారవంతత తగ్గుతుందన్నారు. పెట్టుబడి ఖర్చుకూడా పెరిగి ఆశించిన మేర రైతులకు లాభాలు రావన్నారు. చౌడు కలిగిన భూముల్లో జిప్సమ్ వేయడం ద్వారా చౌడును తగ్గించవచ్చునని చెప్పారు. అంతర పంటలు సాగుచేయడం ద్వారా తక్కు ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చునని చెప్పారు. ప్రభుత్వం వంద శాతం రాయితీపై అందిస్తున్న మినీ కిట్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నత్రజని వాడకాన్ని మోతాదుకు మించి వేయడం ద్వారా పైరుకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందన్నారు. యాజమాన్య పద్ధతులతో సాగుచేస్తే ఆశించిన మేర దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కనపర్తి శాంసన్, ఏనుగంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

కనిగిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 పథకంతో ప్రతి పేద కుటుంబం బాగుపడాలని తహసీల్దార్ రవిశంకర్ అన్నారు. సోమవారం తహసీల్దార్ పేద కుటుంబానికి చేయూత అందించారు. పట్టణ శివారు కాలనీలో మహబూబ్‌బి కుటుంబానికి తన సొంత ఖర్చులతో నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఇతర సామగ్రిని అందజేసి ఆర్థికచేయూత అందించారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా దాతలు తమ దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్, వీఆర్వో శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు


విలేకరుల సమావేశంలో పాల్గొన్న తెలుగు మహిళలు

పామూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని ఐటీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు మద్దిశెట్టి రమాదేవి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై వైసీపీ మహిళా నేతలు ప్రభుత్వ విధానాలపై ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతున్న కూటమి ప్రభుత్వంపై అక్కసుతో ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో బూత్ ఇన్‌చార్జ్ ఆవుల రమణమ్మ, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు జగదాబి రమణమ్మ, షేక్ సాహేరా, సయ్యద్ రజియా బేగం పాల్గొన్నారు.

నాలుగు సొసైటీలకు చైర్మన్‌ల నియామకం


వీరనారాయణ


గురవయ్య


రామాంజనేయులు


అంజయ్య

ముండ్లమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చైర్మన్‌లను నియమిస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ముండ్లమూరు సొసైటీ చైర్మన్‌గా మేదరమెట్ల వీరనారాయణ, సభ్యులుగా బోడపాటి వెంకటరావు, ఆకుళ్ళ కృష్ణారెడ్డి, బొప్పుడివారి సొసైటీ చైర్మన్‌గా కొండారు రామాంజనేయులు, సభ్యులుగా ఆళ్ళ నరసింహారావు, చావా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఉమామహేశ్వర అగ్రహారం సొసైటీ చైర్మన్‌గా కాటూరి గురవయ్య, సభ్యులుగా మైలా శ్రీనివాసరావు, బొట్ల హనుమంతరావు, మారెళ్ళ సొసైటీ చైర్మన్‌గా బుర్రి అంజయ్య, సభ్యులుగా తాళ్ళూరి వెంకటేశ్వర్లు, గోరంట్ల రాంబాబును నియమించారు. తమకు పదవులు రావటానికి సహకరించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీల అభివృద్ధికి పాటు పడతామన్నారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు.

తప్పిపోయిన విద్యార్థిని ఆచూకీ లభ్యం

పామూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆదివారం అర్ధరాత్రి పాఠశాల గోడ దూకి తప్పించుకున్న సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎంఈవో పి.కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తప్పించుకున్న విద్యార్థిని గస్తీ తిరుగుతున్న గూర్ఖా వద్ద సెల్‌ఫోన్ అడిగి వేరే వ్యక్తితో ఫోన్ చేసి వెళ్లిందని తెలిపారు. ఈవిషయంపై ఒంగోలు సర్వశిక్ష అభియాన్ అధికారులు ఎంఈవోను బాలిక అదృశ్యంపై విచారించమని ఆదేశించారు. అధికారుల ఆదేశాలతో ఎంఈవోలు పి.కోటిరెడ్డి, కె.కరుణకుమారి సోమవారం కేజీబీవీకి వెళ్లి విచారణ చేపట్టారు గూర్ఖా వద్ద ఫోన్‌తో మాట్లాడినట్లు సమాచారం అందుకున్న అధికారులు గూర్ఖా ఫోన్‌లో బాలిక చేసి ఉన్న నెంబర్‌కు ఫోన్‌చేసి విచారించారు. బాలిక మార్కాపురంలో ఉన్నట్లు సమాచారం సేకరించారు. ఈక్రమంలో స్థానిక ఎస్ఐ మార్కాపురం ఎస్ఐతో మాట్లాడి బాలిక ఆచూకీని కనుగొనట్లు ఎంఈవోలు తెలిపారు. కేజీబీవీలో వాతావరణం నచ్చక తాను పారిపోయినట్లు బాలిక చెప్పినట్లు అధికారులు తెలిపారు. ఈవిషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రిన్సిపాల్ కటకం సజన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి కృషి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ నాయుడును జిల్లా షీప్ సొసైటీ చైర్మన్ తాడేటి గోపి, సభ్యుడు ఎం.రామకృష్ణ సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గొర్రెల పెంపకందారుల సమస్యలపై చర్చించినట్లు గోపి తెలిపారు. వీరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దామోదర్‌నాయుడు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

ముండ్లమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ వై.రామారావు, ఎస్ఐ కె.కమలాకర్ హెచ్చరించారు. మండలంలో ఈదర గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డి ఏడు సంవత్సరాలక్రితం అదేగ్రామానికి చెందిన కిష్టపాటి కొండారెడ్డిపై దాడిచేయడంతో మృతిచెందారు. ఈకేసుకు సంబంధించి బండి బాపిరెడ్డి, బండి నాగిరెడ్డి, మరికొంతమంది సోమవారం మార్కాపురం కోర్టుకు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న కొండారెడ్డి తండ్రి వెంగళరెడ్డి మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో కాపు కాచి బాపిరెడ్డిపై కారం చల్లారు. దీంతో అప్రమత్తమై అక్కడి నుంచి కోర్టు ప్రాంగణంలోకి వెళ్లారు.

విషయం తెలుసుకున్న దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ కె.కమలాకర్ హుటాహుటీన ఈదర గ్రామానికి వెళ్లి కొందరిని అదుపులోకి తీసుకొని విచారించారు. గ్రామంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఏప్రిల్ 4,2018న ఈదర గ్రామానికి చెందిన కిష్టపాటి వెంగళరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి దర్శి కోర్టుకు వాయిదాకు వెళ్ళి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో రమణారెడ్డిపాలెం వద్ద బండి నాగిరెడ్డి, బాపిరెడ్డి మరికొంత మంది కొండారెడ్డి, వెంగళరెడ్డిలపై దాడిచేయగా కొండారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆతర్వాత బండి నాగిరెడ్డి, బాపిరెడ్డి, మరికొందరు ఊరువిడిచి కడప జిల్లాలో ఉంటున్నారు. ఈకేసుకు సంబంధించి వారు సోమవారం వాయిదా నిమిత్తం మార్కాపురం వచ్చారు. మార్కాపురంలో జరిగిన సంఘటనపై ఈదర గ్రామంలో ముందస్తు జాగ్రత్తగా ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ గ్రామస్థులతో మాట్లాడారు.





విజ్ఞాన మందిరంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



ఎరువుల విక్రయ కేంద్రంలో వివాదానికి దిగిన రైతులు

ఎరువుల కోసం ఆగ్రహించిన రైతులు

వేమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ఎరువుల విక్రయ కేంద్రంలో సోమవారం ఉదయం వివాదం చోటు చేసుకుంది. పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీ ఆధారంగానే ఎరువులను రైతులకు అందించాలని వ్యవసాయ శాఖ అధికారి విక్రయ కేంద్రం సిబ్బందికి ఫోన్ ద్వారా తెలిపారు. నిన్న మొన్నటి దాకా కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే యూరియా, డీఏపీ తదితర ఎరువులను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఒక్కసారిగా పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకు రావాల్సిందేనని పేర్కొనడంతో ప్రధానంగా కౌలు రైతులు ఆగ్రహించారు. యజమానులు పాసుపుస్తకాలు ఎలా ఇస్తారని, రైతు కార్డు కానీ, ఆధార్ ఆధారంగా కాని ఎరువులు ఇవ్వాల్సిందే అంటూ పట్టుబట్టారు. దాదాపు గంటకు పైగా సిబ్బంది రైతులు మధ్య వివాదం చోటు చేసుకుంది. కొందరు రైతులు సిబ్బందితో కొత్త విధానం ద్వారా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. దీంతో సిబ్బంది పరిస్థితిని పైఅధికారులకు వివరించి.. ఆధార్ ఆధారంగానే ఎరువులను సరఫరా చేశారు. ఎకరాకు ఎరువులు కోటా ఎంతనేది అధికారులు సూచించకపోవడంతో విక్రయ కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

'ఉపాధి' నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బల్లికురవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఉపాధి హమీ పథకం పనుల్లో ఎద్ద ఎత్తున నిధులు దుర్వినియెగం అయ్యాయని.. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సోమవారం బాపట్లలో గ్రీవెన్స్ సెల్‌లో మల్లాయపాలెం వాసులు పిర్యాదు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ పనుల్లో లోపాలు, బోగస్ మస్టరు వేసిన కాగితాలను కలెక్టర్‌కు అందజేశారు. డ్వామా పీడీ విజయలక్ష్మి దీనిపై విచారణ చేపట్టి.. చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు బాలకృష్ణ తెలిపారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు: ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

బల్లికురవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్య పనులు చేయించకుంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.పాండురంగ స్వామి హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పడకేసిన పారిశుధ్యం.. డెంగీ జ్వరాలకు ఆహ్వానం' అనే కథనానికి ఎంపీడీవో స్పందించారు. కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు, బల్లికురవ, చెన్నుపల్లి గ్రామాల్లో అయన పర్యటించారు. పారిశుధ్య పనులను, ఇంటింటి ఫీవర్ సర్వేను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. జ్వర పీడితులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రసాదరావు, ప్రసాదరెడ్డి ఉన్నారు.



వైదన గ్రామంలో ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో పాండురంగస్వామి

ఒకే వీధిన రెండు గ్రామాలు..

మండలాలు, నియోజకవర్గాలు వేర్వేరు..

బల్లికురవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలోని కె. రాజుపాలెం, మార్టురు మండలంలోని రాజుపాలెం. మండలాలు వేరైనా రెండు ఒక వీధికి ఉత్తరం, దక్షిణం వైపున ఉన్న గ్రామాలివి. రెండు గ్రామాల జనాభా 6 వేలు. బల్లికురవ మండల కేంద్రం కె.రాజుపాలెం గ్రామానికి పది కిలోమీటర్ల దూరం. పొరుగున వేమవరంలోని సచివాలయానికి వెళ్లాలన్నా అంతే ప్రయాణం. అదే మార్టూరు మండలంలో ఉన్న రాజుపాలెం ప్రజలు రెండు కిలోమీటర్లు వెళితే మండల కేంద్రానికి చేరుకుంటారు. కె. రాజుపాలెం ఉన్న బల్లికురవ మండలం అద్దంకి నియోజకవర్గం. రాజుపాలెం గ్రామం ఉన్న మార్టూరు మండలం పర్చూరు నియెజకవర్గం. ప్రభుత్వం కొత్తగా మండలాలు, నియోజకవర్గాల హద్దులపై మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన నేపథ్యంలో.. తమ గ్రామాన్ని సమీపంలో ఉన్న మార్టూరు మండలంలో కలపాలని కె.రాజుపాలెం ప్రజలు కోరుతున్నారు.



బల్లికురవ, మార్టూరు మండలాల పరిధిలో కలిసి ఉన్న కె. రాజుపాలెం, రాజుపాలెం గ్రామాలు

ఈ-క్రాప్ తిప్పలు తప్పేనా!

సాగు మొదలుకుని దిగుబడులను మద్దతు ధరకు అమ్ముకునే ప్రతి అంకంలోనూ 'ఈ-పంట నమోదు' కీలకం. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీ ధరకు ఎరువులు అన్నింటికీ అదే ప్రామాణికం. సాగు విస్తీర్ణానికి, ఈ-పంట నమోదుకు పొంతన లేకుండా మమ అనిపించే తంతు గత ప్రభుత్వంలో నడిచింది. అన్నదాతలకు నేరుగా కొర్రీలు వేయకుండా ఈ-పంట సాకుతో వారిని అనేక పథకాల లబ్ధికి దూరం చేసిన ఘనత వైసీపీది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూడా ఈ-క్రాప్ నమోదు అదే రీతిన సాగిందనేది తాజాగా మార్క్‌ఫెడ్ చేపట్టిన పొగాకు కొనుగోళ్ల అంశంలో బయటపడింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ఈ-పంట నమోదు తాజాగా ఊపందుకుంది. సాగు వివరాలు పక్కాగా నమోదు చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సిబ్బంది అలసత్వం వీడి.. క్షేత్ర స్థాయిలో పర్యటించి పక్కాగా ఆన్‌లైన్ చేస్తేనే రైతాంగానికి ఈ క్రాప్ తిప్పలు తప్పే అవకాశం ఉంది.

- ఖరీఫ్ సీజన్‌కు మొదలైన ఈ-పంట నమోదు
- ఖాళీ భూముల వివరాలూ యాప్‌లో నిక్షిప్తం
- పొగాకు కొనుగోళ్లలో బయటపడిన 'రబీ' తప్పులు
- క్షేత్రస్థాయి నమోదులో సిబ్బంది అలసత్వం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ఈ క్రాప్ ప్రారంభమైనట్లు వ్యవయసాయశాఖ తెలిపింది. ఈ పంటలో నమోదు చేయాలంటే పైరు వేసి కనీసం నెలయినా దాటి ఉంటేనే ఇమేజ్ పక్కాగా రావడానికి అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు. రైతులు తమ పైరు వివరాలు నమోదు చేసుకోవడానికి శ్రద్ధ చూపాలని వ్యవసాయ శాఖ కోరుతోంది. నమోదు ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత గ్రామసభలు, ఫిర్యాదుల స్వీకరణ, తుది జాబితా ప్రచురణతో ఖరీఫ్ సీజన్ (మిగతా 6వ పేజీలో)



వేటపాలెంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్రమణ్యేశ్వరరావు (పాత చిత్రం)

అంతా డొల్లతనమే

పెసర సాగు చేస్తే మినుము, కంది సాగు చేస్తే శనగ ఇలాంటి అస్తవ్యస్త నమోదులు కోకొల్లలుగా రబీ సీజన్ మద్దతు ధర విక్రయాల్లో వెలుగు చూశాయి. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా అరకొర సమాచారంపై ఆధారపడి వివరాలు నమోదు చేయడం వల్లే ఈ పంట నమోదులో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేవలం రైతు చెప్పిందే ప్రామాణికంగా అప్‌లోడ్ చేస్తున్నారే తప్పితే ఫీల్డ్ విజిట్‌కు తిలోదకాలిచ్చి మమ అనిపిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉన్న సిబ్బందితో ప్రతి ఎకరం ఫీల్డ్ విజిట్ చేసి వివరాలు నమోదు చేయాలంటే సాధ్యపడదని, పైగా అన్నదాతలూ అందుబాటులో ఉండడం లేదనేది సిబ్బంది వాదనగా ఉంది.



రైతు లేనిదే రాజ్యం లేదు

- ఎమ్మెలే వేగేశన నరేంద్రవర్మ
- రైతులకు మద్దతుగా భారీ ట్రాక్టర్ల ర్యాలీ

వర్షంలో తడుస్తూనే ట్రాక్టర్‌ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, కూటమి నాయకులు

బాపట్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైతు లేనిదే రాజ్యం లేదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు రూ.20వేలు అందించి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీనిని హర్షిస్తూ సోమవారం సాయంత్రం బాపట్ల ఇంజనీరింగ్ కాలేజి నుంచి ట్రాక్టర్‌లతో భారీ ప్రదర్శన నిర్వహించారు. 200 ట్రాక్టర్లతో కూటమి నాయకులు, రైతులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి నాయకులు వర్షంలో కూడా ర్యాలీని ముందుకు కొనసాగించారు. మహిళలు హారతులు పట్టారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ అమలు చేయడం జరిగిందన్నారు. దీంతో సీఎంకు రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, పాలతో అభిషేకాలు చేస్తున్నారన్నారు. విజన్ ఉన్న నాయకుడి నాయకత్వంలో కూటమి నాయకులంతా కలిసి రైతులు బాగుండాలని ఈ విధంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగా కాల్వలకు నీరు విడుదల చేసి సముద్ర తీర ప్రాంత గ్రామాలకు కూడా సాగు నీరు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. జనసేన, బీజేపీ నాయకులతో కలిసి అవినీతిలేని పాలన అందిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు, పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, నిజాం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు హారతులిస్తున్న మహిళలు

కలెక్టర్ గారూ.. ఆదుకోండి!

- వరద బాధితులకు అన్నపానీయాలు అందజేసిన వెండర్లు
- ఏడాది కావస్తున్నా చెల్లించని బకాయిలు
- విన్నపాలపై స్పందించడం లేదని ఆవేదన

కొల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అయ్యా.. కలెక్టర్ గారు వరద బాధితులకు అందించిన మంచినీరు, ఆహారం ఇతర బకాయి చెల్లించి ఆదుకోండి సార్... అంటూ సరఫరాదారులు (వెండర్లు) ప్రాధేయపడుతున్నారు. గతేడాది ఆగస్టు చివర, సెప్టెంబరు మొదట్లో కృష్ణా నదికి 11.43 లక్షల క్యూసెక్కుల భారీ వరద పోటెత్తడంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. గ్రామస్తులకు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆహారం, మంచి నీరు సిద్ధం చేసి బోట్ల ద్వారా ఆయా గ్రామాలకు తరలించి అందేశారు. ఆహారం తయారీ, మంచినీరు సరఫరా బాధ్యతను సరఫరాదారులకు అప్పగించారు. వరద అనంతరం ఖర్చు మొత్తాన్ని చెల్లించేలా స్థానిక రెవెన్యూ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. పునరావాస కేంద్రాలు, గ్రామాల్లో, విధుల్లోని అధికార యంత్రాంగానికి ఆహారం, నీరు అందజేశారు. ఇందుకు రూ.22,68,602 బిల్లులు చెల్లించాలని స్థానిక తహసీల్దార్‌కు అందజేశారు. రూ.6.50 లక్షల బిల్లులు మాత్రమే అధికారులు చెల్లించారు. ఆంజనేయ విలాస్, ఈనాడు గ్రాండ్ రెస్టారెంట్, అల్పాహారం కోసం కిరాణా దుకాణంలో సరుకులు, పడవలకు అవసరమైన డీజిల్‌ను కనగాల ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా అధికారులు తమ సిబ్బందితో సమకూర్చుకున్నారు. డీజిల్ ఖర్చు రూ.3.20 లక్షల బకాయి పెట్రోల్ బంకుకు చెల్లించాలి. ఆంజనేయ విలాస్, ఈనాడు రెస్టారెంట్‌లకు కూడా సుమారు చేరో రూ.3.50 లక్షలు బకాయి రావాలని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ బకాయిల కోసం పలుమార్లు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో, కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించినా ఎటువంటి ఫలితం లేదని వాపోతున్నారు. కలెక్టర్ స్పందించి రూ.16,18,602 బకాయి వెంటనే చెల్లిస్తే భవిష్యత్తులో వచ్చే విపత్తులలో కూడా సరఫరాదారులు అధికారులకు సహకరించి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెబుతున్నారు.



పడవల ద్వారా వరద బాధితులకు మంచినీరు, ఆహారం తీసుకు వెళుతున్న రెవెన్యూ సిబ్బంది (పాత చిత్రం)



ఆహార ప్యాకెట్లు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లాను!

సరఫరాదారుల బకాయిల గురించి రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మళ్లీ వరద బకాయి గురించి చర్చిస్తామన్నారు. విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు వివరించి బకాయి చెల్లించేలా కృషి చేస్తానన్నారు.

సింగిల్ యూజ్

ప్లాస్టిక్‌పై యుద్ధం

- పెద్దల అలవాట్లను పిల్లల ద్వారా మార్చే ప్రయత్నం
- నేడు విజ్ఞాన మందిరంలో వర్క్‌షాప్
- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జూనియర్ రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ యుద్ధాన్ని ప్రకటించింది. ఇందుకోసం ఒక వినూత్నమైన ప్రాజెక్టుని చేపట్టింది. తల్లిదండ్రుల అలవాట్లలో వారి పిల్లలతో మార్పు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్(ఏపీసీఏసీ), అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ క్యాంపెయిన్‌లకు సంబంధించి మంగళవారం వర్క్‌షాపు నిర్వహించబోతోంది. నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వర్క్‌షాపులో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. ఏపీసీఏసీ అనేది ముఖ్యంగా ఉన్నత విద్యా సంస్థలలో పర్యావరణ స్పృహ, కార్యాచరణని ప్రోత్సహించడంపై దృష్టి సారించిన రాష్ట్ర స్థాయి చొరవ. ఇది వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఐదు అంశాల వ్యూహాన్ని కలిగి ఉంటుంది. వీటిలో ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన విస్తరణ, అడవుల పెంపకం, ప్రపంచ ఉత్తమ పద్ధతుల స్వీకారం, అవగాహన కార్యక్రమాలు ఇమిడి ఉన్నాయి. ఈ కార్యకలాపాలకు నాయకత్వం వహించడానికి విద్యార్థులను వాతావరణ మార్పు ఏజంట్లుగా శిక్షణ ఇవ్వడం ప్రచార లక్ష్యంగా ఉంది. ఇప్పటికే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గత నెల మొదటి వారంలో కళాశాల విద్యా శాఖతో కలిసి ఒక సంయుక్త వర్క్‌షాప్‌ని విజయవాడలో నిర్వహించింది. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో పర్యావరణ స్పృహ, కార్యచరణని ప్రేరేపించడం ఈ ప్రచారం లక్ష్యాలలో ఒకటిగా ఉంది. విద్యార్థులను యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లుగా నమోదు చేసుకొని క్లైమేట్ యాక్షన్ గ్రూపులను ఏర్పాటు చేస్తారు. ఈ క్యాంపెయిన్‌లో నీటి కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు, ఘన వ్యర్థాల తొలగింపు, చెట్ల పెంపకంపై దృష్టి పెడతారు. అలానే అమరావతి రాజధాని నగరం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నగరంలో ప్రారంభం నుంచి ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా చేయాలని రెడ్‌క్రాస్ సంస్థ చొరవ తీసుకొనేందుకు ముందుకొచ్చింది. ఈ ప్రచార కార్యక్రమాన్ని కూడా గవర్నర్ నజీర్ ప్రారంభిస్తారు.

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ఏ నజీర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. వేదిక, సీటింగ్, పీఏ సిస్టం తనిఖీ ఏర్పాట్లపై అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో చర్చించి, సూచనలు అందించారు. జేసీ భార్గవ్ తేజ, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇతర అధికారులున్నారు.

బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అండ

గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

రేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా రేపల్లె టీడీపీ పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, పవన్, సత్యప్రసాద్ చిత్రపటాలకు కల్లు, గీత కార్మికులు, చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే గీతకార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 2025-26 బడ్జెట్‌లో బీసీల అభ్యున్నతి కోసం రూ.47 వేల కోట్లు కేటాయించటం అభినందనీయమన్నారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్నారన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. బీసీలు కూటమిపార్టీలకు ఎప్పుడు అండగా ఉండాలన్నారు. చేనేత కుటుంబాలను ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అందించటంతో పాటు నేతన్న భరోసా ద్వారా రూ.25 వేలు ఆర్థిక సాయం, నేతన్నల తయారుచేసే ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించారన్నారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం కోట్లాదిరూపాయలు వెచ్చించి ముందుకు వెళ్ళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టాప్రాజెక్టుకమిటి చైర్మన్ పంతాని మురళీధరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యేమినేని లక్ష్మీశైలజ, జనసేనపార్టీ నియోజవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్, సత్యప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గీత, చేనేత కార్మికులు

ఒంగోలు నగర కమిషనర్‌కు స్పెషల్ గ్రేడ్‌గా ఉద్యోగోన్నతి

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావుకు స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణాభివృద్ధి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది మునిసిపల్ గ్రేడ్ 1 కమిషనర్లను స్పెషల్ గ్రేడ్ కమిషనర్లుగా నియమించింది. ఈమేరకు ఒంగోలు నగర కమిషనరు వెంకటేశ్వరరావు స్పెషల్ గ్రేడ్ కమిషనరుగా కొనసాగనున్నారు. తొలుత కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన 2018లో గ్రూప్ -1 పోటీ పరీక్ష ద్వారా నేరుగా మునిసిపల్ శాఖలో విధుల్లో చేరారు. మొదట్లో నెల్లూరు, కావలి మునిసిపాలిటీలలో అసిస్టెంట్ కమిషనరుగా పనిచేశారు. ఆ తర్వాత, హిందూపురం, నర్సాపురంలో మునిసిపల్ కమిషనరుగా పనిచేసిన వెంకటేశ్వరరావు గత ఏడాది ఆగస్టు 28న ఒంగోలు కార్పొరేషన్‌కు గ్రేడ్ 1 కమిషనరుగా బాధ్యతలు స్వీకరించారు. కాగా ప్రస్తుతం ఆయనకు స్పెషల్ గ్రేడ్ కమిషనరుగా పదోన్నతి లభించడంతో ఒంగోలు కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా స్పెషల్ గ్రేడ్ కమిషనరుగా కొనసాగనున్నారు.

బైక్ బోల్తా.. పర్యాటకులకు తీవ్ర గాయాలు

క్షతగాత్రుల్లో ఒకరు మార్టూరు, మరొకరు చిలకలూరిపేట వాసులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇరువురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం వేటపాలెం వద్ద జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం మార్టూరు మండలం బొబ్బేపల్లికి చెందిన బాషా, చిలకలూరిపేట బొప్పూడికి చెందిన షమీర్ కార్ పెయింటింగ్ దుకాణంలో పని చేస్తుంటారు. సోమవారం ద్విచక్ర వాహనంపై సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి వచ్చారు. అనంతరం సాయంత్రం సమయంలో తిరిగి వెళుతూ వేటపాలెం వద్ద వాహనం అదుపుతప్పి పడ్డారు. దీంతో షమీర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. బాషా కుడి చేతికి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జూదరుల అరెస్ట్

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం దాడిచేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోనికి తీసుకొని, వారి వద్ద ఉన్న రూ.5,200ల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్‌ఐ సీహెచ్ అనూష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

బల్లికురవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొంత కాలం నుంచి వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో మండలంలోని కూకట్లపల్లి గ్రామప్రజలు ఈ విషయాన్ని పంచాయతీ కార్యాలయం దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆదివారం నుంచి అన్ని వీధులలో ప్రజలను కరుస్తున్న వీధి కుక్కలను చంపకుండా వలతో పట్టి వాహనాలలో ఎక్కించి కొండ ప్రాంతంలో వదిలి పెడుతున్నారు. సుమారు రెండు వందల కుక్కలను వలతో పట్టి వాహనాలలో తరలించారు. దీంతో తమ బాధలు తొలగాయని ప్రజలు పేర్కొంటున్నారు. నిత్యం పశువులను, గొర్రెలను కరవడమే కాకుండా వాహనాల వెంబడి కుక్కలు పడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, కుక్కల బెడద తీర్చిన పంచాయతీకి ప్రజలు కృతజ్ఞత తెలిపారు.

వైస్‌చైర్మన్ రామసుబ్బులు రాజీనామా ఆమోదం

చీరాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామ సుబ్బులు రాజీనామాను కౌన్సిలర్లు సోమవారం ఆమోదించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించగా, ఎక్స్ అఫిషియో హోదాలో ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అయితే తదుపరి ప్రక్రియ అనంతరం మరొకరిని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అలాగే చర్చలో దుగ్గిరాల గోపాల కృష్ణయ్య స్మారక స్థూపం, గడియార స్తంభం నిర్మాణాలపై చర్చ నడిచింది.

15లోపు దత్తత ప్రక్రియను పూర్తి చేయాలి

పీ 4 కార్యక్రమంపై సమీక్షించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 15వ తేదీ నాటికి బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఈవో ఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేసి అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణాలలో పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పిల్లల ఆధార్ సీడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫారంపాండ్స్ నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ఆ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పలుశాఖల అధికారులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

సీఎం ఆదేశాలతో రూ.1.50లక్షల చెక్కు అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో దర్శి పట్టణానికి చెందిన ఒక కుటుంబానికి లక్షా 50 వేల రూపాయల చెక్కును కలెక్టర్ తమీమ్ అన్సారియా అందజేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం దర్శికి చెందిన గల్లెపోగు యలమంద, ప్రశాంతి దంపతులకు ఈ చెక్కును కలెక్టర్ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో అన్నదాతసుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సమయంలో దర్శికి చెందిన యలమంద, ప్రశాంతి దంపతులు పోలియో కలిగిన ఐదేళ్ల తన కుమారుడితో కలిసి సీఎంను కలిసి తమకుటుంబాన్ని అందుకోవాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తదనుగుణంగా సోమవారం కలెక్టర్ అన్సారియా ఈ చెక్కును ఆ దంపతులకు అందజేశారు. త్వరలో సదరం సర్టిఫికెట్ కూడా ఇస్తామని ఆ దంపతులకు కలెక్టర్ అన్సారియా హామీ ఇచ్చారు.

లారీ ఓనర్‌లకు పాత ధరలే ఇవ్వాలని వినతి

మార్కాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని ఇసుక డంపింగ్ యార్డ్ కాంట్రాక్టర్.. టన్నుకు రూ.950 మేరకు పాత ధర చెల్లించాలని మార్కాపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు టన్నుకు రూ.950 చొప్పున కాంట్రాక్టర్ చెల్లించారన్నారు. కానీ ఈ నెల 1వ తేదీ నుంచి రూ.800 మేర మాత్రమే ఇస్తామని కాంట్రాక్టర్ చెప్తున్నారన్నారు. ఈ నిర్ణయం వల్ల తీవ్రంగా నష్టపోతామని వారువాపోయారు. పాత ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బొందిలి కాశీరాంసింగ్, బాలాజీ సింగ్, ఉప్పలదిన్నె శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, షఫియుల్లాఖాన్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న లారీ ఓనర్లు


డీఎస్పీ డాక్టర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఇసుక సప్లయర్స్

మాకు గిట్టుబాటు ధర ఇస్తున్నారు

మార్కాపురం ఇసుక డపింగ్ యార్డ్ కాంట్రాక్టర్ గిట్టుబాటు ధరను ఇస్తున్నారని ఇసుక సప్లయర్స్ మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొందరు లారీ ఓనర్లు రాజకీయ దురుద్దేశంతోనే కాంట్రాక్టర్‌పై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇసుక సరఫరా చేస్తున్న లారీ ఓనర్లను భయభ్రాంతులకు గురి చేసేందుకు కూడా సిద్ధమయ్యారన్నారు. వారి బారి నుంచి ఇసుక సరఫరా చేస్తున్న లారీ ఓనర్లను రక్షించాలని కోరారు. అంతేకాక మార్కాపురంలో 2020 నుంచి లారీ ఓనర్స్ అసోసియేషన్ లేదన్నారు. కొందరు స్వార్థం కోసం అసోసియేషన్ నాయకులమని చెప్పుకుని ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. డీఎస్పీకి వినతి పత్రం అందజేసిన వారిలో నూనె శివారెడ్డి, వై.ఆంజనేయులు, పి.కోటి, ఎన్.వెంకటరామిరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న బైక్

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఎక్స్‌కవేటర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన కడవకుదురు గ్రామ సమీపంలోని 216వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలను ఎక్స్‌కవేటర్‌తో అమరుస్తుండగా, డ్రైవర్ సన్నెపోగు కోటేశ్వరరావు స్తంభాల కోసం ఎక్స్‌కవేటర్‌ను ఒక్కసారిగా పక్కకు మలిపాడు. అదే సమయంలో ఒంగోలుకు చెందిన జాల శంకరరావు, ఆయన భార్య శ్యామల చీరాల నుంచి ఒంగోలుకు ద్విచక్రవాహనంపై వెళుతూ ఎక్స్‌కవేటర్ టైర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో శంకరరావు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో ఆయన ముక్కు, నోటికి గాయాలయ్యాయి. ఆయన భార్యకు ఎటువంటి గాయాలు కాలేదు. గాయపడిన శంకరరావును జాతీయ రహదారి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఎస్.రమేష్ పరిశీలించారు.

భార్యను హత్య చేసిన కేసులో భర్తకు రిమాండ్

సంతమాగులూరు ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. మండలంలోని ఏల్చూరు గ్రామంలో సల్లూరి సుబ్బమ్మను తన భర్త గిరిప్రసాద్ అలియాస్ మేరీబాబు శుక్రవారం అనుమానంతో కత్తితో నరికి చంపాడు. ఆ విషయమై సంతమాగులూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం సల్లూరి గిరి ప్రసాద్‌ను పోలీసులు గ్రామం సమీపంలోని సుబాబుల్ తోటల్లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

చిల్లచెట్లతో ప్రమాదకరంగా రోడ్డు మలుపు

● తరచూ రోడ్డు ప్రమాదాలు

మార్టూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుగారిపాలెం రోడ్డులో జనార్థన్ కాలనీ దాటిన తర్వాత రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. అక్కడ తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు రోడ్డు పక్కన చిల్లచెట్లు కొమ్మలు పెరిగి రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక, వాహనదారులు తరచూ గాయపడుతున్నారు. పది రోజుల క్రితం కారు, ద్విచక్రవాహనదారుడు ఎదురెదురుగా ఢీ కొనడంతో ద్విచక్రవాహనదారుడు శాశ్వతంగా శరీర వైకల్యానికి లోనయ్యాడు. గతంలోకూడా ఈ మలుపు వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకొన్నాయి. ఇంకొల్లు మండలానికి మార్టూరు నుంచి రాజుగారిపాలెం, ద్రోణాదుల గ్రామాల మీదుగా, ఈ రహదారి వాహనదారులకు సౌకర్యంగా ఉండడంతో, రాత్రి పగలు రోడ్డుపై రద్దీ ఎక్కువగా ఉంటుంది ముఖ్యంగా రాత్రి సమయాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.గతంలో ఒక యువకుడు కూడా ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. దీంతో రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహనచోదకులు హడలి పోతున్నారు. ఈ రోడ్డు మలుపుతో పాటు, మరో చోట ఉన్న ప్రమాదకరమైన మలుపు వద్ద, రోడ్డు పక్కన చిల్లచెట్లను తొలగిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.


ప్రమాదకరంగా ఉన్న మలుపు

కళాకారుల సమస్యలను పరిష్కరించాలి

● వివిధ వేషధారణలతో నిరసన


వివిధ వేషధారణలతో నిరసన తెలుపుతున్న కళాకారులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి కళాకారులు వివిధవేషధారణలతో ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌మీదుగా నెల్లూరు బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ రంగస్థల నటుడు స్వర్గీయ బండారు రామారావు, డీవీ సుబ్బారావుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే ఉన్న గుర్రం జాషువా , ప్రకాశం పంతులు విగ్రహాలకు నివాళులు అర్పించి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ జరిగిన ధర్నాలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కళాకారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, జిల్లాపౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు వీవీఎన్‌రెడ్డి, వీరాంజనేయ నాట్యమండలి కార్యదర్శి మాకా ఆంజనేయులు, ది ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌కే బాబు, అనంతలక్ష్మి, గుడూరి సుధారాణి, యశోధ, శ్రీదేవి, ఎం. మల్లికార్జునరావు, బాలగురవయ్య తదితరులు ఉన్నారు.

నాలుగు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

పంగులూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల నియామకం చేపట్టారు. మండలంలోని బూదవాడ పీఏసీఎస్ చైర్మన్‌గా అలవల రామిరెడ్డి, సభ్యులుగా మల్లె సుబ్బారావు (బూదవాడ), గోరంట్ల శ్రీనివాసరావు (మల్లవరం), జనకవరం పీఏసీఎస్ చైర్మన్‌గా చిలుకూరి కోటేశ్వరరావు సభ్యులుగా చిలుకూరి రామాంజనేయులు(పంగులూరు), తలపనేని సాంబశివరావు (జనకవరం), తూర్పుకొప్పెరపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా అదేగ్రామానికి చెందిన గొల్లపూడి అంజయ్య, సభ్యులుగా కోమటి ప్రసాద్(అలవలపాడు), శృంగవరపు శేషయ్య(తూర్పుతక్కెళ్లపాడు), నూజెళ్లపల్లె పీఏసీఎస్ చైర్మన్‌గా మద్దినేని కోటేశ్వరరావు, సభ్యులుగా మద్దినేని పూర్ణచంద్రరావు, విప్పర్ల పోతురాజులు నియమితులయ్యారు.

'ఈ-క్రాప్' తిప్పలు తప్పేనా..!

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ ముగియనుంది.

పొగాకు కొనుగోళ్లలో బయటపడిన ఈ-క్రాప్ తప్పిదాలు

మార్క్‌ఫెడ్ చేపట్టిన పొగాకు కొనుగోళ్ల ఈ-పంట నమోదు అవకతవకలు బయటపడ్డాయి. క్షేత్రస్థాయిలో పొగాకు సాగు వేల ఎకరాల్లో ఉండగా ఈ-క్రాప్ గణాంకాల్లో అది పాతికశాతం కూడా లేదు. పైగా అదే పొలంలో వేరే పంట సాగు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. రబీలో ఈ-క్రాప్ నమోదు వ్యత్యాసాలు పొగాకు కొనుగోళ్లకు ప్రతిబంధకంగా మారాయి. వాటిని ఒక కొలిక్కి తేవడానికి రాష్ట్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వచ్చింది. ఇదేకాకుండా మద్దతు ధరకు తమ ఉత్పత్తులు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలు బాట పట్టిన రైతులు.. నిరాశతో వెనుదిరిగిన ఉదంతాలు కోకోల్లలు.

ఖాళీ భూములతో సహా..

గతంలో జరిగిన ఈ క్రాప్ నమోదులో సాగు చేయకుండా ఖాళీగా ఉన్న భూములకు చోటుండేది కాదు. కానీ, వాటి వివరాలు కూడా పక్కాగా ఆన్‌లైన్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కౌలుదారుల విషయంలోనూ.. కౌలుదారు కార్డు ఉంటే దాని ఆధారంగా ఈ క్రాప్ చేయాలని, ఒక వేళ అది లేకున్నా సాగుదారుడి కింద కౌలుదారు పేరే నమోదు చేయనుంది. ప్రతి ఎకరం ఫొటో తీసి వివరాలు పక్కాగా నమోదు చేయాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం యాప్‌తో ఈ-పంట నమోదు చేశారు. దానిలో అనేక లొసుగులు ఉండడంతో డేటా కచ్చితత్వంలో లేకపోవడం వల్ల అన్నదాతలకు అన్యాయం జరిగేది. ఇప్పుడు దాని స్థానంలో ఎన్‌ఐసీ యాప్ ద్వారా ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను ఈ ప్రభుత్వం అమల్లోకి తెచ్చి.. దాని ద్వారా పంట వివరాలను నమోదు చేస్తోంది.

డీఎస్సీ అభ్యర్థుల మార్కుల జాబితాలు విడుదల

అవీఇవీ

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ 2025 అభ్యర్థుల నార్మలైజేషన్ జాబితాను శనివారం రాత్రి విడుదల చేసింది. మెగా డీఎస్సీకి 629 పోస్టులు ప్రకటించగా, 21,559 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసి రాత పరీక్షలకు హాజరయ్యారు. అభ్యర్థులకు డీఎస్సీ ఎంపికలో టెట్‌లో సాధించిన మార్కులకు 20 శాతం, రాత పరీక్షకు 80 శాతం మార్కులు వెయిటేజీ ఇచ్చారు. ప్రస్తుతం అభ్యర్థుల టెట్, డీఎస్సీ మార్కులను కలిపి స్కోర్ కార్డులను ప్రభుత్వం ప్రకటించింది. కొందరు టెట్ అర్హత లేకున్నా పరీక్షకు హాజరయ్యారు. వారిని తొలగించారు.

ప్రశాంతంగా ఎఫ్‌ఏ పరీక్షలు

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి ప్రారంభమైన ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ-1) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలను ప్రథమంగా ప్రయోగాత్మకంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్లలో నిర్వహిస్తున్నారు. గతంలో తెల్లకాగితంలో రాసే జవాబులను ప్రస్తుతం అసెస్‌మెంట్ బుక్‌లో రాస్తారు. ప్రతి సబ్జెక్టుకు వేర్వేరుగా బుక్‌లెట్లు ఇచ్చారు. పరీక్షలు ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం సబ్జెక్టులకు నిర్వహించారు. 1నుంచి 10వ తరతి వరకు చదువుతున్న విద్యార్థులు 1.76 లక్షల మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేయాలి. సబ్జెక్టుల వారీగా తరగతి వారీగా పరీక్షను నెంబర్లు కేటాయించారు. ఏ పరీక్ష బుక్‌లెట్‌లో ఆ పరీక్ష కోడ్ నెంబరును నమోదు చేయాలి. ప్రశ్నలకు జవాబులను ఓఎంఆర్ షీట్లలో నమోదు చేయాలి. ఉపవిద్యాధికారులు, ఎంఈవోలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

ఏకేయూ బీఈడీ ఫలితాలు విడుదల

ఒంగోలు విద్య, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన బీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం రిజిస్ట్రార్ బి. హరిబాబు విడుదల చేశారు. మొత్తం 93.47శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో 10,955 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10,339 మంది పాసయ్యారు. యూనివర్సిటీ స్థాయిలో, కళాశాల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.సోమశేఖర్, పీజీ కో ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్, శివరాం పాల్గొన్నారు.

ఆ విత్తనాల అమ్మకాలను ఆపాలి

● దుకాణ యజమానికి ఏవో లావణ్య ఆదేశం

మార్టూరు, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): విత్తనదుకాణంలో షాహిన్ గుమ్మడి విత్తనాల అమ్మకాలను నిలిపివేయాలని ఏవో లావణ్య ఆదేశించారు. సదరు కంపెనీ విత్తనాలు సరిగా మొలకెత్తలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆమె స్పందిస్తూ, మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన మార్టూరులోని దుకాణాన్ని ఆమె పరిశీలించారు. అదేవిధంగా రూ.32,500 విలువైన షాహిన్ గుమ్మడి విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. ఇంకా ఫిర్యాదు చేసిన రైతు పొలం జె పంగులూరు మండలంలోని కొండమంజులూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉందని, అక్కడి వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని ఆమె రైతుకు సూచించారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు


పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హుస్సేన్

మేదరమెట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో భూమిలో సేంద్రియ కర్బనం, జీవవైవిద్యం పెరుగుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షేక్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రాసంగులపాడులో నవధాన్యాల సాగు చేసిన మోదుగుల స్వామిరెడ్డి పొలాన్ని పరిశీలించారు. 1.20 ఎకరాలల్లో 97.75 కిలోల దిగుబడి వచ్చిందని, ఎకరాకు 16 టన్నుల సేంద్రిక కర్బనం వచ్చిందన్నారు. దీని ద్వారా నేలలో తేమను నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతుందని, నేల గుల్లబారి వానపాముల సంఖ్య పెరుగుతుందని అన్నారు. పశువుల మేతగా ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఈ పద్ధతులను ఆచరించాలన్నారు.

విజయవంతంగా ఇంటర్‌డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈక్రమంలో చివరి రోజు విజేతలకు ఎమ్మెల్యే కొండయ్య యువనాయకులు గౌరీఅమరనాథ్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడలపై ఆసక్తితో అంతర్ జిల్లాల నుంచి వేలసంఖ్యలో క్రీడాకారులు రావడం అభినందనీయమన్నారు. క్రీడల్లో పాల్గొనడం వలన అత్యంత ఉల్లాసంగా, ఆనందంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

వాడరేవు (చీరాల), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ప్రతిఇంటిపై 12, 13, 14 తేదీలలో జాతీయ జెండా ఎగరాలని బిజెపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వాడ రేవు గ్రామం నుంచి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ఘనతను వాడవాడలా చాటేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హేమంత్‌కుమార్, మణికుమార్, దేవరాజ్, వెంకటేశ్వరరావు, భరణి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు ఎంపీడీవోపై విచారణ

తర్లుపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళపై ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడడంతో జూలై 23వ తేదీన కేసు నమోదైంది. ఈ మేరకు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సోమవారం విచారణ చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళను, సిబ్బందిని ఒక్కొరిని పిలిచి విచారించారు. మహిళ ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసుపై కూడా విచారణ చేపట్టారు. ఆయనవెంట ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది ఉన్నారు.

అవీ.. ఇవీ..

వ్యవసాయ బోర్లుకు విద్యుత్ కనెక్షన్


మోటార్లను ప్రారంభిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన గ్రామంలోని 46 వ్యవసాయ బోర్లకు సోమవారం విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు రైతులు సమక్షంలో వంద ఎకరాలకు నీరు అందే విధంగా రైతుల మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు దరఖాస్తు చేసిన వెంటనే మంజూరు చేస్తున్నామన్నారు. రైతులకు ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా విద్యుత్ సరఫరాలో లోపాలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. వైదన గ్రామంలో 9 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఒకేసారి ఏర్పాటు చేశామన్నారు. లోఓల్టేజీ సమస్య కూడా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా 46 మంది రైతులు, విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్‌కు, అధికారులకు, లైన్ల ఏర్పాటును సత్వరమే పూర్తి చేసిన కాంట్రాక్టర్ కార్గిల్ చౌదరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్టూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ సరేంద్రాబు, ఏఈ శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ నాయకులు పోగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అందిస్తున్న సేవలు మరువలేనివి


దివ్యాంగులకు వినికిడి యంత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు దాతలు, అధికారులు అందిస్తున్న సేవలు, సహాయ సహకారులు మరువలేనివని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు విశ్రాంతమ్మ అధ్యక్షతన సోమవారం దివ్యాంగుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అర్హత ఉన్న వారు ఆధార్, రేషన్‌కార్డులు, ఇంటిస్థలాలకు సంధించిన సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని ఏపీఎం గద్దె పెదసుబ్బారావు సూచించారు. మండల పరిధిలోని 20 మందికి వినికిడి యంత్రాలను తహసీల్దార్, ఏపీఎంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కే.శారద, మండల దివ్యాంగుల సంఘం నాయకులు వడ్లమూడి వేణు, హనుమంత రావు, సురేష్, చిట్టిబాబు, సీసీ మాదవిలు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

బల్లికురవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలమవారిపాలెం పంచాయతీ జమ్మలమడక కాలనీలో బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసి గర్భవతిని చేసిన ఘటనపై నమోదు అయిన కేసుపై సోమవారం బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు విచారించారు. బాధితురాలు ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా, అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

బైకు అదుపు తప్పి పడి వ్యక్తికి గాయాలు

మండల పరిధిలోని వల్లాపల్లి గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర గాయలపాలైన వ్యక్తిని వెంటనే 108 లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డీజిల్ చోరీపై కేసు నమోదు

అద్దంకి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకులో నిలిపి ఉంచిన ట్రావెల్స్ బస్‌లో డీజిల్ ట్యాంక్ నుంచి డీజిల్ చోరీ చేసిన ఘటనపై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు అద్దంకికి చెందిన శివశంకర్ లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు ట్రావెల్ బస్సు కూడా ఉంది. ఆ బస్సులో ఆదివారం రాత్రి 150 లీటర్ల డీజిల్ కొట్టించి రామ్‌నగర్‌ని పెట్రోల్ బంకులో పెట్టారు. ఆదివారం ఉదయం వచ్చి బస్ స్టార్ట్ చేయగా స్టార్ట్ కాలేదు. డీజిల్ ట్యాంక్ చూడగా డీజిల్ లేదు. శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

దివ్యాంగురాలిపై దాడి కేసులో విచారణ

- చీరాల ఏరియా వైద్యశాలలో బాధితురాలిని పరామర్శించిన సీఐ


దివ్యాంగ బాలికను పరామర్శిస్తున్న సీఐ రమణయ్య

కారంచేడు(చీరాల), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులో దివ్యాంగ బాలిక దేవికపై దాడి ఘటనను పారదర్శకంగా విచారించి నేరస్థులపై చర్యలు తీసుకుంటామని ఇంకొల్లు సీఐ రమణయ్య తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామంలోని ఇరువురు బాలికలపై దాడి చేయడంతో ఆమెకు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. బాలిక మూగ, చెవుడు కావడం తో సైగల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు.

కారంచేడులో భారీ వర్షం

- ఉరుములు, మెరుపులతో ప్రజలు బెంబేలు


వర్షానికి ముందు మేఘావృతమైన ఆకాశం

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఆకాశం ఒక్కసారిగా మేఘామృతం కావడంతో పెద్దఎత్తున వర్షం కురవడంతో ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఆయా శివారు కాలనీలలోని నివాసాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు గ్రామాల్లో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కొద్దిపాటి వర్షం కురిసిన మురుగునీరు వర్షపు నీటితో కలసి రోడ్లపై ప్రవహించడంతో వాహన దారులు ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

విద్యాలయ ప్రాంగణంలోనే ఎరువుల దిబ్బలు

- చెంతనే మండల విద్యాశాఖ కార్యాలయం
- విషజ్వరాలు, వ్యాధులు ప్రబలే అవకాశం
- మిన్నకున్న రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు
- ఉన్నతాధికారులైనా స్పందిస్తారా..?


గొరకాయపాలెం హైస్కూల్ ఆవరణలోని ఎరువు దిబ్బ

అద్దంకి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన సాగాలని ఒక వైపు ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేస్తుండగా అద్దంకి పట్టణంలోని గొరకాయపాలెం హైస్కూల్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. గత ఐదారు సంవత్సరాలుగా పరాయి పంచన నడిచిన హైస్కూల్ తరగతులు గత ఏడాది నుండి నిర్మాణంలో ఉన్న గదులలో నిర్వహిస్తున్నారు. అయితే హైస్కూల్ ఆవరణను ఆక్రమించి ఎరువుదిబ్బలు వేయడం అధికారులు మొక్కుబడిగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. పాఠశాలలో 150 మందికి పైగా విద్యార్థులు 5 నుండి 10వ తరగతి వరకు చదువుతున్నారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణం కూడా చేపడుతున్నారు. అయితే మరుగుదొడ్లలోకి వెళ్లే వీలు కూడా లేకుండా ఎరువు దిబ్బ వేయడం మరింత విమర్శలకు తావిస్తోంది. నిత్యం దుర్వాసన పీల్చుకుంటూ విద్యార్థులు విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కనే మండల విద్యాశాఖ అధికారులు కార్యాలయం కూడా ఉంది. ఇక నిత్యం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించే మున్సిపల్ అధికారులు సైతం అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. పాఠశాల ఆవరణలో ఎరువు దిబ్బలు వేసినప్పటికి రెవెన్యూ అధికారులు స్పందించక పోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో డెంగ్యూ జ్వరాలు, విషజ్వరాలు విలయ తాండవం చేస్తున్న తరుణంలో పాఠశాల ఆవరణలో ఇలా అపరిశుభ్రంగా ఉండే వ్యాధులు ప్రబలవా..? మరి అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో ఉన్న ఎరువు దిబ్బలు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

చేనేతల ర్యాలీలో ఎమ్మెల్యే కొండయ్య



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

దేశాయిపేట (చీరాల), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య పేర్కొన్నారు. చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం రాత్రి వేటపాలెం మండలం దేశాయిపేటలో 'థాంక్యూ సీఎం సార్' కార్యక్రమం నిర్వహించారు. చేనేత రంగాన్ని అభివృద్ధి చేసి ప్రతి కార్మికుని కళ్లల్లో చిరునవ్వులు చిందేలా అండదండలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, యువనాయకులు గౌరీఅమర్నాథ్, హ్యాండ్ లూమ్ చైర్మన్ హేమలత, సీనియర్ టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు పెద్దఎత్తున చేనేతలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సహకరిస్తాం

చీరాల : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందించనున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. సోమవారం స్థానిక బాపనమ్మ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం 28వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. అయితే గత ప్రభుత్వం అవలంభించిన క్వాంటం పెన్షన్ ప్రక్రియతో రిటైర్డ్ ఉద్యోగులు అవస్థలు పడినట్లు వారు ఎమ్మెల్యే దృష్టికి వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే లిఖిత పూర్వకంగా అర్జీ ఇస్తే ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళతానన్నారు. అలాగే ఎరియర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, విశ్రాంత ఉద్యోగులు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, బత్తుల బ్రహ్మారెడ్డి, శివప్రసాదరావు, గుత్తి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాల పోటీలో చందలూరు విద్యార్థుల సత్తా


ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

పంగులూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యోగాసన పోటీలలో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలబాలికలు సత్తాచాటారు. ఒంగోలులోని ఎస్‌పీకేఆర్ అండ్ ఎస్‌టీవీఎన్. ఓరియంటల్ పాఠశాలలో జిల్లా యోగా అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా 50వ జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఈ నెల 10న నిర్వహించారు. వివిధ విభాగాలలో జరిగిన ఈ యోగాసన పోటీలలో 10 నుంచి 12 సంవత్సరాల కేటగిరిలో బాలుర విభాగంలో తేజచరణ్, ఎన్.నిరీక్షణరావు ప్రథమ, ద్వితీయ స్థానం కైవసం చేసుకోగా బాలికల విభాగంలో ఎన్.రత్నకుమారి, కె.హెప్సిబా, వి.అమూల్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. 12-14 వయస్సు మధ్య బాలుర విభాగంలో యం.వెంకటేష్, ప్రథమస్థానం కైవసం చేసుకోగా బాలికల విభాగంలో నాయపాము శృతి, ఎ.లిఖిత, ఎన్.భవ్యశీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. జిల్లాస్థాయి యోగా పోటీలలో గెలుపొందిన ఈ విద్యార్థులు ఈ నెల 23, 24 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా కోవూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీ ప్రతిమ, మధు తెలిపారు. జిల్లా స్థాయి యోగాసన పోటీలలో సత్తాచాటిన ఈ విద్యార్థులను పాఠశాల హెచ్ఎం గిరిజ, పీడీ ప్రతిమ. మధు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

- మట్టిఖర్చులకు సాయం అందజేసిన ప్రభుత్వం
- సంతాపం వ్యక్తం చేసిన ఎస్పీ తుషార్ డూడీ


వెంకటస్వామి అంతిమ వీడ్కోలు పలుకుతున్న పోలీసులు

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పర్వతరెడ్డి వెంకటస్వామి (52) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన జే.పంగులూరు మండలం రేణింగవరం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం గుండెపోటుతో మృతి చెందడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. 1993లో తూర్పు గోదావరి జిల్లాలలో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. అనంతరం ఏఆర్ నుంచి సివిల్ శాఖకు మారి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలుస్టేషన్లలో విధులు నిర్వహించారు. ఆయన మృతి పట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి సంతాపం వ్యక్తం చేశారు. చీరాల డిఎస్పీ ఎం.డి.మోయిన్, అద్దంకి రూరల్ సీఐ డి.మల్లిఖార్జునరావు, జే.పంగులూరు, చినగంజాం ఎస్.ఐలు బి.వినోద్‌బాబు, ఎస్.రమేష్ బాబు, పలువురు పోలీసు అధికారులు వెంకట స్వామి పార్థవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని భార్య హేమలత, కుమార్తెలు శ్రీలక్ష్మి, పల్లవిలను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం పోలీసు శాఖ నుండి మంజూరైన లక్ష రూపాయల నగదు ను అందజేశారు. సోపిరాల గ్రామంలోని శ్మశాన వాటికలో వెంకటస్వామి పార్థివదేహానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

చిల్లచెట్లతో మూసుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్

- తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం
- రాత్రి సమయంలో నిలిచిపోతే అంతే సంగతులు


చిల్లచెట్లతో మూసుకుపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అద్దంకి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరం ఎస్సీ కాలనీ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా చిల్లచెట్లతో నిండి పోయింది. దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే అక్కడకు వెళ్లి ఫీజులు వేసే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణికేశ్వరానికి రెగ్యులర్ లైన్‌మెన్ లేకపోవడంతో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చిల్లచెట్లు తొలగింపు చేయాలని, అదే సమయంలో రెగ్యులర్ లైన్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గోపాలకృష్ణయ్య స్మారక స్థూపం ఏర్పాటుకు వినతి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్రోద్యమ సమయంలో చీరాల - పేరాల ఉద్యమ నేత స్వాతంత్ర్య సమరయోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ఆశయ సాధన కమిటీ, శ్రీ వివేకానంద సేవా సమితి ప్రతినిధులు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపట్ల జిల్లాకు కూడా ఆ మహనీయుని పేరును పెట్టాలని ఆకాంక్షించారు. ఉద్యమ సమయంలో గోపాలకృష్ణయ్య నివసించిన ప్రదేశంలో సుమారు 2 ఎకరాల భూమి ట్రస్టు పరిధిలో ఉందని, సర్వే చేయించి స్మారక స్థూపం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సర్విశెట్టి సుబ్బరామయ్య, తాడివలస దేవరాజ్, సాయి, ప్రభాకరరావు, హరి ప్రసాదరావు, శివ ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, నారాయణ, తడవర్తి చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం


కొలలపూడిలోని రామాలయంలో సీతారామలక్ష్మణ విగ్రహాలు

మార్టూరు,ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామంలో సోమవారం రామాలయం 13వ వార్షికోత్సవ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ట్రస్ట్ చైర్మన్ సూరగాని గంగారావు ఆధ్వర్యంలో అ ర్చకులు శ్రీనివాసరావు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.తదుపరి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న హుస్సేన్

కారంచేడు (పర్చూరు), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆరోగ్యవంతమైన దిగుబడులను సాధించవచ్చని డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం) హుస్సేన్ అన్నారు. సోమవారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వివిధ రకాల కూరగాయలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూములు నిస్సారంగా మారడంతోపాటు, నాశిరకమైన దిగుబడులు వస్తున్నాయన్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయన్ని పోత్సహించే విధంగా అనేక రాయితీలను కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో డిస్టిక్ ఇన్‌చార్జ్ కె.అర్చన, అనిల్ కుమార్, కోటేశ్వరరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన


పల్లెపాలెంలో సర్వే చేస్తున్న అధికారులు

చినగంజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావులు అన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటింటి జ్వరాల సర్వే, పారిశుధ్య కార్యక్రమాలను సోమవారం వారు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని తహసీల్దార్ సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చినగంజాం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కే.అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ అనుమానిత కేసులను రిఫర్ చేయండి


సీజనల్ వ్యాధులపై సమీక్షిస్తున్న పంగులూరు తహసీల్దార్

పంగులూరు : గ్రామాల్లో డెంగ్యూ అనుమానిత కేసులను మెరుగైన చికిత్స కోసం పీహెచ్‌సీలకు రిఫర్ చేయాలని వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య సూచించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆర్ఎంపీలు, ఏఎన్ఎంలతో విషజ్వరాల నియంత్రణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. డెంగ్యూ అనుమానితుల చికిత్స విషయంలో స్టెరాయిడ్స్ వినియోగించవద్దని వారిని డాక్టర్ చెన్నయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగరావు, ఎంపీడీవో సుమంత్, వైద్యాధికారిణి డాక్టర్ బాలరాజేశ్వరి, ఐసీడీఎస్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణపై సమీక్ష

పంగులూరు : పారిశుధ్యం, జ్వరాల నియంత్రణపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సింగారావు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం పరిరక్షణకు ఎబేట్ స్ప్రే చేయడంతోపాటు అవసరమైనచోట ఫాగింగ్ చేయిస్తున్నట్లు ఎంపీడీవో సుమంత్ తెలిపారు. గ్రామాలలో ప్రబలుతున్న విషజ్వరాలను గుర్తించేందుకు సిబ్బందితో నిరంతరం సర్వే నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్యకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, సీహెచ్‌వో భానుమతి పాల్గొన్నారు.

పూనూరులో అధికారుల పర్యటన

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో సోమవారం మండలంలోని వివిధ శా ఖలకు చెందిన అధికారులు పర్యటించారు.ఆరోగ్య సిబ్బంది,పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో అధికారులు డోర్ టు డోర్ ఫివర్ సర్వేశానిటేషన్,మరియు మంచినీటి పథకం వద్ద పరిశీలించారు.గ్రామంలో జ్వరాల బాదితులుఎవరైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ వైద్యాధికారి శ్రీ హర్ష తమ సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు.అంతేగాకుండా ఇండ్ల ముందు నీటి తొట్లులో నిల్వ ఉన్న మురుగునీటిని పారబోయించారు.గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని యంపిడివో యండి జావెద్ పంచాయతీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్లుఎస్ ఏఈ చైతన్య,పంచాయతీ కార్యదర్శి బాగ్యరాజా,తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి

నెల్లూరు (లీగల్),ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసులో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎస్.సరస్వతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరు పోలీసులు పెట్టిన అక్రమ మైనింగ్ కేసులో శ్రీకాంత్ రెడ్డి 12వ నిందితుడిగా ఉన్నారు. మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున 7 రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ వేసిన పిటిషన్‌పై వాద ప్రతివాదనలు విన్నాక శ్రీకాంత్ రెడ్డిని ఈ నెల 12 నుంచి 14 వరకు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 14న విచారణ పూర్తయ్యాక కోర్టులో హాజరు పరచాలని న్యాయాధికారి పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

మంగళవారం 12 ఆగస్టు 2025


అన్నా మాది ఉమ్మడి కుటుంబం. పిల్లల చదువులు, ఆస్పత్రుల కోసం నెల్లూరుకు మా బంధువులు వస్తుంటారు. రెండు, మూడు రోజులు ఇక్కడే ఉంటారు. అందుకని నగరంలో ఇల్లు అద్దెకు తీసుకుంటున్నాం. అద్దె ఎంతయినా ఫర్వాలేదు. ప్రశాంత వాతావరణం కావాలి అంతే.

ఇంట్లో ఒంటరిగా ఉండి ఏం చేస్తావమ్మా. ఒకరి సంపాదనతో ఇల్లు ఎలా గడుస్తుంది. నాకు తెలిసిన వారి బ్యూటీపార్లర్ ఉంది. అక్కడ ఉద్యోగం ఇప్పిస్తాం. నెలకు ఎంతోకొంత ఇస్తారు. వేడినీళ్లకు చన్నీళ్లులా కుటుంబ అవసరాలకు నీ జీతం ఉంటుంది. ఆలోచించుకోమ్మా!'

- ఇంటి యజమానులకు, అమాయక మహిళలకు వేశ్యగృహ నిర్వాహకులు చెబుతున్న మాటలివి. వీరి మాటలు నమ్మి ఇల్లు అప్పగిస్తేనో.. బ్యూటీపార్లర్, సెలూన్లలో పనికి కుదిరితేనో నిలువునా మునిగిపోతున్నారు. పోలీసుల దాడుల్లో వారి బాగోతం వెలుగులోకి వస్తోంది.

'ఉన్నత'మని
ఊబిలోకి..

- గుట్టుగా సెక్స్ రాకెట్ • ఫ్యామిలీ పేరుతో అద్దెకు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు
- ఉద్యోగం పేరుతో యువతులకు వల • ఇతర ప్రాంతాల మహిళలతో కార్యకలాపాలు
- బ్యూటీపార్లర్, సెలూన్లలోనూ హైటెక్ వ్యభిచారం
- పోలీసులు దాడులు చేస్తున్నా ఆగని దందా • వారికీ నెల మామూళ్లు



నెల్లూరు(క్రైం) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా సెక్స్ రాకెట్ నడుస్తోంది. నగరాలు, పట్టణాలకు దూరంగా కాకుండా నడిబొడ్డునే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫ్యామిలీ పేరుతో ఇళ్లు, అపార్టుమెంట్లు అద్దెకు తీసుకుంటున్నారు. అనంతరం మా బంధువులంటూ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను పిలిపించి వ్యభిచారం చేయిస్తున్నారు. నగరంలో సెలూన్ల మాటున కూడా హైటెక్ వ్యభిచారం జోరుగనడుస్తోంది. పోలీసులు ఈ కేంద్రాలపై దాడులు చేస్తున్నా ఈ దందా కొనసాగిస్తున్నారు. ఒకచోట దాడులు చేస్తే మరో ప్రాంతానికి వెళ్లి నిర్వహిస్తున్నారు.

● మారిన ట్రెండ్

'అద్దె ఎంతైనా పరవాలేదు. మాకు ప్రశాంతమైన వాతావరణం కావాలి. మాది పెద్ద కుటుంబం. మా బంధువులు పనులపై వచ్చినప్పుడు మా ఇంట్లోనే భోజనం చేసి, నిద్రిస్తారు.' అంటూ ముందుగానే ఇంటి యజమానులను నమ్మిస్తున్నారు. అద్దె బాగా ఎక్కువ వస్తేచాలు మిగిలిన విషయాలు మాకెందుకు... అన్నట్లుగా ఇంటి యజమానులు సైతం పెద్దగా వారిని పట్టించుకోవడంలేదు. దీంతో అద్దెకు చేరినవారు అమాయకులుగా నటిస్తూ, చుట్టుపక్కల వారితో కలిసిపోతు న్నారు. విటులు ఇళ్లకు వస్తున్న సమయంలో మా బంధువులేనంటూ తమ కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

● సెలూన్, బ్యూటీ పార్లర్ల ముసుగులో...

సాధారణంగా పురుషులకు, మహిళలకు వేర్వేరుగా సెలూన్లు, బ్యూటీపార్లర్లు ఉంటాయి. ఒకవేళ ఇద్దరికీ కలిసి ఉంటే, వేర్వేరుగా క్యాబిన్లు ఏర్పాటు చేసి ఉంటారు. అయితే కొన్ని సెలూన్లు, బ్యూటీపార్లర్లు మహిళల కోసమే, పురుషుల కోసమేనంటూ బోర్డులు పెట్టి లోపల మాత్రం నిబంధనలకు విరుద్ధంగా మసాజ్, వ్యభిచారం చేస్తున్నారు. ఇటీవల ఈ వ్యాపారం జిల్లాలో జోరందుకుంది. నగరంలోని సెలూన్లలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాతోపాటు విటులను, కొంతమంది సెక్స్‌వర్కర్లను పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్న విషయం విదితమే.

● ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు...


కొంతమంది నిర్వాహకులు ఇతర ప్రాంతాల నుంచి మహిళలను జిల్లాకు పిలుస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి సైతం యువతులను, మహిళలను తీసుకు వచ్చి లేడీస్ హాస్టళ్లు, ప్రత్యేక రూమ్‌ల్లోనూ ఉంచుతూ సెలూన్లు, బ్యూటీపార్లర్ల ముసుగులో దందా సాగిస్తున్నారు. అంతేగాక కొన్ని వ్యాపార కార్యాలయాల్లో వారిని ఉద్యోగులుగా చూపుతూ వ్యవహారం నడిపిస్తున్నారని సమాచారం. ఇక అపార్ట్‌మెంట్లు, నివాసాల్లోనూ ఇంకొందరు తమ కుమార్తెలు, కోడళ్లంటూ చెప్పుకుంటూ గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం చేయిస్తున్నారు. ఆయా రాష్ట్రాల నుంచి జిల్లాకు తీసుకువచ్చిన మహిళను బట్టి విటుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు, మూడు నెలలు మాత్రమే బయట నుంచి వచ్చిన వారిని ఉంచి, ఆ తరువాత మరో కొత్త బ్యాచ్‌ను జిల్లాకు తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

● ఉద్యోగాల పేరుతో ఎర

సామాన్య కుటుంబాల్లో చదువుకున్న, చదువుకోని యువతులు, మహిళలు తల్లిదండ్రులకో, భర్తకో అండగా ఉండేందుకు ఏదో ఒక పని చేయాలని ఆలోచిస్తుంటారు. అలాంటి వారిని ఈ ముఠా గుర్తించి, సెలూన్లు, బ్యూటీ పార్లర్లు, ఇతర కార్యాలయాల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ ప్రకటనలు ఇవ్వడం, జాబ్ కన్సల్టెంట్ల ద్వారా వారిని ఎంపిక చేసి ఈ మురికి కూపంలో దించుతున్నారు. లొంగనివారిని డబ్బు ఎరచూపి, లేదా బెదిరింపులకు దిగి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారు.

● పోలీసులకు తెలిసినా..

ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగే ప్రతి విషయం సీఐ, ఎస్ఐ స్థాయి అధికారికి తెలియకపోయినా, ఎప్పటి నుంచో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రం తప్పని సరిగా - మిగతా 7లో..



వరదతో జలకళ సంతరించుకొన్న సోమశిల డ్యాం

40 టీఎంసీలకు చేరుకున్న సోమశిల

కర్నూలులో వర్షాలు ● పెన్నాకు రానున్న భారీ వరద

అనంతసాగరం ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటిమట్టం 40 టీఎంసీలకు చేరుకొంది. ఎగువ నుంచి సోమవారం 15,687 క్యూసెక్కుల నీరు కొనసాగుతుండగా ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,200, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. అయితే కర్నూలు జిల్లాలో ఆదివారం రాత్రి అధిక వర్షపాతం నమోదైంది. దీంతో పెన్నానదికి వాగులు, వంకల నుంచి వరద చేరుతున్నట్లు అధికారులు గుర్తించారు. కడప జిల్లా సిద్దవటం వద్ద ప్రవాహం పెరిగింది. ఇక శ్రీశైలంకు సుంకేసుల, జూరాల ప్రాజెక్టుల నుంచి 1.90 లక్షల క్యూసెక్కులు వస్తుండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు సరఫరా చేస్తున్న నీటిని 35 వేలకు క్యూసెక్కులకు పెంచారు. సోమశిలకు వస్తున్న ఇన్‌ఫ్లో మంగళవారానికి భారీగా పెరగవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

'ఆర్ఎస్ఆర్'పై కఠిన చర్యలు తీసుకోవాలి

నగరంలోని ఇస్కాన్‌సిటీలో ఉన్న ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన విద్యార్థిని హేమశ్రీ ఆత్మహత్యపై న్యాయ విచారణ జరిపి సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం వీఆర్‌సీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో అనమతులు లేకుండా హాస్టల్స్ నిర్వహిస్తూ విద్యార్థుల మరణాలకు కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎస్ఆర్ కళాశాలలో జరిగిన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, యాజమాన్యంతోపాటు వీరికి వత్తాసు పలుకుతున్న ఇంటర్‌బోర్డు అధికారులపైనా కేసులు నమోదు చేయాలన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై ఐదోపట్టణ సీఐ కర్కశంగా వ్యవహరించి లాఠీచార్జి చేయడం అన్యాయమన్నారు. అనంతరం జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్, నరేంద్ర, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. అలాగే విద్యార్థి సంఘాలపై లాఠీచార్జి చేసిన ఐదోపట్టణ సీఐపై చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆదిత్యసాయి డిమాండ్ చేశారు.

జిల్లాలో ఇంటర్ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హాస్టళ్ల నిర్వహణలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయి. అధికారికంగా 116 కళాశాలలు నిర్వహిస్తుండగా అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపులోనే ఉంటుంది. అపార్ట్‌మెంట్లు, ఇరుకు గదుల్లో హాస్టళ్లు నిర్వహిస్తూ ఫీజుల పేరుతో రూ.లక్షలు దండుకుంటున్న యాజమాన్యాలు విద్యపేరుతో మరింత ఒత్తిడి తెచ్చి విద్యార్థులను మానసికంగా కుంగదీస్తున్నారు. ఇది తట్టుకోలేక కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనే ఐదుగురు పిల్లలు ప్రాణాలు తీసుకున్నా అధికారుల్లో మాత్రం చలనం కరువయ్యింది.



ఆర్ఎస్ఆర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాలు

ఇరుకు గదులు..

ఒత్తిడి తట్టుకోలేక నలిగిపోతున్న విద్యార్థులు

16 గంటల చదువు!

- అనుమతుల్లేకుండా ఇంటర్ కాలేజీ హాస్టళ్లు • ఫీజులు మాత్రం ఫుల్.. వసతులు నిల్
- చోద్యం చూస్తున్న అధికారులు • తల్లిదండ్రులకు పుట్టెడు శోకం

నెల్లూరు(విద్య), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, హాస్టళ్ల పరిస్థితి చెరసాలలకే సాటిగా మారింది. తెల్లవారుజాము 4 గంటలకే నిద్రలేచి అర్ధరాత్రి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. బాత్రూమ్‌ల వద్ద క్యూలో నిలబడతూ సిద్ధం కావడం, విరామం లేని తరగతులు, నాసిరక భోజనం, నిద్రలేని రాత్రులు విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యాజమాన్యం ఒత్తిళ్ల తట్టుకోలేక కుంగిపోతూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. రోజుకు 16 గంట పాటు చదువుతూ నీట్, ఐఐటీ, జేఈఈ లక్ష్యంగా నిర్వహించే ప్రత్యేక తరగతులతో ఇబ్బందులు పడుతూ నిత్యం తల్లిదండ్రులతో తాము ఇక్కడ ఉండలేమంటూ విలపిస్తున్నా పట్టించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. కాగా, జిల్లాలో ఇంటర్ కళాశాలలకు మాత్రమే అనుమతులు ఉండగా, హాస్టల్స్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. నాణ్యమైన విద్యను అందిస్తామని తల్లిదండ్రులను నమ్మబలికి అనధికారికంగా హాస్టళ్లు నిర్వహిస్తూ రూ.లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు. చిన్న కిరాణా దుకాణం నడుపుకోవాలన్నా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని వేధించే అధికారులు ఇంటర్ కళాశాలల హాస్టళ్లను పట్టించుకోకపోవడం గమనార్హం. ఏదైనా సందర్భంగా విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే వాటిని బయటకు పొక్కనీయకుండా అన్ని విభాగాలను తమ కనుసన్నల్లో ఉంచుకుంటూ యథావిధిగా తిరిగి హాస్టల్స్ నిర్వహించడం జిల్లాలో పరిపాటిగా మారింది.

● ఆత్మహత్యలతో ఆందోళన

విజ్ఞాన కేంద్రాలుగా నిలవాల్సిన జూనియర్ కళాశాలలు మృత్యు నిలయాలుగా మారుతున్నాయి. కార్పొరేట్ ధనదాహం, మార్కుల కోసం ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు తమ ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో వరుస ఆత్మహత్యలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంటున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. అనధికార హాస్టల్స్‌లో జరుగుతున్న ఈ మరణాలకు సంబంధించి యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఒకటి రెండు రోజులు హడావుడి సృష్టించడం తిరిగి యథావిధిగా కళాశాలను, హాస్టల్‌ను నిర్వహించుకోవడం పరిపాటిగా మారింది. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనధికార హాస్టళ్లలో ఐదుగురికిపైగా బలవన్మరణాలను పాల్పడడం బాధాకరం.

● ఇకనైనా మేల్కొంటారా!?

తాజాగా నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని హేమశ్రీ బలవన్మరణానికి పాల్పడింది. హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. కళాశాల యాజమాన్యం దీన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆసుపత్రికి తరలించి సాధారణ మరణంలా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు బాధిత తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిపై పేరెంట్స్ కమిటీలు, విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇప్పటికైనా ఇంటర్‌బోర్డు అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి అనధికారికంగా నిర్వహిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.



Har Ghar Tiranga
Har Ghar Swachhata

ఇంటింటా జెండా ఎగరాలి!

● 'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీలో జేసీ కార్తీక్ - వివరాలు 8లో..

ప్రజలకు అందుబాటులో ఉంటా!

- భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి
- కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ



సబ్ కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన దామెర హిమవంశీ

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టరుగా దామెర హిమవంశీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడున్న తిరుమాణి శ్రీపూజ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సబ్ కలెక్టరు హిమవంశీ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు ఎప్పుడైనా తనను నేరుగా కలవవచ్చని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజల పట్ల ఏ అధికారి అయినా ప్రభుత్వ ఉద్యోగి అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించినా, వారి సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించటమే ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పనిచేయటం జరుగుతుందని వివరించారు. కాగా, నూతన సబ్ కలెక్టరును పలువురు తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు ఆర్థికంగా స్థిరపడాలంటే పంటల దిగుబడులు గణనీయంగా పెరగాలి. మూసపద్ధతిని వీడి అత్యాధునిక పద్ధతులతో సాగు చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఇది గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో బిందు, తుంపర్ల సేద్యానికి ప్రాధాన్యత ఇస్తోంది. గత ప్రభుత్వం పక్కన పెట్టేసిన సూక్ష్మ సేద్యానికి ఊపిరి పోస్తోంది. 50 నుంచి 100శాతం రాయితీపై పరికరాలను అందిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది. జిల్లాలో 2025-26కు సంబంధించి 6వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యాన్ని నిర్దేశించింది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

సూక్ష్మ సేద్యానికి
ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఎస్సీ, ఎస్టీ రైతులకే కాకుండా ప్రతి రైతుకు రాయితీపై పరికరాలను అందించేలా ఆదేశాలు జారీ చేసింది. 5ఎకరాలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, మిగిలిన రైతులకు 90 శాతం రాయితీ ఇస్తోంది. అదేవిధంగా 5 నుంచి 10 ఎకరాలలోపు రైతులకు 70శాతం, 10 ఎకరాలపైన ఉన్న రైతులకు 50శాతం రాయితీపై పరికరాలు అందిస్తోంది. అదేవిధంగా తుంపర్ల సేద్య పరికరాలు అందరికీ 50 శాతం రాయితీ ఇస్తోంది. మామిడి, నిమ్మ, అరటి, బొప్పాయి, సపోటా, ఆయిల్‌పాం వంటి ఉద్యాన పంటలతోపాటు మినుము, పెసర, మల్బరీ, పూల తోటలు, కాయగూరలు వంటి ఆరుతడి పంటలన్నింటికి బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు రాయితీపై అందిస్తారు.



నిమ్మతోటలో ఏర్పాటు చేసిన సూక్ష్మ సేద్య పరికరం

రైతు సేవా కేంద్రాల్లో నమోదు

సూక్ష్మసేద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఈ విధానం ద్వారా అవసరం మేరకే నీటి వినియోగం ఉండడంతో చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో ఎరువులు, పురుగు మందులపై వెచ్చించే ఖర్చులు తగ్గుతాయి. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బిందు, తుంపర్ల సేద్య పరికరాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) వారి వివరాలను నమోదు చేసుకోవాలి. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఫోన్ నెంబర్లు ముఖ్యం. పూర్తి వివరాలకు ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించండి.

- బి.శ్రీనివాసులు, పీడీ, ఏపీఎంఐపీ

● 3,557 మంది రైతులు రిజిస్ట్రేషన్

జిల్లాలో ఈ ఏడాదికి 6వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికే 3557 మంది రైతులు 4402 హెక్టార్లలో పంటల సాగుకు అవసరమైన పరికరాల కోసం రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇందులో ఇప్పటిదాకా 1067 మంది రైతులకు సంబంధించి 1475 హెక్టార్లలో ప్రాథమిక సర్వే పూర్తయింది. అదే విధంగా 280 మంది రైతులు 379 హెక్టార్లకు సంబంధించి వారి వాటా సబ్సిడీ నగదు చెల్లింపులు జరిగాయి. 177 మంది రైతులకు సంబంధించి 264 హెక్టార్లకు కలెక్టర్ ఆనంద్ నుంచి పరి పాలన అనుమతులు వచ్చాయి.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 510



చెత్త రిక్షాల పంపిణీ

వలేటివారిపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం గ్రామ పంచాయతీలో ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా పంచాయతీ నిధులతో నూతనంగా రెండు చెత్త రిక్షాలను కొనుగోలు చేసి సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వాటిని క్లాప్‌మిత్రలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, సర్పంచు సాదు శ్రీలత, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అందని 'ఉపాధి' కూలి!

● ఆరు వారాలుగా శ్రామికుల అవస్థ ● భారంగా మారిన కుటుంబ పోషణ ● బిల్లులు చెల్లించాలని వేడుకోలు

వలేటివారిపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ ఆరు వారాలుగా చేసిన పనులకు కూలి డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరగడంతో శ్రామికులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ భారమై అప్పులు చేస్తూ అవస్థలు పడుతున్నారు. కూలి డబ్బులు చెల్లించి మా ఆకలి తీర్చండయ్యా.. అంటూ వేడుకుంటున్నారు. మండలంలో ఉపాధి హామీ పనులకు వెళ్లే శ్రామికుల దుస్థితి ఇదీ. మండలంలోని 21 పంచాయతీల్లో 11,375 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి రోజూ సుమారు 5 నుంచి 6 వేల మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వీరికి ఆరు వారాలకు సంబంధించిన కూలి నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. వ్యవసాయ పనులకు వెళ్లాలనుకుంటే వర్షాలు లేక వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. చేసిన పనులకు ఉపాధి కూలీ రాకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



అయ్యవారిపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)

దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కొందరికి 100 రోజుల పని దినాలు పూర్తికావడం, మరికొందరికి వర్షాలు పడడంతో పనులు నిలిపివేశారు. దీంతో అటు పనులు లేక, ఇటు చేసిన పనులకు నగదు చెల్లించకపోవడంతో శ్రామికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూలీలకు రావల్సిన నగదు చెల్లించాలని శ్రామికులు కోరుతున్నారు.

ఆరు వారాల డబ్బులు జమ కాలేదు

ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సకాలంలో బిల్లులు రావడం లేదు. పనులు చేసి ఆరు వారాల డబ్బులు తమ ఖాతాలోకి జమ కాలేదు. కుటుంబపోషణ కోసం ఇబ్బందులు పడుతున్నాం. అప్పు తెచ్చి ఇంటి ఖర్చులకు వినియోగించుకొంటున్నాం. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

\- కొండపనాయుడు, వలేటివారిపాలెం

బిల్లులు ఆన్‌లైన్ చేశాం

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన శ్రామికులకు ఆరు వారాలకు సంబంధించి న బిల్లులు ఆన్‌లైన్ చేశాం. త్వరలోనే నిధులు విడుదలవుతాయి. నిధులు విడుదలైన వెంటనే శ్రామికుల బ్యాంకు ఖాతాలోకి జమ అవుతాయి. శ్రామికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

\- దయాసాగర్, ఏపీవో, వలేటివారిపాలెం

ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించాలి

● కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

కావలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత హెచ్చరించారు. సోమవారం ఆమె గైనకాలజిస్ట్ డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ మేఘనాథ్, డిప్యూటీ సహాయ అధికారి ఎస్ శివకుమార్‌తో కలిసి పట్టణంలోని ప్రవీణ్, లత తల్లిపిల్లల, రవికాంత్, లక్ష్మీనారాయణ ఆసుపత్రులతో పాటు ఎస్‌వీ ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రుల రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలు, ఇన్, అవుట్ పేషెంట్ల వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పొల్యూషన్, ఫైర్‌సేఫ్టీమెజర్మెంట్, బయోమెడికల్ వేస్టేజ్, ఆసుపత్రి అందిస్తున్న సేవలు, డాక్టర్ల వివరాలు, వారు వసూలు చేసే ధరల వివరాలను తెలిపే బోర్డులను ప్రదర్శించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకొకసారి ప్రతి ఆసుపత్రిని సందర్శించి లోటుపాట్లు ఉంటే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ బ్రిజిత

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18, 19 తేదీలలో నెల్లూరులో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నత్తా రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 25వరకు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని, ఈ మహాసభలకు కందుకూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ సానుభూతిపరులు, యువతీ యువకులు తరలివెళ్లేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆనంద్‌మోహన్, కే.మురళి, సీహెచ్ దుర్గాప్రసాద్, బొజ్జా చంద్రమోహన్, నరసయ్య, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు 'డ్రోన్' బహూకరణ

కందుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ డివిజన్ పోలీసులకు రూ.1.5 లక్షలు విలువైన డ్రోన్ కెమెరాను యోధ డయాగ్నోస్టిక్స్ అధినేత కంచర్ల సుధాకర్ బహూకరించారు. దీనిని ఆయన తండ్రి కంచర్ల వెంకటేశ్వర్లు సోమవారం సబ్ డివిజన్‌లో డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యంకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి అసాంఘిక, సంఘ విద్రోహ కార్యక్రమాలు జరుగుతున్నా ఆ సమాచా రం సేకరణకు డ్రోన్ కెమెరా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమవం తుగా తోడ్పాటునందించిన కంచర్ల సుధాకర్‌ను అభినందించారు. ఆయన తండ్రి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించారు. కార్యక్ర మంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు అన్వర్‌బాషా, మంగారావు, పట్టణ ఎస్ఐ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీకి డ్రోన్ కెమెరా అందజేస్తున్న కంచర్ల వెంకటేశ్వర్లు

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా



సబ్‌స్టేషన్ ఎదురుగా ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జలదంకి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం జలదంకి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి, అదానీసంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేపట్టిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత అదేవిధానాన్ని కొనసాగిస్తూ అదానీ సంస్థ అడుగులకు మడుగులు ఒత్తుతోందని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతిపత్రంను అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, గడ్డం విజయలక్ష్మి, మేలంగి ఆంథోనీబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నత'మని ఊబిలోకి!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తుంది. కానీ కొందరు వ్యభిచార గృహాల నిర్వాహకుల వద్ద భారీ మొత్తంలోనే నగదు తీసుకుంటూ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకురావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా, కొందరు రాజకీయ నేతలు, విలేకర్ల ఒత్తిళ్లకు తలొగ్గి వారు సైతం మిన్నకుండిపోతున్నారు. స్థానికులు సమాచారం ఇచ్చినప్పుడు మాత్రం విధిలేని పరిస్థితుల్లో దాడులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ దందాను అరికట్టాల్సిన అవసరం ఉంది.

'టీఆర్‌ఆర్' అధ్యాపకుల నిరసన



కళాశాల ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అధ్యాపక సంఘాలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి కళాశాల ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అధ్యాపకుల బదిలీల ప్రక్రియను తక్షణం చేపట్టాలని, దేశంలోని 26 రాష్ట్రాలలో అమలులో ఉన్నవిధంగా తమను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా రీడిజిగ్నేట్ చేయాలని, గత ప్రభుత్వంలో ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో నియమిస్తూ జారీచేసిన జీఓనెం. 42ను తక్షణం రద్దుచేయాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం తగు ఉత్తర్వులు జారీ చేయకుంటే ఈనెల 18న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పీ.రాజగోపాల్, ఎన్.తిరుపతిస్వామి, కమలబాబు, ఎస్వీ శ్రీహరి, ఏడుకొండలునరేంద్ర, కే.సుజాత, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



తిమ్మారెడ్డిపాలెంలో నూతనంగా ప్రతిష్ఠించిన గంగమ్మ విగ్రహం



ఆలయం వద్దకు పాలు, పెరుగు, నెయ్యి తీసుకువస్తున్న మహిళలు

లింగసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో గ్రామ దేవత గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభంగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నూతన గంగమ్మ విగ్రహంతో పాటు పోతురాజు, వినాయకస్వామి, వీరభద్రస్వామి విగ్రహాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం విగ్రహాలను ధాన్యంలో ఉంచారు. రెండవ రోజు ఈ విగ్రహాలను ఊరేగింపుతో ఆలయం వద్దకు తీసుకొని వచ్చి మహిళా భక్తులు బిందెలతో పసుపు నీళ్లు తీసుకొని వచ్చి పూజలు చేశారు. మూడవ రోజు సోమవారం గ్రామస్థులు మేళతాళాలు, భాజాభంత్రీల మధ్య విగ్రహాలను పాలు, పెరుగు, నెయ్యితో అభిషేకం చేశారు. అనంతరం నవకోటి ధాన్యాలతో గంగమ్మ దేవత విగ్రహాన్ని ఆలయం లోపల, పోతురాజు, వినాయస్వామి, వీరభద్రస్వామి విగ్రహాలను ఆలయం వెలుపల ప్రతిష్ఠింప చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గర్భిణులు రక్తహీనతను అధిగమించాలి



గర్భిణులకు ఐరన్‌పోలిక్ సిరప్‌లు అందచేస్తున్న డాక్టర్ మహేష్

కావలి. ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించాలని వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్‌సెంటర్ డాక్టర్ మహేష్ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ పథకం కింద డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించడానికి తరచూ రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న వారు అవసరమైన పౌష్టికాహారం తీసుకోవటమే కాక అవసరమైతే రక్తం కూడా ఎక్కించుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందు లు అందచేస్తారని చెప్పారు. తద్వారా మాతృ, శిశు మరణాలు నివారించుకోవచ్చున్నారు. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ వారు ఐరన్‌పోలిక్, కాల్షియం, జింక్ విటమిన్స్ సిరప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కే.తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సీవో ప్రసాద్ పాల్గొన్నారు.

162 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 299 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 162 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-121, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 137 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.221.76గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

పరిహారం పెంచాలి

● ఉప్పరపాలెం గ్రామస్థుల వినతి

ఉలవపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు పరిధిలో భాగంగా తరలించే గ్రామాల్లో ఒకటైన ఉప్పరపాలెం గ్రామం ఎస్సీ కాలనీవాసులు తమకు పరిహారం ప్యాకేజీని పెంచాలని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో పర్యటించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిధిలో వచ్చే నష్టపరిహారాలను వివరించారు. ఒక్కో పీడీఎఫ్ కుటుంబానికి జీవన భృతి, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు పరిహారం అందిస్తుందని తెలిపారు. దీనిపై ఎస్సీ కాలనీవాసులు కరేడు పరిసర ప్రాంతంలోనే ట్రాన్స్‌పోర్టుకు అనుకూలంగా ఉండే ప్రాంతమైతేనే వెళ్లేందుకు అంగీకరిస్తామని, పీడీఎఫ్ కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం పెంచేలా చూడాలని తమ అభిప్రాయాన్ని వినతిపత్రంలో పేర్కున్నారు. దీనిపై డిప్యూటి కలెక్టర్ స్పందిస్తూ కాలనీవాసుల వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించండి

కలిగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు గ్రామ సర్వే నెంబరు 739లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సోమవారం నిర్వహించిన గ్రామసభలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని గ్రామస్థులు కోరారు. తహసీల్దారు గిరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో 606.05 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు యోగ్యవంతమైన భూములను ఏపీఐఐసీకి అప్పగించేందుకు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మొక్కా సుజాత, స్థానిక టీడీపీ నాయకులు బీవీ రామారావు, హజరత్‌రావు పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



గుడ్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు ఎస్సీ కానీలో వెలసి ఉన్న మాదిగ సామాజికవర్గం కులదేవత మాతమ్మ ఆలయ పునఃనిర్మా ణానికి సోమవారం భూమి పూజ చేశారు. పూర్వం నుంచి ఉన్న ఆలయం స్థానంలో నూతన ఆలయం నిర్మించేందుకు కాలనీవాసులు శ్రీకా రం చుట్టారు. గుడ్లూరుకు చెందిన జీఎస్‌ఆర్ ఫౌండేషన్ అధినేత గుండెమడుగుల స్టీఫెన్ సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణానికి మంచిరాజు మురళీమోహన్, అపర్ణ దంపతులు తమ చిన్నకుమారుడు, కోడలు షణ్ముఖశ్రీహర్ష, దురచిత్ర పేరుతో రూ.25001లు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

రేపు అన్నదాత సుఖీభవ ర్యాలీ

జలదంకి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈనెల 13న నిర్వహించ తలపెట్టిన అన్నదాత-సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ర్యాలీ బుధవారం దుత్తలూరు సెంటర్ నుంచి ప్రారంభమై ఉదయగిరి ఏఎంసీ కార్యాలయం వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో అందరు కూటమి నాయకులు తప్పక పాల్గొనాలని కోరారు.

పీజీఆర్‌ఎస్‌కు 3 వినతులు

కొండాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు 3 వినతులు అందినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. తూర్పుఎర్రబల్లిలో దారిని ఆక్రమించారంటూ ఒకటి, భూముల ఆధార్ లింకు కోసం 2 వినతులు అందాయన్నారు. వీటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

● **బిట్రగుంట(ఆంధ్రజ్యోతి):** బోగోలు తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందులో బోగోలు, బిట్రగుంట పంచాయతీల్లో ఇంటి స్థలాలకు సంబంధించి సర్వే నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. తాళ్ళూరు, జక్కేపల్లిగూడూరు పంచాయతీలో రైతులు పేర్ల సవరణపై రెండు అందాయని తెలిపారు.

శిథిలమైన ఆర్టీసీ బస్ షెల్టర్ పరిశీలన



శిథిలమైన ఆర్టీసీ బస్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న బీద గిరిధర్, జనసేన, బీజేపీ నాయకులు

అల్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అల్లూరులో రెండు దశాబ్దాల కాలంగా శిథిలావస్థలో ఉన్న ఆర్టీసీ బస్టాండును సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, జనసేన, బీజేపీ నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న బస్టాండును ఏ విధంగా చేస్తే ప్రజలకు వినియోగంలోకి వస్తుందోనే అంశంపై చర్చించారు. పునఃప్రారంభానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, నజీర్‌బాషా, కారుమంచి కార్తీక్ శర్మ, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు భద్రత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ అన్వర్‌బాషా

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు భద్రత ప్రమాణాలు పాటించటంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఐ అన్వర్‌బాషా కోరారు. పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సోమవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి బ్యాంకులో విధిగా హై రెజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అవి ఎల్లవేళలా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు తమ వాహనాలను రోడ్డుపై పెట్టి వెళ్తున్నందున బ్యాంకులు ఉన్న అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందన్నారు. తమ బ్యాంకుల వద్ద వాహనాలను క్రమపద్ధతిలో పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుపై వాహనాలు నిలపకుండా పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవటం ద్వారా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ పులి శివనాగరాజు పాల్గొన్నారు.

ఎంఈవో మాల్యాద్రికి ఘన సన్మానం



ఎంఈవో-1 మాల్యాద్రిని సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు వెంగళరావు, తదితరులు

లింగసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఎంఈవో-1గా నియమితులైన కనుపర్తి మాల్యా ద్రిని సోమవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో జిల్లా నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లపోతు వెంగళరావు టీడీపీ నాయకులతో కలిసి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పలు వురు నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కోర్టు న్యాయాధికారి బదిలీ

నెల్లూరు(లీగల్) : నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే కోర్టు న్యాయాధికారిగా పని చేస్తున్న పాలమంగళం వినోద్‌ను కర్నూలు జిల్లా డోన్ ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.



శివయ్యా.. ఆదుకోవయ్యా!

వరికుంటపాడు పంచాయతీ పరిధి జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కొండప్రాంతంలో మైనింగ్ తవ్వకాల అనుమ తులను రద్దు చేయాలని సోమవారం ఆం దోళనకారులు గ్రామంలోని శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి, ఆంధ్రావారిపల్లి నుంచి ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని 'శివయ్యా.. నువ్వే మాకు దిక్కయ్యా'... అంటూ శివుడ్ని వేడుకున్నారు. తాము సాగిస్తున్న పోరాటాలు ఫలించేలా ఆశీర్వదించాలని కోరారు. కాగా పోలీసు మాత్రం ఆలయాలు, చర్చిల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి, బహిరంగ ప్రచారం చేసుకోవద్దని ఆందోళనకారులను హెచ్చరించారు.

- వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)

ధాన్యం రంగు మారుతోంది!

కనిగిరి రిజర్వాయర్ పరిధిలో ఇటీవలి కాలంలో వరి ధాన్యం రంగు మారుతోందని సోమవారం ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు గుర్తించారు. కోవూరు పరిసర ప్రాంత పొలాల్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు మధుసూదన్, పరమశివ, శ్రీలక్ష్మి పరిశీలించారు. మాట్లాడుతూ రంగుమారుతున్న గింజలున్న పొలంలో ప్రొపికేన్ జోల్ 150 మిల్లీ లీటర్ల ద్రావకాన్ని నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వారి వెంట వ్యవసాయాధికారులు అనిత, రజని ఉన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



రంగుమారిన వరిగింజలు

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

చిరుజల్లులు.. పెద్ద మడుగులు

సంగం మండలం దువ్వూరు మిట్టపాళెం ప్రధానవీధిలో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉంది. సిమెంట్ రోడ్డు వేసి డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో వర్షపునీటితో పాటు ఇళ్లలోని మురికినీరు వెళ్లేందుకు మార్గం లేక సిమెంట్ రోడ్డు పైనే నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆ నీటిలోనే నడిచి వెళ్లాల్సి వస్తున్నది. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



18 నుంచి బ్యారన్ల రిజిస్ట్రేషన్

- ఇక నుంచి మూడేళ్లకొకసారి ప్రక్రియ

మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి): పొగాకు బ్యా రన్లను ఈ ఏడాది నుంచి మూడేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు డీసీపల్లి వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 2025-26 పంట కాలానికి సంబంధించి ఎఫ్‌సీవీ పొగాకు గిరాకీని, ప్రస్తుతం రైతుల వద్ద నిల్వలను దృష్టిలో ఉంచుకొని 1,420 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతించామన్నారు. బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 18 నుంచి అక్టోబరు 27వరకు నిర్వహించనున్నామని ఆయన వివరించారు. నవంబరు 7వరకు అపరాధ రుసుం రూ.100, నవంబరు 19వరకు రూ. 400 చెల్లిస్తే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఒకసారి రిజిస్టర్ అయిన బ్యారన్‌ను మూడేళ్లవరకు మరొకరిపేరుపై బదిలీ చేయబోమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లీజుదారులు కూడా గమనించాలన్నారు. 2025-26 పంటకాలానికి 7.25ఎకరాల్లో సాగు చేసి, పండించిన 3,665 కిలోల పం టను మాత్రమే అమ్మకానికి అనుమ తించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు అందినట్లు ఆయన తెలిపారు.

ఈపీఎఫ్ డెత్ క్లెయిమ్‌లకు ప్రత్యేక డ్రైవ్

- ఫిర్యాదుల కోసం ప్రత్యేక నెంబరు
- రీజినల్ కమిషనర్ రవితేజ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్ డెత్ క్లెయిమ్‌ల పరిష్కారం కోసం సెప్టెంబరు చివరి వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఈపీఎఫ్ కడప రీజినల్ కమిషనర్ రవితేజ కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈపీఎఫ్‌వో సభ్యులకు, యాజమాన్యాలకు, పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా డెత్ క్లెయిమ్‌ల కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, చిత్తూరు తదితర జిల్లాల పరిధిలోని ఈపీఎఫ్ సభ్యుల, నామినీలు డెత్ క్లెయిమ్‌లకు సంబంధించిన వివరాలు, ఫిర్యాదుల కోసం 9491138280 నెంబర్‌ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు. ఈ డ్రైవ్‌తో అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని, వా ట్సాప్‌లో సందేశం పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఈపీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

లైంగికదాడిపై డీఎస్పీ విచారణ

సంగం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంగం పోలీస్ స్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసును డీఎస్పీ వేణుగోపాల్ సోమవారం విచారించారు. సంగం - కలిగిరి రహదారిలోని మామిడి తోటలో ఈనెల 3న రాత్రి తోట యజమాని యేసోబు, కొంత మంది యువకులతో మందు పార్టీ చేసుకున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో యేసోబు తోటలో కాపలాగా ఉన్న మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ మహిళ మరుసటి రోజు తన భర్తతో కలిసి నెల్లూరు ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో విచారించిన సంగం పోలీసులు యేసోబుపై లైంగిక దాడి కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ నిమిత్తం డీఎస్పీ తోట వద్దకు వెళ్లి బాధితురాలిని సాక్షులను విచారించారు. ఈ విచారణలో ఆయనతోపాటు ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

నులిపేద్దాం!



విద్యార్థి దశలో ఎక్కువ మంది పిల్లలను బాధించే ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది నులి పురుగుల సమస్య. వారి శారీరక ఎదుగుదలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో నులిపురుగుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు సార్లు నివారణ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో డీ వార్మింగ్ కార్య క్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించనుంది.

- చిన్నారుల్లో నులిపురుగుల సమస్య
- రక్తహీనత, పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు
- నిర్మూలిస్తేనే ఎదుగుదలకు ప్రయోజనం
- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం
- జిల్లాలో 5.75 లక్షల మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ
- పాఠశాలలు, కళాశాలల్లో అమలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పలు వ్యాధులకు కారణమైన నులిపురుగులు విద్యార్థులను తీవ్రంగా కుంగదీస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ప్రస్తుత జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య తీవ్రంగా ఉందని తెలియచేసింది. దీని కారణంగా రక్తహీనతకులోనై పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. పౌష్టికాహార లోపం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వాంతులు, అతిసార వంటి సమస్యలు కూడా ఏర్పడడంతో వీరిలో శారీరక, మానసిక ఎదుగుదల మందకొడిగా సాగుతుందని తెలియ చేసింది. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టలేకపోవడం, చిన్న వ్యాధులకే ఇంటి పట్టున ఉండాల్సిన పరిస్థితి ఉండడం, దీర్ఘకాలం బడికి సెలవు పెట్టాల్సి రావడంతో వీరి విద్యా ప్రమాణాలు కుంటు పడుతున్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో ఒకే మాత్రతో చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచిం చిన మేరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో బడిపిల్లల్లో నులి పురుగుల నివారణకు చర్యలు చేపట్టింది



ఆల్‌బెండజోల్ మాత్రలు

జిల్లా వ్యాప్తంగా అమలు



డీ వార్మింగ్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నాం. గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులందరితో ఆల్‌బెండజోల్ మాత్ర మింగిస్తాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు 6,33,386 మాత్రలు వచ్చా యి. ఇప్పటికే వాటిని విద్యా సంస్థలకు పంపిణీ చేశా ము. రెండేళ్లలోపు చిన్నారులకు అరమాత్రను పొడిచేసి మింగించాల్సి ఉంటుంది. మూడు నుంచి 19 ఏళ్ల వారితో ఒక మాత్రను చప్పరించి మింగిచేలా అన్నీ ఏర్పాట్లు చేశాం. జిల్లాలో మొత్తం 5.75 లక్షల మంది చిన్నారులకు ఈ మాత్రలు వేస్తున్నాము.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

1 నుంచి 19 ఏళ్ల వరకు...

నులి పురుగుల నివారణకు ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసున్న వారితో అధికారులు అల్ బెండజోల్ మాత్రలు మింగించనున్నారు. ఇందుకోసం జిల్లాలో 5,75,806 మంది విద్యార్థులను గుర్తించారు. మొత్తం 2594 ప్రభుత్వ పాఠశాలలు, 811 ప్రైవేట్ స్కూళ్లలో ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే 146 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల్లోనూ, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి కళాశాలల్లోనూ, 2912 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ విద్యార్థులతో మధ్యాహ్న భోజనం తర్వాత మాత్ర మింగించేలా ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో ఈ డీవార్మింగ్ కార్యక్రమాన్ని మూడు రోజులు అమలు చేస్తున్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యులు అందుబాటులో ఉంటారు.



వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికారుల ఆకస్మిక తనిఖీ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో వైద్య బృందం నగరంలోని రెయిన్‌బో, క్రైస్ట్, రమాదేవి. శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ, అపెక్స్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. వాటిలో రికార్డుల ను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతీ ఆసుపత్రికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక, బయో మెడికల్ వేస్ట్ మెనేజ్‌మెంట్ అనుమతి తప్పని సరిగా ఉండాలని సూచించారు. వైద్య చికిత్సల ఫీజుల వివరాలతో పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి అనుమానితులు ఎవరైనా ప్రైవేటు ఆసుపత్రులకు వస్తే దగ్గరలో ఉన్న ప్రభుత్వ కఫం కేంద్రానికి పంపించాలని సూచించారు. వారికి వైద్య పరీక్షల్లో క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆరు నెలలు ఉచిత మందులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్షయ నివారణ సిబ్బంది తలసీరామ్, హరీష్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

- ఏఎస్పీ సౌజన్య



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని, అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులకు సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 98 మంది బాధితులు ఫిర్యాదులు సమర్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, డీటీసీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని యంత్రాంగానికి సూచించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 411 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 141. మిగిలినవి వివిధ శాఖలకు చెందినవి ఉన్నాయి.

పీ-4 మార్గదర్శుల ఎంపికకు కృషి చేయాలి

పీ-4 మార్గదర్శుల ఎంపికకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. పీ-4పై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈనెల 19న రాష్ట్ర స్థాయిలో పీ-4 పథకాన్ని ఆవిష్కరిస్తున్నందున, మార్గదర్శుల ఎంపికను అధికారులు సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో మృతి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్ జేసీకి వినతిపత్రం ఇచ్చారు. ఆ విద్యార్థిని మృతి పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నగరంలో ఇప్పటికే నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, కార్పొరేట్ కళాశాలలు అనుమానాస్పద మరణాలకు కేంద్రాలుగా మారాయని ఆరోపించారు.
- అంధులను సూపర్ సిక్స్ పథకాలకు అర్హులను చేసి, అన్నీ ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని ఏపీ అంధుల సమాఖ్య కోరింది. ఈ మేరకు ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు షేక్ జకావుల్లా వినతిపత్రం ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ శాశ్వత కార్యాలయాన్ని నగర పరిధిలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సమాఖ్య జిల్లా సలహాదారు ఎస్‌కే మస్తాన్, ప్రధాన కార్యదర్శి డీ కేశవులు, వికలాంగుల ఐక్యసంఘం అధ్యక్షుడు షేక్ సనావుల్లా, ఎస్‌కే జిలానీ తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు సమస్యను తెలుపుతున్న బిషప్ ప్రశాంతం తదితరులు

క్రైస్తవుల నిరసన

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, పాస్టర్లు, సిస్టర్లపై దాడులు, అక్రమ కేసులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నెల్లూరు క్రైస్తవ సమైక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిషప్ ఎండీ ప్రశాంతం మాట్లాడుతూ 1950 ఆగస్టు 10న జారీ అయిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్, హిందూ మతం తప్ప ఇతర మతస్తులను షెడ్యూల్ కాస్ట్‌గా పరిగణించరాదని పేర్కొనడం రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమన్నారు. అనేక పోరాటాల తర్వాత 1956లో సిక్కులకు, 1990లో బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించి, దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు ఇంతవరకు కల్పించలేదని ఆరోపించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో జేసీకి అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ కలివెల ఎలీషా కుమార్, మేజర్ డేనియల్, పాస్టర్లు, టిన్నర్ బాబు, డేవిడ్ దయాసాగర్, క్రాంతికుమార్, రాజశేఖర్, హృదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఏసీ మెకానిక్ మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్ బిగించే క్రమంలో ప్రమాదవశాత్తు టెర్రస్‌పై పడి గాయాలపాలై చికిత్స పొందుతూ ఏసీ మెకానిక్ మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని పొదలకూరురోడ్డు ఇందిరానగర్‌లో ఏసీ మెకానిక్ లతీఫ్(34) నివసిస్తు న్నాడు. ఈ నెల 8వ తేదీన తన అన్న సలీమ్‌తో కలిసి హరనాథపురంలోని ఓ ఇంట్లో ఏసీ బిగించేందుకు వెళ్లాడు. లతీఫ్ మూడో అంతస్థులో కంప్రెషర్ బిగించే క్రమంలో కాలు జారి పక్క మిద్దె టెర్రస్‌పై పడ్డాడు. తలకు, ఛాతీకి గాయాలయ్యాయి. అతడిని స్థానికులు నారాయణ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. బంధువు పర్వేజ్ ఫిర్యాదుతో బాలాజీనగర్ స్టేషన్ ఎస్ఐ పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం) ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ప్రశాంతి నగర్‌లో శ్రీనివాసులు(55) కుటుంబం నివసిస్తోంది. ఆయన కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు, అక్కడి నుంచి నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం అక్రమ తరలింపు కేసులో కాకాణికి బెయిల్

నెల్లూరు (లీగల్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌కి బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి షేక్ నిషాద్ నాజ్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఇందుకూరుపేట పోలీసులు కాకాణిని ఈ కేసులో ఒక నిందితునిగా చేర్చి ఉన్న విషయం పాఠకులకు విదితమే. దీనికి సంబంధించి వాద ప్రతివాదనలు విన్నాక న్యాయాధికారి కాకాణికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.25 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తు ఇవ్వాలని కూడా ఉత్తర్వులలో పేర్కొన్నారు..

'హర్‌ఘర్ తిరంగా'లో భాగస్వాములు కండి

- హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీలో జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో జిల్లా ప్రజలంతా దేశభక్తి ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా-హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్ర మాల్లో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన హర్‌ఘర్ తిరం గా-హర్ ఘర్ స్వచ్ఛత ర్యాలీని ఆయన ప్రారం భించారు. వీఆర్సీ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశ రక్షణ ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంత ముఖ్యమని చెప్పారు. మన జాతీయ జెండాను గౌరవించుకుంటూ, మన దేశాన్ని శుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛమైన భార తదేశాన్ని నిర్మించటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినో త్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తు న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలం దరూ తమ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛ భారత దేశం కోసం తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నెల్లూరు (వైద్యం) : జిల్లాలో హెచ్ఐవీ, సుఖవ్యాధులు, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేయాలని వైద్య ఆరోగ్య శాఖను జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో వైద్యాధికారులతో కలిసి ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయా వ్యాధులు, సమస్యలపై రెండు నెలలు గ్రామ స్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఐవీఆర్ఎస్ కాల్స్‌లో సోమలరేగడకు ప్రథమస్థానం

- రాష్ట్రంలో నాలుగో స్థానం

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేసే ఐవీఆర్ఎస్ కాల్స్‌లో దుత్తలూరు మండలం సోమలరేగడ పంచాయతీ రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానాన్ని, జిల్లాస్థాయిలో ప్రథమస్థానాన్ని సాధించింది. సోమలరేగడ పంచాయతీలోని ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఐవీఆర్ఎస్ కాల్స్‌లో పారిశుధ్య కార్మికులు మీ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా... అనే ప్రశ్నకు 90, వారానికి కనీసం రెండుసార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా ... అనే ప్రశ్నకు 100 శాతం సమాధానం ఇచ్చారు. దీంతో సరాసరి 95 శాతం మంది ప్రజలు ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సమాధానం ఇవ్వడంతో ఆ పంచాయతీ రాష్ట్రస్థాయిలో నాల్గవ, జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. దీంతో పంచాయతీ కార్యదర్శి మేడిబోయిన నాగరాజుకు సోమవారం డీపీవో ఎల్.శ్రీధర్‌రెడ్డి ఫోన్ చేసి ప్రశంసించారు. త్వరలో జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, మండలంలోని పంచాయతీ కార్యదర్శులను ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



సోమలరేగడలో ఇల్లిల్లు తిరిగి చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు